# మనుషులు చేసిన దేవుళ్ళు

పెద్దకథ

- పాణిని జన్నాభట్ల



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 241

కౌముది మాసపత్రికలో

జనవరి 2022 సంచిక నుంచి అక్టోబర్ 2022 సంచిక వరకూ

వచ్చిన పెద్ద కథ

(ప్రారంభం)

# 1

రాత్రి ఎనిమిది గంటలైంది. ఆకాశంలో చంద్రుడు లేడు. మహాశివరాత్రికి హైదరాబాద్ నలుమూలల నుంచీ వచ్చిన జనాలతో కిక్కిరిసిపోయి ఉంది ఇందిరా పార్క్ గ్రౌండ్. అందమైన చీరల్లో వందల మంది ఆడవాళ్ళు నేలమీద లింగాకారంలో దీపాలు పెడుతున్నారు. పక్కనే కొంతమంది మగవాళ్ళు సాయం చేస్తున్నారు. ఇవన్నీ పట్టని వాళ్ళు దూరంగా ఖాళీ స్థలంలో పిల్లల్ని ఆడిస్తూ, మొబైల్స్ చూస్తూ తిరుగుతున్నారు. గ్రౌండ్ లో అక్కడక్కడా ఇరవై అడుగుల ఎత్తున్న శివుడి కటౌట్ లు. గంగని తన జటాజూటల్లో బంధిస్తున్నప్పటిదీ, హాలాహలాన్ని నవ్వుతూ తాగుతున్నప్పటిదీ...

దూరంగా తెల్లటి మంచు కురుస్తున్నట్టు వేసిన విశాలమైన కైలాస పర్వతం సెట్టింగ్. దాని పైన ధ్యాన ముద్రలో ఉన్న శివుడు. పక్కనుంచి కిందకి ప్రవహిస్తూ గంగని తలపిస్తున్న వాటర్ ఫాల్.

ఆ పర్వతం కింద ఉన్న పెద్ద స్టేజ్ వైపే ఆత్రుతతో చూస్తున్నాయి వందల కళ్ళు. వాటిల్లో అసహనం పెరిగిపోతోంది. శివుడు ఇక్కడ కాకపోతే గుళ్ళో దొరుకుతాడు కానీ ఆ స్టేజ్ మీదకి రాబోయే అతను అంత ఆషామాషీగా కనపడడు. టీవీలో అతన్ని చూసీ,వినీ మనసు పారేసుకున్న అమ్మాయిలందరికీ కోపంగా ఉంది. బాయ్ ఫ్రెండ్ టైం కి రాకపోతే వచ్చే కోపం లాంటిది. ఏడింటికని చెప్పాడు. ఇంకా పత్తాలేడు.

ఇంతలో ముందునుంచి ఎవరో అరిచారు "దేవరాజ్!". ఒక్కసారి గందరగోళంగా మారింది అక్కడంతా. అందరూ హడవిడిగా లేచి నుంచున్నారు తనని చూడటానికి. కైలాస పర్వతం మీదనుంచి ఏర్పాటు చేసిన మెట్ల పైనుంచి మెరుస్తున్న ఎర్రటి షెర్వాణీలో హుషారుగా కిందకొస్తూ కనపడ్డాడు తను. ఆరడుగులకు పై పొడుగు, కోల ముఖం, లైట్ షేడ్ గడ్డంతో ఓ మోస్తరు హీరోలా ఉన్నాడు. చుట్టూ అమర్చిన్న పెద్ద ఎల్ సీడీ స్క్రీన్ ల మీద తనని చూస్తున్న జనాల ఈలలూ, అరుపులతో ఆ ప్రాంతమంతా మారుమోగింది ఐదు నిమిషాలు.

గొడవ సర్దుమణిగాక మొదలుపెట్టాడు దేవరాజ్. "అందరికీ నమస్కారం, ఈ శివరాత్రి పర్వదినాన ఆ పరమేశ్వరుని పూజించి తరించటానికి వచ్చిన వేలమంది భక్తులందరికీ స్వాగతం. ఆయన కృపాకటాక్షాలు మీ అందరిపైనా ఉండాలని ఆశిస్తూ కార్యక్రమంలోకి వెళ్తున్నాను" అన్నాడు. అంతా చప్పట్లు. చుట్టూ మ్యూజిక్ బ్యాండ్ వాళ్ళు వచ్చి కూర్చున్నారు. తను మైక్ ని చేతిలోకి తీసుకుని మంద్రమైన స్వరంతో వినాయక ప్రార్థన చేశాడు. తర్వాత పెద్ద స్థాయిలో అందుకున్నాడు

"సదాశివా సన్యాసీ, తాపసీ, కైలాసవాసీ..."

పదివేల వాట్ల స్పీకర్లలోంచి వస్తున్న ఆ పాటకి ఒక్కసారి ఉత్సాహంతో షాక్ కొట్టినట్టైంది అందరికీ. అలానే కొన్ని అద్భుతమైన పాటలూ, శివ స్తోత్రాల రీమిక్స్ వర్షన్ లూ పాడీ, పాడించీ అందరినీ మత్తులో పడేసాడు. అలా రెండు గంటలపాటు అందరినీ ఉర్రూతలూగించి మరోసారి శుభాకాంక్షలు చెప్పి కార్యక్రమం ముగించాడు. జనాలకి ఏం జరిగిందో తెలిసి చుట్టుముట్టే లోపలే స్టేజ్ దిగి కారెక్కి మాయమయ్యాడు.

కారు వేగంగా నడుపుతున్నాడు సీనా. "థాంక్స్ బా" అన్నాడు దేవరాజ్. నవ్వాడు సీనా. తనకిది అలవాటే.

ట్యాంక్ బండ్ దాటి దూరంగా వెళుతోందా కారు. ఉన్నట్టుండి ఒక నిర్మానుష్యమైన ప్రదేశంలో ఆగింది. ఆ కారు హెడ్ లైట్స్ తప్పితే చుట్టూ అంతా చీకటి. కిందికి దిగారు ఇద్దరూ.

దేవరాజ్ తన మెడలో రుద్రాక్షమాలని గట్టిగా తెంచి కారు సీట్ లోకి విసిరేశాడు. నుదిటిపై ఉన్న విభూదిని చెరిపేసి, ఓ సిగరెట్ తీసి వెలిగించాడు. దాన్ని గుండెల నిండా పీల్చాక సీనా అందించిన బాటిల్ ఓపెన్ చేశాడు. చీర్స్ చెప్పి తాగటం మొదలుపెట్టారిద్దరూ.

పక్కనున్న చెట్టు వెనకనుంచి మొబైల్ లో ఇదంతా వీడియో తీస్తోంది ఓ ఆకారం!

2

'మీ నిజం' ఛానల్ మెయిన్ ఫ్లోర్ లో ఉన్న స్టూడియో రూంలో అంతా గందరగోళంగా ఉంది వాతావరణం. టెక్నీషియన్స్, ప్యానెల్ మెంబర్ అస్సిస్టెంట్లు హడావిడిగా లోపలకీ, బైటికీ తిరుగుతున్నారు. అక్కడే కెమెరా వెనకాల నిల్చొని ఉన్నాడు ఛానెల్ హెడ్ శివరాం. తన నుదుటిమీద చెమట స్పష్టంగా తెలుస్తోంది. సాధారణంగా తనిలాంటి ప్రోగ్రాంలకి రాడు. కానీ ఇవాళ మామూలు రోజు కాదు.

ఎదురుగా పోడియం మీదకి కాషాయ వస్త్రాలతో, చేతిలో దండతో మొదట వచ్చి కూర్చున్నారు శివచైతన్య మఠాధిపతి, పూర్ణానంద స్వామి. తనతో పాటు వచ్చిన శిష్యుడు ఆఖరి ప్రయత్నంగా చెప్పాడు "స్వామీ, మరొక్కసారి ఆలోచించండి. లైవ్ ఇంకా మొదలవ్వలేదు. ఈ ప్యానెల్ డిస్కషన్ లలో అర్థంలేని అరుపులు తప్పితే ఎవరిమాటా ఎవరూ వినరు. మీకివన్నీ అలవాటు లేవు"

స్వామీజీ నవ్వారు "నేను కాకపోతే ఇంకో మఠాధిపతినో, బాబానో తెస్తారు వీళ్ళు. వాళ్ళు సమాధానాలు సరిగ్గా చెప్పలేకపోతే జనాలు మనందర్నీ వెధవలనుకుంటారు". శిష్యుడు మళ్లీ ఏదో అనబోయి స్వామీజీ ముఖాన్ని చూసి మారు మాట్లాడకుండా బైటికెళ్ళిపోయాడు. తర్వాత ఖద్దరు షర్ట్ వేసుకుని, గుబురు మీసాలతో లోపలికి వచ్చాడు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి నర్సిరెడ్డి. స్వామిని చూసి పాదాభివందనం చేసి తన సీట్లో కూర్చున్నాడు. తన వెనకాలే వచ్చాడు జనచైతన్య సమితి సెక్రెటరీ మధు. చింపిరిజుట్టూ, కళ్ళజోడూ.

వాళ్ళ వెనకే నోట్స్ తీస్కొని నవ్వుతూ లోపలికొచ్చింది నిత్య. పెద్ద కళ్ళు, సన్నటి ముక్కు, కర్లీ హైర్. తెల్లటి సూట్ లో జరగబోయే యుద్ధానికి ముందే ఎగరేసిన శాంతి పతాకలా ఉంది తను. శివరాం వైపు చూస్తూ చిన్నగా తలాడించి పైకి వెళ్ళింది. తన కళ్ళలోని ధైర్యమే శివరాంకి నచ్చేది. దిస్ గర్ల్ గాట్ గట్స్.

ప్రోగ్రాం కౌంట్ డౌన్ మొదలైంది. 3..2..1..గో. పెద్ద స్వరంతో మొదలుపెట్టింది నిత్య "హెల్లో, వెల్కం టు 'మనుషులు చేసిన దేవుళ్ళు' ప్రోగ్రాం. ఇవాళ్టి మన హాట్ టాపిక్ 'త్రిమూర్తులు నిజంగా ఉన్నారా?'. మొట్టమొదటిగా స్వామీజీని అడుగుదాం. స్వామీజీ, మీరు హిందూ మతంలో అత్యంత ప్రమాణ గ్రంథమని దేనిని నమ్ముతారు?"

ఆయన చిరునవ్వు నవ్వాడు. సమాధానం కాదు, అతని విశ్వాసాలు కావాలి ఆమెకి.

"వేదాలు అత్యంత ప్రమాణం. తర్వాత పురాణాలూ, రామాయణ, మహాభారతాలూ, భగవద్గీత కూడా ప్రమాణాలే" అన్నారాయన.

"దయచేసి ఒక గ్రంథం పేరు చెప్పగలరా?" అంది.

"ఋగ్వేదం" అన్నాడు తను.

"గ్రేట్, మరి ఋగ్వేదంలో త్రిమూర్తుల ప్రస్తావన ఉందా?" సూటిగా అడిగింది.

స్వామి వెంటనే సమాధానం చెప్పకబోయే సరికి, నర్సిరెడ్డి అందుకున్నాడు "కంపల్సరీ వేదంలో ముగ్గురు త్రిమూర్తులూ, ముప్పైకోట్ల దేవతలు కూడా ఉన్నారని నేను కచ్చితంగా చెప్తన్నా" అన్నాడు.

జనచైతన్య సమితి మధు చిరాగ్గా, "నరిశి గారూ మీరేం మాట్లాడుతున్నారో అర్థమౌతోందా, ఇది అసెంబ్లీ కాదు అడ్డంగా మాట్లాడటానికి. వేదాల్లో త్రిమూర్తుల ప్రస్తావన లేదు. నాకు తెలిసినంత వరకూ, విష్ణువు, రుద్రుడు ఉన్నారు, కానీ వాళ్ళు సాధారణ దేవుళ్ళు. ఇంద్రుడే వేదంలో ముఖ్య దేవత" అన్నాడు.

స్వామీజీ మధ్యలో వెళ్ళాలా వద్దా అని తటపటాయిస్తూనే అన్నారు "వేదాల్లో రుద్రుడే తర్వాత శివుడిగా మనం చెప్పుకుంటున్నాం. బ్రహ్మ ప్రస్తావన కూడా ఉంది. వేద మంత్ర సమూహమే బ్రహ్మ"

"మరైతే వేదంలో ఉన్న బ్రహ్మ సర్వ సృష్టికర్తా? విష్ణుమూర్తి విశ్వ పోషకుడూ, రుద్రుడు లయకారుడా?" గట్టిగా అడిగింది నిత్య.

వెంటనే ప్రోగ్రాం డైరెక్టర్ ఆ ప్రశ్నని హైలైట్ చేసి పైన బ్యానర్ లో పెట్టమని చెప్పాడు తన టీంకి.

"త్రిమూర్తుల ప్రస్తావన తర్వాతి పురాణాల్లో బలంగా కనిపిస్తుంది మనకి" అన్నారు నోరుజారానేమో అని అయోమయంలో పడుతూ. అదివిన్న జనచైతన్య మధు ఆవేశంతో ఊగిపోతూ "ఎవరిష్టమొచ్చినట్లు పురాణాల్లో, పుస్తకాల్లో

కనిపెట్టిన దేవతలకీ.. అంతెందుకు మొన్న మొనన్ వచ్చిన మనుషులని కూడా కూడా దేవుళ్ళని చేసి గుళ్ళు కడుతున్నారు...మీరిలా తయారుచేస్తున్న దేవుళ్ళ పేరుతో డబ్బుగుంజి జనాల్ని పిచ్చివాళ్ళని చేస్తున్నారు" అన్నాడు.

నిత్య నవ్వింది. స్వామీజీ నర్సిరెడ్డివైపు చూసారు అసహాయంగా. నేనున్నాగా అన్నట్టు సైగ చేసాడు తను.

తర్వాత గంటసేపు అడ్డదిడ్డంగా జరిగి ఏటూ తేలని ఆ వాదనలో, నిత్య ఒక యాంకర్, వేదిక్ ఎక్స్పర్ట్, సెన్సెషలలిస్ట్ అండ్ జడ్జ్ గా కూడా వ్యవహరించింది. అన్నింటికన్నా మించి ఓ గ్రేట్ ఎంటర్టైనర్. అరిచి అరిచి ప్యానెలిస్ట్ ల మొహాలు ఎర్రగా మారాయి, నోళ్ళు మూతపడ్డాయి. స్వామీజీ ప్రోగ్రాంకి వచ్చి తప్పు చేశానా అని చింతిస్తున్నారు. నిత్య మాత్రం చివరికి వాదనని ప్రశ్నార్థకంగానే ముగించింది "మీ దేవుళ్ళెవరో, ఎక్కడినుంచి వచ్చారో తెలుసుకోండి, లేకపోతే కొంతకాలానికి ప్రతి ఒక్కరూ నేనూ దేవుడిననే ప్రమాదముంది!"

యూట్యూబ్ లైవ్ వ్యూవర్స్ పది లక్షలకి చేరుకున్నారు. ఇంకో రికార్డ్ నిత్యకి. ట్విట్టర్ లో తనకి సపోర్ట్ గా కొందరూ, వ్యతిరేకంగా చాలామందీ కొట్టుకుంటున్నారు.

చాలాసేపటి తర్వాత ప్రశాంతంగా నవ్వాడు శివరాం.

నిత్య అందరికీ థాంక్స్ చెప్పి నడుచుకుంటూ యాంకర్స్ రూంలోకి నడిచి డోర్ లాక్ చేసింది. తన హ్యాండ్ బాగ్ లోపల ఉన్న సీక్రెట్ జిప్ లోంచి ఒక చిన్న ఫొటో బైటికి తీసి టేబుల్ కి ఆనించి పెట్టింది. దూరం జరిగి చెంపలు వేసుకుంటూ అంది

"పాహిమాం! పాహిమాం! శంభోశంకర!"

3

బంజారా హిల్స్ లో 'గాలెరీ కఫే' లో ఒక మూల కూర్చొని చార్లెస్ డార్విన్ రాసిన 'ఆరిజిన్ ఆఫ్ స్పీసీస్' బుక్ చదువుతున్నాడు దేవరాజ్. ఎవరూ గుర్తు పట్టకుండా గాగుల్స్, క్యాప్. మధ్యలో తలెత్తి చుట్టూ చూశాడు. తనకిష్టమైన పైంటింగ్స్ అందంగా వేలాడదీసి ఉన్నాయి గోడలమీద. మధ్యలో ధ్యానముద్రలో ఉన్న బుద్ధుని స్టాట్యూ మీద పడింది తన దృష్టి. "మామూలు మనిషి నీ అంత జ్ఞానం సంపాదించలేడనే గట్టి నమ్మకంతో నిన్ను కూడా దేవుళ్ళ జాబితాలో చేర్చారు. మనిషైతే మళ్ళీ నిన్ను ఆదర్శంగా తీస్కోవాలి, కష్టపడాలి. దేవుడైతే ఇలా బొమ్మలు పెట్టుకుంటే చాలు" అనుకున్నాడు. ఇంతలో తన టేబుల్ దగ్గరికెవరో రావడంతో అటు చూశాడు. ఒక పెద్దతను తనని గుర్తుపడుతూ "దేవరాజ్ కదా?" అన్నాడు. ఇంత దాచినా ఉపయోగం లేకపోవడంతో కళ్ళజోడు తీసి అవునన్నట్టు తలూపాడు. అతను ఆశ్చర్యంగా ముఖంపెట్టి, "నా లాంటి నాస్తికుడికే మీ పాటలు వింటే దేవుడిమీద విపరీతమైన భక్తి కలుగుతుంది. అంత మెస్మరైజింగా ఉంటాయి. అలాంటిది, మీరు ఇలాంటి దైవ విరుద్ధమైన పుస్తకం చదవటమేంటి?"

దేవరాజ్ తనవైపు తీక్షణంగా చూశాడు. అతనో సైంటిస్టో, కార్పొరేట్ కంపెనీ డైరెక్టర్ లానో కనిపిస్తున్నాడు.

"డార్విన్ ఆర్గ్యుమెంట్ తెలుసుకుంటే మనం దేవుడి వైపు ఇంకా బలంగా వాదించచ్చు కదా.." అన్నాడు సందేహంగా.

"తెలుసుకోవడాని కేముంది. మనుషులంతా ఏప్స్ నుంచి వచ్చాయంటాడు తను. మొట్టమొదటి మనువును బ్రహ్మ సృష్టించాడన్న మన సిద్ధాంతానికిది పూర్తి వ్యతిరేకం. మీరంతా అవి చదివి హిందూ సనాతన ధర్మాన్ని తక్కువగా చూస్తారు" అన్నాడు ఆవేశంగా.

దేవరాజ్ ఇర్రిటేషన్ కోపంగా మారి మొహం ఎర్రబడింది "చూడండి, నాకు ఏం చదవాలో, ఏం చెయ్యాలో ఫ్రీడం ఉంది. పిలవకుండా వచ్చి ఇలా డిస్టర్బ్ చెయ్యద్దు, ప్లీజ్" అని చెయ్యి చూపించాడు గేట్ వైపుకి.

పెద్దతను తలాడిస్తూ, చేతులు గాల్లోకి తిప్పుతూ విసురుగా బైటికెళ్ళిపోయాడు.

సీనా లోపలికొస్తూ అడిగాడు "ఎవరు బావా?"

"ఇంకో దేవుడి పిచ్చోడు. ప్రశాంతంగా ఏదీ చెయ్యనివ్వరు. అన్నీ దాక్కునీ, దాచుకునీ చెయ్యాల్సిందే..." అన్నాడు దేవరాజ్ విసుగ్గా.

"బావా, నీకు మస్తు డబ్బులొస్తున్నయ్ దేవుడి పాటలతో, దేవుడ్ని నమ్మితే పోయేదేముంది, హ్యాపీగా ఉండచ్చుగా"

"రేయ్, అన్నీ తెలిసి నువ్వుకూడా.. డబ్బు సంపాదించే పనులన్నీ మనిషి సంతోషంగా చెయ్యాలని రూలేం లేదు. ఆ పక్కనున్న సాఫ్ట్‌వేర్ క్యాండిడేట్ ని చూడు" అన్నాడు రెండు టేబుల్స్ అవతలున్న ఓ వ్యక్తిని చూపిస్తూ. వెనక్కి తిరిగి ఫోన్ మాట్లాడుతున్న అతని వైపు చూశాడు సీనా.

"ఆ ఐ.డి క్యాండిడేట్టా?"

"ఆ..వాడికి ఫిల్మ్ ఇండస్ట్రీ లో ఏదో చెయ్యాలనుండచ్చు. అందుకే ఆఫీస్ ఎగ్గొట్టో, సెలవుపెట్టో ఇక్కడ తిరిగుతుండచ్చు. తనకి జాబ్ జస్ట్ ఒక ఇంకమ్ సోర్స్ అంతే" అన్నాడు దేవరాజ్.

అప్పుడే ఆ సాఫ్ట్ వేర్ అతను వాళ్ళిద్దరి వైపూ ఇబ్బందిగా చూస్తూ పైకి లేచి వేగంగా బైటికెళ్లిపోయాడు.

"నీ మాట వినపడిందేమో బా, పాపం ఫీలయ్యుంటాడు" అన్నాడు.

ఇద్దరూ నవ్వారు పెద్దగా.

"అది సరేగానీ, రేపు ధర్మ సర్ ఆడిషన్ కి పిలిచారు. కొత్త మూవీకి. టెన్షన్ గా ఉంది" అన్నాడు దేవరాజ్.

"కంగ్రాట్స్ బా, ధర్మ బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్, పక్కా ప్రొఫెషనల్, నీ కెరీర్ సెట్టైపోద్ది"

"థాంక్స్ రా, ఫింగర్స్ క్రాస్డ్. హోప్ లాస్ట్ టైమ్ లాగా జరగకూడదని.."

"తన గురించి మంచి టాక్ ఉంది ఇండస్ట్రీలో. డోంట్ వర్రీ" అన్నాడు సీనా అనునయంగా.

అంతలో ఏదో మెసేజ్ వస్తే వాట్సాప్ ఓపెన్ చేసాడు దేవరాజ్. నిన్నటి నిత్య ప్రోగ్రాంకి వ్యతిరేకంగా తయారుచేసిన మీమ్ వీడియో క్లిప్ అది. నిత్య అడుగుతోంది "మీ దేవుడెవరు?" తర్వాత బ్రహ్మానందం కృష్ణుడిరూపంలో చిలిపిగా నవ్వుతున్నాడు "నేనే" అని చెబుతూ. దేవరాజ్ కి నవ్వాగలేదు. ఇంకో సారి ప్లే చేసి నిత్యని అలానే చూస్తూ ఉండిపోయాడు.

కఫే నుంచి హడావిడిగా బైటికొచ్చిన ఆ సాఫ్ట్ వేర్ వ్యక్తి దార్లో ఉండగానే వచ్చిందో కాల్.

"ఏమన్నా దొరికిందా?" గట్టిగా ప్రశ్నించిందా అవతలి గొంతు.

తనొక క్షణం ఆలోచించాడు. ఏదో నిర్ణయించుకుని "ఇంకా లేదు, తన చుట్టూనే తిరుగుతున్నా, ఇంకో వన్ వీక్..."

"ఇలానే రెండు నెలల నుండి చెప్తున్నావ్. ఇదే నీకు లాస్ట్ వీక్, లేకపోతే మన డీల్ క్యాన్సిల్" అని పెట్టేసాడు అవతలి వ్యక్తి.

సాఫ్ట్ వేర్ అతని ముఖంలో చిరునవ్వు – "నో ప్రాబ్లం..ప్లాన్ బి స్టార్ట్ చెయ్యాలి"

4

పొద్దున్న ఐదైంది. నిత్య అప్పటికే స్నానం చేసి జాగింగ్ డ్రెస్, పైన కొంచెం పొడుగు టాప్ వేసుకుంది. ముఖంపై మాస్క్ పెట్టుకుని బైటికి నడిచింది. అటూ, ఇటూ చూస్తూ కాలనీ రోడ్డు దాటి రెండు వీధుల తర్వాత ఉన్న శివాలయం ముందు ఆగింది. గుడిలోపలికెళ్ళాక ఎవరూ ఇంకా రాలేదని నిర్ధారించుకున్నాక మాస్క్ తీసి ఊపిరి పీల్చుకుంది.

తననిచూసి నవ్వారు పూజారిగారు "వచ్చావా, మళ్ళీ వేరేవాళ్ళు అభిషేకాలకి వచ్చేస్తారని ఇప్పుడే భయపడుతున్నా" అన్నాడాయన.

"కొంచెం లేటయింది, మీకు తెలుసుగా.. రుద్రం.."

"అలాగే" అంటూ ఆయన లోపలికెళ్ళి పూజ ప్రారంభించాడు.

నిత్య లోపల మెరుస్తున్న లింగాన్ని తన్మయత్వంతో చూస్తోంది. ఏదో తెలియని అనిర్వచనీయమైన అనుభూతి. దొంగతనంగా రావలసి వస్తోందనే బాధ తప్ప, వారం మొత్తంలో తనకన్నిటికన్నా ఇష్టమైన పావుగంట అది.

పూజారి గారు ప్రసాదం తెచ్చి ఇస్తూ "ఎన్నాళ్ళమ్మా ఇలా ముసుగులో తిరగడం, నే చెప్పినట్టు మీ ఎమ్.డీ తో మాట్లాడి ఛానెల్ లో వేరే ప్రోగ్రాం కి మారచ్చు కదా?" అన్నాడు.

"నాకూ అడగాలనే ఉందండీ, కానీ నేనంటే ఆయనకి చాలాగురి. ఇది చెప్తే నా ఉద్యోగానికి ఏంజరురుతుందో అనే భయంతో ఆగుతున్నాను" తన మనసులో మాట చెప్పింది.

"ప్రయత్నించు ఏదో ఒక మార్గం కనపడకపోదు" అన్నాడు.

నిత్య తలూపుతూ బైటికి నడిచింది.

వెనక్కి వెళ్ళేటప్పుడు జాగింగ్ చేస్తూ వెళ్తోంది తను. గుడిముందు అప్పటివరకూ ఆగున్న బ్లాక్ బొలేరో డ్రైవర్ మెల్లగా నిత్య వైపు తిప్పాడు. "ఇంతకుముందు రెండుసార్లు మిస్ అయ్యింది. ఇవాళ ఎలాగైనా పనైపోవాలి" అన్నాడు వెనక ప్యాసింజర్ సీట్ లో ఉన్న సూరి.

నిత్య ఆలోచనల్లో పడి ఆ కారుని పట్టించుకోవట్లేదు. గతేడాది వరకూ తనో మామూలు న్యూస్ యాంకర్. తన పేరు కూడా ఎక్కువమందికి తెలియదు పెద్దగా. 'మనుషులు చేసిన దేవుళ్ళు ' ప్రోగ్రాంతో తనిప్పుడొక కాంట్రవర్షియల్ సెలెబ్రిటీ గా మారిపోయింది. మెచ్చుకునే వాళ్ళకన్నా తిట్టే జనాలే ఎక్కువ. ప్రశాంతంగా గుడికెళ్ళే పరిస్థితి కూడా లేదు. తన వీడియో క్లిప్పులు, మీమ్స్ యూట్యూబ్ లో పెట్టి డబ్బు సంపాదిస్తున్న వాళ్ళూ ఉన్నారు. తల అడ్డంగా విదిల్చింది "దిస్ ఈస్ ఇనఫ్, ఇంక ఈ నాటకం నా వల్లకాదు. ఇవాళ శివరాంతో గట్టిగా మాట్లాడాలి" అని అనుకుంటూ జాగింగ్ వేగం పెంచింది.

కారు డ్రైవర్ కూడా మెల్లగా యాక్సిలరేట్ చేస్తూ తన దగ్గరి దాకా వచ్చేశాడు. దాదాపు సూరి తలుపు తీయబోయే లోపల, ఎవరో ఓ పెద్దతను "హాయ్ నిత్యా!" అంటూ వచ్చి తనతో కలిసి జాగింగ్ చెయ్యటం మెదలుపెట్టాడు. "ఛ, మళ్లీ మిస్ అయ్యింది. అన్న మనల్ని చంపేస్తాడు. ఏదో ఒకటి చెప్పాలి" అనుకుంటూ కారుని వెనక్కి తిప్పి మాయమయ్యారు వాళ్ళిద్దరూ.

కాలనీ ప్రెసిడెంట్ తో కలిసి నవ్వుతూ ఇంటిదాకా వచ్చింది నిత్య. ఆయనొక రిటైర్డ్ సైంటిస్ట్. కాలనీలో ఎక్కువ మంది నిత్యకి విరోధులైనా అతనెప్పుడూ మంచి ప్రోగ్రాంస్ చెయ్యమని ప్రోత్సహిస్తూ ఉంటాడు. మంచి చనువు. నిత్య ఇంటినుంచి ముందుకి వెళ్ళిపోతూ ఏదో సందేహం వచ్చి ఆగాడు "అవును, నిత్యా, ఇందాక నీ వెనకాలే ఓ బ్లాక్ కార్ రావడం గమనించాను. ఈజ్ ఎవ్రీథింగ్ ఓకే?" అన్నాడు.

"ఏంటంకుల్ మా జర్నలిస్టుల సందేహాలు మీకొస్తున్నాయి. నా గురించి ఎవరు చూస్తారు, అందరూ పారిపోతుంటే" అని నవ్వింది పెద్దగా.

"ఆల్ రైట్, టేక్ కేర్" అంటూ వెళ్ళిపోయాడాయన.

తేలిగ్గా ఆయన సందేహం కొట్టిపారేసింది కానీ నిత్య మనసులో మాత్రం ఓ మూల ఏదో అనుమానం మొదలైంది.

**శ్రుతిలయ** రికార్డింగ్ స్టూడియో ముందు కారు ఆపాడు దేవరాజ్. బైటికి దిగలేదు. అదే స్టూడియోలో అంతకు ముందు జరిగిన సంఘటన తనని లోపలికి వెళ్ళనివ్వట్లేదు. వేరే ఛాయిస్ లేదని గుర్తొచ్చాక నిట్టూర్చి లోపలికి నడిచాడు.

అప్పటికే మ్యూజిక్ డైరెక్టర్ ధర్మ కొంతమందిని ఆడిషన్ చేస్తున్నాడు. తననిచూసి లేచి షేక్ హ్యాండిస్తూ "థాంక్స్ ఫర్ కమింగ్, నిన్ను చాలా రోజులుగా అప్రోచ్ అవుదామనుకున్నా కానీ కుదర్లేదు, ఈ కొత్త మూవీ ట్యూన్స్ చేస్తున్నప్పుడు నువ్వు గుర్తొచ్చావ్, షల్ వుయ్?" అన్నాడు లోపలికి చెయ్యి చూపిస్తూ.

ఒక పది నిమిషాలు ట్యూన్, సాంగ్ పల్లవి ప్రాక్టీస్ చేసుకొని రికార్డింగ్ రూంలోకి వెళ్ళి పాడాడు దేవరాజ్. అయ్యాక బైట టెక్నీషియన్స్ చప్పట్లు కొడుతున్నట్టు కనపడుతోంది తనకి. "ఇంక తిరుగులేదు" అనుకుంటూ బైటికి నడిచాడు.

"గ్రేట్ వాయిస్ యార్, ఎక్కడున్నావ్ ఇన్నాళ్ళూ?" అన్నాడు నవ్వుతూ.

"థాంక్స్, ఎప్పుడు చేద్దాం?" అన్నాడు దేవరాజ్ సందేహంగా.

"నీకు రెండు సాంగ్స్ ప్లాన్ చేస్తున్నాను. టైం ఉంటే ఇవాళే చేద్దాం" అన్నాడు ధర్మ.

ఇదంతా నమ్మశక్యంగా లేదు దేవరాజ్‌కి. ఇంత ఈజీగా అవుతుందనుకోలేదు. ధర్మ ఈజ్ రియల్లీ ఎ ప్రొఫెషనల్ అనుకున్నాడు.

కొంతసేపటికి సాంగ్ పనులు జరుగుతున్నప్పుడే స్టూడియో లోపలికి వచ్చాడు మణిసామి, ఆ మూవీ ప్రొడ్యూసర్. మనిషి ఎత్తుగా, నల్లగా ఉన్నాడు. ముఖం మీద అడ్డంగా పెద్దనామాలూ, మధ్యలో ఎర్రటి బొట్టూ.

వస్తూనే దేవరాజ్ ని గుర్తుపట్టి "అబ్బా అబ్బా ఎన్నాళ్ళకి చూస్తిని నిన్ను, ఎంత జెమ్ లా పాడతావబ్బా, నీ పాట వింటుంటే నాకు శివుడు కళ్ళల్లో మెదుల్తాడు తెల్సా" అన్నాడు రెండు భుజాలూ గట్టిగా నొక్కుతూ.

దేవరాజ్ నవ్వాడు. ఇవేం తనకి కొత్తకాదు.

మణిసామి ధర్మ ని చూస్తూ "ఏం పాడిస్తన్నా అబ్బితో.." అన్నాడు. పాటల పేర్లు చెప్పాడు ప్రీతేష్. ఒక్కసారిగా మణిసామి ముఖంలో కోపం. దేవరాజ్ కేమీ అర్ధం కాలేదు.

"దేవుడి పాటలు పాడే అబ్బితో ఇలాంటి బూతుపాటలు పాడిస్తావా, ఏం మతుండే చేస్తన్నావా" అన్నాడు అసహనంగా.

ధర్మ అహం దెబ్బతింది. తన గురించి అతను తిట్లు తినడం దేవరాజ్ కీ నచ్చలేదు.

"సర్ నేనొక సింగర్ ని, ఏ పాటలన్నా పాడగలను" అన్నాడు సూటిగా.

"నూ పాడగలవమ్మా, కానీ నీ చేత ఈ పిచ్చిపాటలు పాడించే బుద్ధి మాకుండకర్లా" అన్నాడు తను.

"ఆ సాంగ్స్ కి తన గొంతు బాగా సూట్ అయ్యింది, ఇప్పుడే ఆడిషన్ చేసాం సర్" అన్నాడు ధర్మ ఆఖరి ప్రయత్నంగా.

మణిసామి అతడ్ని పట్టించుకోకుండా దేవరాజ్ తో "చూడమ్మా, నిన్ను వట్టిచేత్తో పంపను. నాదే ఇంకో భక్తి సినిమా ఉంది పెద్ద హీరోతో. అందులో నీకు రెండు సాంగ్స్ ఇస్తా. బెస్ట్ ఆఫర్" అన్నాడు నింపాదిగా.

ఇప్పుడు కోపం దేవరాజ్ కళ్ళల్లోకి జేరింది. ధర్మ వైపు చూసాడు. ఏం చెయ్యలేని అసహాయత అతని మొహంలో. అంతా నిశ్శబ్దం. తను హఠాత్తుగా పైకి లేచి విసురుగా గేట్ వైపు నడిచాడు. లోపల్నించి "అబ్బీ.." అని అరుపు. ఆగలేదు. సరాసరి కారులో వచ్చి కుర్చున్నాడు.

హఠాత్తుగా జరిగిన ఆ ఇన్సిడెంట్స్ వల్ల మనసంతా అల్లకల్లోలంగా ఉంది. కోపంతో ఊపిరి బలంగా వస్తోంది. కళ్ళు ఎర్రగా మారాయి.

పక్కనున్న సీట్ ని గట్టిగా కొడుతూ పెద్దగా అరిచాడు

## 6

నిత్య మనసంతా అయోమయంగా ఉంది. తన ప్రోగ్రాంని కొందరు తిడుతుంటే తను చేస్తున్నది సరైనదే అని సమర్థిస్తున్న వాళ్ళూ కనిపిస్తున్నారు. పొద్దున్నే లేచింది కానీ స్టూడియోకి సెలవపెడదామని డిసైడ్ అవుతున్న సమయంలో ఇంటినుంచి కాల్ "ఎలా వున్నావే?" అమ్మ నుంచి సూటి ప్రశ్న.

"బావున్నానమ్మా"

"బాగా ఎంజాయ్ చేస్తున్నావా?" గొంతులో జీర.

"ఆ బానే వున్నా, ఏమైంది? మీరెలావున్నారు?"

"మేమెలా ఉంటే ఏంలే, నువ్వు బావున్నావు కదా? నీ ఇష్టమొచ్చినట్టు చేస్తున్నావ్?"

"అబ్బా, ఇప్పుడేమైందని పొద్దున్నే మొదలుపెట్టావ్? నాన్నకివ్వు?"

"అవునే, నేను ఏం వాగినా నీకు పట్టదు. నువ్వు చేస్తునన్ పనులకి మా తలలెక్కడ పెట్టుకోవాలో తెలియట్లేదు" ఏడుపులోకి మారింది స్వరం.

"తల్లీ, అటూ ఇటూ తిప్పకుండా అసలేంజరిగిందో చెప్పు?"

"మన..లేదు..మా స్వామి దగ్గరకెళ్తే చుట్టుపక్కల వాళ్ళంతా నువ్వు టీవీలో చేస్తున్న రచ్చ గురించి మమ్మల్ని చెడామడా తిట్టారు. స్వామీజీ కూడా వాళ్ళని ఆపలేకపోయారు. మొన్నటి వరకూ నిన్ను మెచ్చుకున్న వాళ్ళే ఇప్పుడు అమ్మాయిని అదుపులో పెట్టుకోలేకపోయామని మమ్మల్ని..."

ఫోన్ లో వెనక ఏవో అరుపులు "ఏంటా మాటలు? లోపలికెళ్ళు"

"అమ్మా.."

"ఆ తల్లీ, ఎలా వున్నావే, అమ్మ మాటలు పట్టించుకోకు, నీకు తెలుసుగా తను కొంచెం ఎమోషనల్" నాన్న గొంతు అటువైపు.

"నాకేం చెయ్యాలో తోచట్లేదు నాన్నా" బాధగా అంది.

"నువ్వు ధైర్యంగా ఉండాలి. ఇలాంటివి వందొస్తాయి. నువ్వు ఎంచుకున్న రంగం అలాంటిది"

"అందరినీ ఎదిరించేంత ధైర్యం రావట్లేదు"

"చేస్తున్నది నీకు 100% కరెక్టే అనిపిస్తే పక్కవాళ్ళ మాటలు పట్టించుకోకు"

"అవునే, అవమానంతో నేను చచ్చాక అప్పుడు పట్టించుకుందురు గాని నువ్వూ, మీ నాన్నా" వెనక నుంచి అమమ్ అరుపు.

మౌనంగా ఉంది నిత్య అలాగే నిలబడి. మెల్లగా ఫోన్ కట్ చేసింది. కళ్ళనుండి ధారలు. అమమ్ శాపనార్థాలు తనకి కొత్తకాదు కానీ ఈసారెందుకో అవి మనసుని గట్టిగా గుచ్చుతున్నాయి.

కొంచెసేపు అలాగే ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది. వెంటనే రెడీ అయ్యి, స్టూడియోకి బయల్దేరింది.

7

కారు వేగంగా వెళ్తోంది. వాళ్ళని తరుముకొస్తున్న లారీవైపే చూస్తున్నాడు దేవరాజ్ వెనక సీట్లోనుంచి. గుండె దడగా ఉంది కానీ ఏడుపు రావట్లేదు. రానివ్వట్లేదు తన భయం. ముందునుంచి అమ్మ పెద్దగా అరుస్తోంది. నాన్న స్టీరింగ్ ని అడ్డదిడ్డంగా తిప్పుతున్నాడు రోడ్డుమీద. ఆ కుదుపులకి సీట్ల మధ్యలో ఉన్న స్థలంలో పడ్డాడు దేవరాజ్. ఉన్నట్టుండి గట్టిగా వెనకనుండి గట్టిగా గుద్దిన శబ్దం. విండో అద్దాలు పగిలి తనకి గుచ్చుకున్నాయి కొన్ని. కారు వేగంగా కిందకెళ్తున్నట్టు తెలుస్తోంది. గట్టిగా అరిచాడు చేతుల్తో చెవులు మూసేస్తూ.

చాలా సేపటి తర్వాత కళ్ళు తెరిచాడు. ముందు సీట్లో నాన్నా, అమ్మా... రక్తపు మడుగులో... చలనం లేకుండా..

"అమ్మా..." అని అరుస్తూ నిద్ర లేచాడు దేవరాజ్. పక్కనే ఉన్న వాటర్ బాటిల్ తీసుకుని గడగడా తాగేసాడు. ఒళ్ళంతా చెమట. ముఖం తుడుకుకొని టైం చూసాడు. పొద్దునన్ ఐదు దాటింది. పదిహేనేళ్ళు దాటినా కలై తరుముతున్న తన గతాన్ని మార్చలేదు, మర్చిపోలేదు.

ఎన్ని పూజలు చేసింది అమ్మ? ఎన్ని గుళ్ళకి తిప్పాడు నాన్న? ఇద్దరి భక్తినీ తనలో చూసుకోవాలనే, చిన్నప్పటినుండీ తనకి సంగీతం నేర్పించారు. అదీ దేవుడిని స్తుతించడానికే! చివరి కేమైంది? తనో అనాథలా మిగిలాడు. లేదు మిగిల్చాడు. తనకిక నమ్మకం లేదు. దేవుడు ఉన్నాడన్న నమ్మకం కాదు, ఉన్నా తనలాంటి వాళ్ళకి సహాయపడతాడన్న నమ్మకం లేదు..

తన ఆలోచనలని చీలుస్తూ వచ్చిందో వాట్సాప్ వీడియో. దాన్ని చూస్తూనే షాక్ తిన్నాడు. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. వెంటనే సీనాకి కాల్ చేసాడు.

"అబ్బా, ఇంత పొద్దున్నే ఏంటి బా, నీకు తెలుసుగా పది కాందే లేవనని" అన్నాడు సీనా నిద్రలో నసుగుతూ.

"చాలా అర్జంట్, అపార్ట్మెంట్ కి రా తొందరగా!"

ఎప్పుడూ బైట కలుద్దామనే దేవరాజ్ ఇంత పొద్దున్నే కంగారుగా ఇంటికి పిలుస్తున్నాడంటే...

"అరగంటలో ఉంటా బా.."

సీనా వచ్చినప్పటి నుండీ ఆ వీడియో చూస్తూ రకరకాల ఊహాగానాలు చేస్తున్నారిద్దరూ.

"ఆ రోజు రాత్రి మనిద్దరమే ఉన్నాం కదా, ఇదెలా తీశాడో?"

"ఎక్కడో దాక్కొని తీసారు బా, మన హెడ్ లైట్స్ తప్పితే ఇంకే లైటింగ్ లేదు చుట్టుపక్కల"

"ఎవరు తీసుంటాడో, ఎందుకో?"

"ఏముంది, మ్యాక్సిమమ్ డబ్బులడుగుతాడు, అందుకే ఫాలో అయ్యి.."

"మనల్నెవడో ఇంత క్లోజ్ గా ఫాలో అవుతున్నా మనకి తెలీలేదంటే..వాడు బాగా ప్రొఫెషనల్ అయ్యుండాలి లేకపోతే మన కళ్ళు బాగా మూసుకు పోయిుండాలి"

"బా, వాడు మీడియా కిస్తే పెద్ద దుమారం రేగుతుంది"

"రేయ్ నిన్ను పిలిచింది టెన్షన్ పెంచడానికి కాదు, సలహా కోసం. ఎవడో ఆలోచించు"

"ఇది ప్రొఫెషనల్ వర్కు లాగుంది కాబట్టి ఏ ఓల్డ్ క్రిమినలో, ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టో అయ్యుండాలి. డిటెక్టివ్ కూడా అవ్వచ్చు"

అంతలో ఆ వీడియో వచ్చిన నంబర్ నుంచే ఇంకో మెసేజ్ "ఎలా ఉంది వీడియో? ఎక్స్ క్లూసివ్ రైట్స్ నీకే ఇచ్చేస్తా ఓ ఐదు లక్షలిస్తే. కాదంటే చెప్పు ఓ పార్టీ రెడీగా ఉంది"

ఇద్దరూ ఒకళ్ళమొఖాలొకళ్ళు చూసుకున్నారు.

"ఆలోచించు బావా" అన్నాడు దేవరాజ్ తలపట్టుకోని.

"ఈ మధ్య ఎవర్నైనా అనుమానంగా తిరగటం గమనించావా" అన్నాడు సీనా బుర్రగోక్కుంటూ.

"లేదు, స్పెసిఫిక్ గా ఎవర్నీ చూళ్ళేదలా"

"మనల్ని క్లోజ్ గా ఫాలో అవుతున్నాడంటే ప్రతిరోజూ దాదాపు మనమున్న ప్లేసులకొస్తూ ఉండాలి. ఆ..నిన్న కెఫేలో కలిసిన పెద్దతను?"

"ఛ, కాదు. అతనలా కనపడలేదు. అలా ఐతే నా దగ్గరికే డైరెక్ట్ గా ఎందుకొస్తాడు?"

"హుమ్.."

"ఈ నంబర్ ని ట్రేస్ చేస్తే.."

"ఇదేదో ఫేక్ నంబర్ అయ్యింటుంది, పెద్ద ఉపయోగం ఉండదు"

"నా బుర్రేం పని చెయ్యట్లేదు..ఇది కేవలం డబ్బుకోసమే చేస్తున్నట్టులేదు" అన్నాడు దేవరాజ్.

"నీకెవరైనా ఎనిమీస్..నాకు తెలీకుండా ఎవరుంటార్లే" అన్నాడు సీనా.

దేవరాజ్ సడెన్ గా కళ్ళు పెద్దవి చేసాడు "దట్సిట్! ఎనిమీస్, నాక్కాదు, నా ప్రొఫెషన్ కి. గాడ్ కి"

ఒక్క నిమిషం ఇద్దరూ ఏమీ మాట్లాడలేదు. సీనా అర్థం అయ్యీ అవ్వనట్టు మొహం పెట్టాడు.

"అర్థం కాలేదా? నన్ను ఎక్స్ పోజ్ చేసి దేవుడి భక్తులంతా మోసగాళ్ళని ప్రూవ్ చేయాలని.."

సీనా అడ్డంగా తలూపుతూ "కాదు బా, అలా ఐతే మధ్యలో డబ్బులెందుకడుగుతారు? డైరెక్ట్ గా ఈ వీడియో మీడియాలో పెట్టచ్చు కదా?" అన్నాడు.

"నాకూ అదే అర్థం కావట్లేదు"

మళ్ళీ ఆలోచనలో పడ్డారిద్దరూ.

టీవీ ఆన్ చేసి ఛానెల్స్ మారుస్తున్నాడు సీనా. దేవరాజ్ యూట్యూబ్ లో సెర్చ్ చేస్తున్నాడు ఏమైనా క్లూ దొరుకుతుందేమోనని. ఇద్దరి కళ్ళూ ఒకే చోట ఆగాయి. ముందు వారం జరిగిన నిత్య టీవీ ప్రోగ్రాం మీద.

"ఈ అమ్మాయి చాలా డేంజరస్ గా మారిందీ మధ్య, ఏ సెలెబ్రిటీ దేవుడికి సపోర్ట్ గా మాట్లాడితే, వాళ్ళని ఫుల్ గా ఆడుకుంటోంది"

దేవరాజ్ కెందుకో నమ్మాలనిపించలేదు. "ఇది మరీ వైల్డ్ గెస్, తనే ఇలా చేయిస్తుంటే మాత్రం నువ్వన్నట్టు చచ్చినా డబ్బులడగదు, అడిగించదు"

"నీ క్రష్ కదా అని లైట్ గా తీస్కుంటున్నావ్"

దేవరాజేమీ మాట్లాడలేదు, తన కళ్ళు టీవీలో వస్తున్న 'మీ నిజం' ఛానెల్ లోగోని ఆశ్చర్యంతో చూస్తున్నాయి. తన వేళ్ళతో అటువైపే చూపిస్తూ సీనాతో అన్నాడు "బావా..ఆ సాఫ్ట్ వేర్..కఫేలో.."

"ఆ..అతను?"

"అతని ఐడీ మీద ఈ లోగో చూసినట్టు గుర్తు!"

"వాట్?"

"అవును, అతను తడబడుతూ బైటికెళ్ళాడు గుర్తుందా?"

"అవును బా, మన మాటలు విన్నాడనుకున్నాం"

"అతనే అని ఖచ్చితంగా చెప్పలేం, కానీ ఈ ఛానెల్ కీ, నిత్యకీ, మనల్ని ఫాలో అవుతున్న అతనికీ ఏదో లింకుంది" సందేహంగా అన్నాడు దేవరాజ్.

"ఆర్ యూ ష్యూర్? నాకలా అనిపించలేదు"

"కాదు. నిత్యని ఫాలో అవుదాం, తనెవర్ని కలుస్తోందో రెండ్రోజులు అబ్సర్వ్ చేస్తే నిజాలు బైటపడొచ్చు"

"మరి ఈ బ్లాక్ మెయిల్ గాడు ఊరుకుంటాడా?"

ఓ క్షణం ఆలోచించి రిప్లై ఇచ్చాడు దేవరాజ్  "నాకో త్రీ డేస్ టైం కావాలి, డబ్బు సర్దటానికి"

అటు నించి రిప్లై "ఓకే, జస్ట్ త్రీ డేస్. నా కళ్ళన్నీ నీ మీదే అని తెలుసుగా... మధ్యలో ట్రిక్స్ ప్లే చెయ్యకు"

**శ్రుతిలయ** రికార్డింగ్ స్టోడియో ముందు కారు ఆపాడు దేవరాజ్. బైటికి దిగలేదు. అదే స్టూడియోలో అంతకు ముందు జరిగిన సంఘటన తనని లోపలికి వెళ్ళనివ్వట్లేదు. వేరే ఛాయిస్ లేదని గుర్తొచ్చాక నిట్టూర్చి లోపలికి నడిచాడు.

అప్పటికే మ్యూజిక్ డైరెక్టర్ ధర్మ కొంతమందిని ఆడిషన్ చేస్తున్నాడు. తననిచూసి లేచి షేక్ హ్యాండిస్తూ "థాంక్స్ ఫర్ కమింగ్, నిన్ను చాలా రోజులుగా అప్రోచ్ అవుదామనుకున్నా కానీ కుదర్లేదు, ఈ కొత్త మూవీ ట్యూన్స్ చేస్తున్నప్పుడు నువ్వు గుర్తొచ్చావ్, షల్ వుయ్?" అన్నాడు లోపలికి చెయ్యి చూపిస్తూ.

ఒక పది నిమిషాలు ట్యూన్, సాంగ్ పల్లవి ప్రాక్టీస్ చేసుకొని రికార్డింగ్ రూంలోకి వెళ్ళి పాడాడు దేవరాజ్. అయ్యాక బైట టెక్నీషియన్స్ చప్పట్లు కొడుతున్నట్టు కనపడుతోంది తనకి. "ఇంక తిరుగులేదు" అనుకుంటూ బైటికి నడిచాడు.

"గ్రేట్ వాయిస్ యార్, ఎక్కడున్నావ్ ఇన్నాళ్ళూ" అన్నాడు నవ్వుతూ.

"థాంక్స్, ఎప్పుడు చేద్దాం?" అన్నాడు దేవరాజ్ సందేహంగా.

"నీకు రెండు సాంగ్స్ ప్లాన్ చేస్తున్నాను. టైం ఉంటే ఇవాళే చేద్దాం" అన్నాడు ధర్మ.

ఇదంతా నమ్మశక్యంగా లేదు దేవరాజ్‌కి. ఇంత ఈజీగా అవుతుందనుకోలేదు. ధర్మ ఈజ్ రియల్లీ ఎ ప్రొఫెషనల్ అనుకున్నాడు.

కొంతసేపటికి సాంగ్ పనులు జరుగుతున్నప్పుడే స్టూడియో లోపలికి వచ్చాడు మణిసామి, ఆ మూవీ ప్రొడ్యూసర్. మనిషి ఎత్తుగా, నల్లగా ఉన్నాడు. ముఖం మీద అడ్డంగా పెద్దనామాలూ, మధ్యలో ఎర్రటి బొట్టూ.

వస్తూనే దేవరాజ్ ని గుర్తుపట్టి "అబ్బా అబ్బా ఎన్నాళ్ళకి చూస్తిని నిన్ను, ఎంత జెమ్ లా పాడతావబ్బా, నీ పాట వింటుంటే నాకు శివుడు కళ్ళల్లో మెదుల్తాడు తెల్సా" అన్నాడు రెండు భుజాలూ గట్టిగా నొక్కుతూ.

దేవరాజ్ నవ్వాడు. ఇవేం తనకి కొత్తకాదు.

మణిసామి ధర్మ ని చూస్తూ "ఏం పాడిస్తన్నా అబ్బితో.." అన్నాడు. పాటల పేర్లు చెప్పాడు ప్రీతేష్. ఒక్కసారిగా మణిసామి ముఖంలో కోపం. దేవరాజ్ కేమీ అర్థం కాలేదు.

"దేవుడి పాటలు పాడే అబ్బితో ఇలాంటి బూతుపాటలు పాడిస్తావా, ఏం మతుండే చేస్తన్నావా" అన్నాడు అసహనంగా.

ధర్మ అహం దెబ్బతింది. తన గురించి అతను తిట్లు తినడం దేవరాజ్ కీ నచ్చలేదు.

"సర్ నేనొక సింగర్ ని, ఏ పాటలన్నా పాడగలను" అన్నాడు సూటిగా.

"నూ పాడగలవమ్మా, కానీ నీ చేత ఈ పిచ్చిపాటలు పాడించే బుద్ధి మాకుండకర్లా" అన్నాడు తను.

"ఆ సాంగ్స్ కి తన గొంతు బాగా సూట్ అయ్యింది, ఇప్పుడే ఆడిషన్ చేసాం సర్" అన్నాడు ధర్మ ఆఖరి ప్రయత్నంగా.

మణిసామి అతడ్ని పట్టించుకోకుండా దేవరాజ్ తో "చూడమ్మా, నిన్ను వట్టిచేత్తో పంపను. నాదే ఇంకో భక్తి సినిమా ఉంది పెద్ద హీరోతో. అందులో నీకు రెండు సాంగ్స్ ఇస్తా. బెస్ట్ ఆఫర్" అన్నాడు నింపాదిగా.

ఇప్పుడు కోపం దేవరాజ్ కళ్ళల్లోకి జేరింది. ధర్మ వైపు చూసాడు. ఏం చెయ్యలేని అసహాయత అతని మొహంలో. అంతా నిశ్శబ్దం. తను హఠాత్తుగా పైకి లేచి విసురుగా గేట్ వైపు నడిచాడు. లోపల్నించి "అబ్బీ.." అని అరుపు. ఆగలేదు. సరాసరి కారులో వచ్చి కుర్చున్నాడు.

హఠాత్తుగా జరిగిన ఆ ఇన్సిడెంట్స్ వల్ల మనసంతా అల్లకల్లోలంగా ఉంది. కోపంతో ఊపిరి బలంగా వస్తోంది. కళ్ళు ఎర్రగా మారాయి.

పక్కనున్న సీట్ ని గట్టిగా కొడుతూ పెద్దగా అరిచాడు.

6

నిత్య మనసంతా అయోమయంగా ఉంది. తన ప్రోగ్రాంని కొందరు తిడుతుంటే తను చేస్తున్నది సరైనదే అని సమర్థిస్తున్న వాళ్ళూ కనిపిస్తున్నారు. పొద్దున్నే లేచింది కానీ స్టూడియోకి సెలవపెడదామని డిసైడ్ అవుతున్న సమయంలో ఇంటినుంచి కాల్ "ఎలా వున్నావే?" అమ్మ నుంచి సూటి ప్రశ్న.

"బావున్నానమ్మా"

"బాగా ఎంజాయ్ చేస్తున్నావా?" గొంతులో జీర.

"ఆ బానే వున్నా, ఏమైంది? మీరెలావున్నారు?"

"మేమెలా ఉంటే ఏంలే, నువ్వు బావున్నావు కదా? నీ ఇష్టమొచ్చినట్టు చేస్తున్నావ్?"

"అబ్బా, ఇప్పుడేమైందని పొద్దున్నే మొదలుపెట్టావ్? నాన్నకివ్వు?"

"అవునే, నేను ఏం వాగినా నీకు పట్టదు. నువ్వు చేస్తునన్ పనులకి మా తలలెక్కడ పెట్టుకోవాలో తెలియట్లేదు" ఏడుపులోకి మారింది స్వరం.

"తల్లీ, అటూ ఇటూ తిప్పకుండా అసలేంజరిగిందో చెప్పు?"

"మన..లేదు..మా స్వామి దగ్గరకెళ్తే చుట్టుపక్కల వాళ్ళంతా నువ్వు టీవీలో చేస్తున్న రచ్చ గురించి మమ్మల్ని చెడామడా తిట్టారు. స్వామీజీ కూడా వాళ్ళని ఆపలేకపోయారు. మొన్నటి వరకూ నిన్ను మెచ్చుకున్న వాళ్ళే ఇప్పుడు అమ్మాయిని అదుపులో పెట్టుకోలేకపోయామని మమ్మల్ని..."

ఫోన్ లో వెనక ఏవో అరుపులు "ఏంటా మాటలు? లోపలికెళ్ళు"

"అమ్మా.."

"ఆ తల్లీ, ఎలా వున్నావే, అమ్మ మాటలు పట్టించుకోకు, నీకు తెలుసుగా తను కొంచెం ఎమోషనల్" నాన్న గొంతు అటువైపు.

"నాకేం చెయ్యాలో తోచట్లేదు నాన్నా" బాధగా అంది.

"నువ్వు ధైర్యంగా ఉండాలి. ఇలాంటివి వందొస్తాయి. నువ్వు ఎంచుకున్న రంగం అలాంటిది"

"అందరినీ ఎదిరించేంత ధైర్యం రావట్లేదు"

"చేస్తున్నది నీకు 100% కరెక్టే అనిపిస్తే పక్కవాళ్ళ మాటలు పట్టించుకోకు"

"అవునే, అవమానంతో నేను చచ్చాక అప్పుడు పట్టించుకుందురు గాని నువ్వూ, మీ నాన్నా" వెనక నుంచి అమమ్ అరుపు.

మౌనంగా ఉంది నిత్య అలాగే నిలబడి. మెల్లగా ఫోన్ కట్ చేసింది. కళ్ళనుండి ధారలు. అమమ్ శాపనార్థాలు తనకి కొత్తకాదు కానీ ఈసారెందుకో అవి మనసుని గట్టిగా గుచ్చుతున్నాయి.

కొంచెసేపు అలాగే ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది. వెంటనే రెడీ అయ్యి, స్టూడియోకి బయల్దేరింది.

7

కారు వేగంగా వెళ్తోంది. వాళ్ళని తరుముకొస్తున్న లారీవైపే చూస్తున్నాడు దేవరాజ్ వెనక సీట్లోనుంచి. గుండె దడగా ఉంది కానీ ఏడుపు రావట్లేదు. రానివ్వట్లేదు తన భయం. ముందునుంచి అమ్మ పెద్దగా అరుస్తోంది. నాన్న స్టీరింగ్ ని అడ్డదిడ్డంగా తిప్పుతున్నాడు రోడ్డుమీద. ఆ కుదుపులకి సీట్ల మధ్యలో ఉన్న స్థలంలో పడ్డాడు దేవరాజ్. ఉన్నట్టుండి గట్టిగా వెనకనుండి గట్టిగా గుద్దిన శబ్దం. విండో అద్దాలు పగిలి తనకి గుచ్చుకున్నాయి కొన్ని. కారు వేగంగా కిందకెళ్తున్నట్టు తెలుస్తోంది. గట్టిగా అరిచాడు చేతుల్తో చెవులు మూసేస్తూ.

చాలా సేపటి తర్వాత కళ్ళు తెరిచాడు. ముందు సీట్లో నాన్నా, అమ్మా... రక్తపు మడుగులో... చలనం లేకుండా..

"అమ్మా..." అని అరుస్తూ నిద్ర లేచాడు దేవరాజ్. పక్కనే ఉన్న వాటర్ బాటిల్ తీసుకుని గడగడా తాగేసాడు. ఒళ్ళంతా చెమట. ముఖం తుడుకుకొని టైం చూసాడు. పొద్దున్న ఐదు దాటింది. పదిహేనేళ్ళు దాటినా కలై తరుముతున్న తన గతాన్ని మార్చలేడు, మర్చిపోలేడు.

ఎన్ని పూజలు చేసింది అమ్మ? ఎన్ని గుళ్ళకి తిప్పాడు నాన్న? ఇద్దరి భక్తినీ తనలో చూసుకోవాలనే, చిన్నప్పటినుండీ తనకి సంగీతం నేర్పించారు. అదీ దేవుడిని స్తుతించడానికే! చివరి కేమైంది? తనో అనాథలా మిగిలాడు. లేదు మిగిల్చాడు. తనకిక నమ్మకం లేదు. దేవుడు ఉన్నాడన్న నమ్మకం కాదు, ఉన్నా తనలాంటి వాళ్ళకి సహాయపడతాడన్న నమ్మకం లేదు..

తన ఆలోచనలని చీలుస్తూ వచ్చిందో వాట్సాప్ వీడియో. దాన్ని చూస్తూనే షాక్ తిన్నాడు. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. వెంటనే సీనాకి కాల్ చేసాడు.

"అబ్బా, ఇంత పొద్దున్నే ఏంటి బా, నీకు తెలుసుగా పది కాందే లేవనని" అన్నాడు సీనా నిద్రలో నసుగుతూ.

"చాలా అర్జంట్, అపార్ట్‌మెంట్ కి రా తొందరగా!"

ఎప్పుడూ బైట కలుద్దామనే దేవరాజ్ ఇంత పొద్దున్నే కంగారుగా ఇంటికి పిలుస్తున్నాడంటే...

"అరగంటలో ఉంటా బా.."

సీనా వచ్చినప్పటి నుండీ ఆ వీడియో చూస్తూ రకరకాల ఊహాగానాలు చేస్తున్నారిద్దరూ.

"ఆ రోజు రాత్రి మనిద్దరమే ఉన్నాం కదా, ఇదెలా తీశాడో?"

"ఎక్కడో దాక్కొని తీసారు బా, మన హెడ్ లైట్స్ తప్పితే ఇంకే లైటింగ్ లేదు చుట్టుపక్కల"

"ఎవరు తీసుంటాడో, ఎందుకో?"

"ఏముంది, మ్యాక్సిమమ్ డబ్బులడుగుతాడు, అందుకే ఫాలో అయ్యి.."

"మనల్నెవడో ఇంత క్లోజ్ గా ఫాలో అవుతున్నా మనకి తెలీలేదంటే..వాడు బాగా ప్రొఫెషనల్ అయ్యుండాలి లేకపోతే మన కళ్ళు బాగా మూసుకు పోయిండాలి"

"బా, వాడు మీడియా కిస్తే పెద్ద దుమారం రేగుతుంది"

"రేయ్ నిన్ను పిలిచింది టెన్షన్ పెంచడానికి కాదు, సలహా కోసం. ఎవడో ఆలోచించు"

"ఇది ప్రొఫెషనల్ వర్కు లాగుంది కాబట్టి ఏ ఓల్డ్ క్రిమినలో, ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టో అయ్యుండాలి. డిటెక్టివ్ కూడా అవ్వచ్చు"

అంతలో ఆ వీడియో వచ్చిన నంబర్ నుంచే ఇంకో మెసేజ్ "ఎలా ఉంది వీడియో? ఎక్స్ క్లూసివ్ రైట్స్ నీకే ఇచ్చేస్తా ఓ ఐదు లక్షలిస్తే. కాదంటే చెప్పు ఓ పార్టీ రెడీగా ఉంది"

ఇద్దరూ ఒకళ్ళమొఖాలొకళ్ళు చూసుకున్నారు.

"ఆలోచించు బావా" అన్నాడు దేవరాజ్ తలపట్టుకోని.

"ఈ మధ్య ఎవర్నైనా అనుమానంగా తిరగటం గమనించావా" అన్నాడు సీనా బుర్రగోక్కుంటూ.

"లేదు, స్పెసిఫిక్ గా ఎవర్నీ చూళ్ళేదలా"

"మనల్ని క్లోజ్ గా ఫాలో అవుతున్నాడంటే ప్రతిరోజూ దాదాపు మనమున్న ప్లేసులకొస్తూ ఉండాలి. ఆ..నిన్న కెఫేలో కలిసిన పెద్దతను?"

"ఛ, కాదు. అతనలా కనపడలేదు. అలా ఐతే నా దగ్గరికే డైరెక్ట్ గా ఎందుకొస్తాడు?"

"హుమ్.."

"ఈ నంబర్ ని ట్రేస్ చేస్తే.."

"ఇదేదో ఫేక్ నంబర్ అయ్యింటుంది, పెద్ద ఉపయోగం ఉండదు"

"నా బుర్రేం పని చెయ్యట్లేదు..ఇది కేవలం డబ్బుకోసమే చేస్తున్నట్టులేదు" అన్నాడు దేవరాజ్.

"నీకెవరైనా ఎనిమీస్..నాకు తెలీకుండా ఎవరుంటార్లే" అన్నాడు సీనా.

దేవరాజ్ సడెన్ గా కళ్ళు పెద్దవి చేసాడు "దట్సిట్! ఎనిమీస్, నాక్కాదు, నా ప్రొఫెషన్ కి. గాడ్ కి"

ఒక్క నిమిషం ఇద్దరూ ఏమీ మాట్లాడలేదు. సీనా అర్థం అయ్యీ అవ్వనట్టు మొహం పెట్టాడు.

"అర్థం కాలేదా? నన్ను ఎక్స్ పోజ్ చేసి దేవుడి భక్తులంతా మోసగాళ్ళని ప్రూవ్ చేయాలని.."

సీనా అడ్డంగా తలూపుతూ "కాదు బా, అలా ఐతే మధ్యలో డబ్బులెందుకడుగుతారు? డైరెక్ట్ గా ఈ వీడియో మీడియాలో పెట్టచ్చు కదా?" అన్నాడు.

"నాకూ అదే అర్థం కావట్లేదు"

మళ్ళీ ఆలోచనలో పడ్డారిద్దరూ.

టీవీ ఆన్ చేసి ఛానెల్స్ మారుస్తున్నాడు సీనా. దేవరాజ్ యూట్యూబ్ లో సెర్చ్ చేస్తున్నాడు ఏమైనా క్లూ దొరుకుతుందేమోనని. ఇద్దరి కళ్ళూ ఒకే చోట ఆగాయి. ముందు వారం జరిగిన నిత్య టీవీ ప్రోగ్రాం మీద.

"ఈ అమ్మాయి చాలా డేంజరస్ గా మారిందీ మధ్య, ఏ సెలిబ్రిటీ దేవుడికి సపోర్ట్ గా మాట్లాడితే, వాళ్ళని ఫుల్ గా ఆడుకుంటోంది"

దేవరాజ్ కెందుకో నమ్మాలనిపించలేదు. "ఇది మరీ వైల్డ్ గెస్, తనే ఇలా చేయిస్తుంటే మాత్రం నువ్వన్నట్టు చచ్చినా డబ్బులడగదు, అడిగించదు"

"నీ క్రష్ కదా అని లైట్ గా తీస్కుంటున్నావ్"

దేవరాజేమీ మాట్లాడలేదు, తన కళ్ళు టీవీలో వస్తున్న 'మీ నిజం' ఛానెల్ లోగోని ఆశ్చర్యంతో చూస్తున్నాయి. తన వేళ్ళతో అటువైపే చూపిస్తూ సీనాతో అన్నాడు "బావా..ఆ సాఫ్ట్ వేర్..కఫేలో.."

"ఆ..అతను?"

"అతని ఐడీ మీద ఈ లోగో చూసినట్టు గుర్తు!"

"వాట్?"

"అవును, అతను తడబడుతూ బైటికెళ్ళాడు గుర్తుందా?"

"అవును బా, మన మాటలు విన్నాడనుకున్నాం"

"అతనే అని ఖచ్చితంగా చెప్పలేం, కానీ ఈ ఛానెల్ కీ, నిత్యకీ, మనల్ని ఫాలో అవుతున్న అతనికీ ఏదో లింకుంది" సందేహంగా అన్నాడు దేవరాజ్.

"ఆర్ యూ ష్యూర్? నాకలా అనిపించలేదు"

"కాదు. నిత్యని ఫాలో అవుదాం, తనెవర్ని కలుస్తోందో రెండ్రోజులు అబ్సర్వ్ చేస్తే నిజాలు బైటపడొచ్చు"

"మరి ఈ బ్లాక్ మెయిల్ గాడు ఊరుకుంటాడా?"

ఓ క్షణం ఆలోచించి రిప్లై ఇచ్చాడు దేవరాజ్ "నాకో త్రీ డేస్ టైం కావాలి, డబ్బు సర్దటానికి"

అటు నించి రిప్లై "ఓకే, జస్ట్ త్రీ డేస్. నా కళ్ళన్నీ నీ మీదే అని తెలుసుగా... మధ్యలో ట్రిక్స్ ప్లే చెయ్యకు"

**పొద్దుటినుంచీ** రకరకాల కారణాలతో నిత్యకి టైం ఇవ్వలేదు బాస్ శివరాం. అతనంటే గౌరవం ఉంది కానీ ఈ మధ్య ఛానెల్ రేటింగ్స్ పెంచడానికి తను ఎన్నుకుంటున్న విధానాలే నచ్చట్లేదు నిత్యకి. చాలాసేపు అతని గ్లాస్ ఆఫీస్ వైపు చూసీ చూసీ విసుగుపుట్టి సాయంత్రం డైరెక్ట్ గా డోర్ తోసుకుని లోపలికెళ్ళింది తను. శివరాం ఆమె వైపు చూస్తూ హడావిడిగా ఫోన్ లో "ఐ విల్ కాల్ యూ బ్యాక్.." అని పెట్టేసి లేచి తన దగ్గరికొచ్చాడు.

"హౌ ఆర్ యూ? మై గోల్డెన్ గర్ల్.." అన్నాడు నవ్వుతూ. బాల్డ్ హెడ్, సాల్ట్ & పెప్పర్ గడ్డం, బ్లాక్ సూట్ లో జర్నలిస్ట్ కన్నా ఓ మాఫియా డాన్ లా కనిపిస్తున్నాడతను.

"గ్రేట్, అందుకేనా పొద్దుటినుంచి అవాయిడ్ చేస్తున్నావ్ నన్ను?" అంది వెటకారంగా. నిత్యకి ఎక్కువ చనువిచ్చాడు తను.

"వాట్! నో, డోంట్ బీ సిల్లీ. నీకు తెలుసుగా అపోసిషన్ గొడవలతో పెద్ద పొలిటికల్ ఇష్యూ అవుతోంది, దాని కవరేజ్ హడావిడిలో...ఎనీవే, మా సెన్సేషనల్ యాంకర్ కి ఏంటో కంప్లైంట్?" అన్నాడు అనునయంగా. కొత్తవాళ్ళైతే ఆ మాటలకి పొంగిపోయి ఉన్న విషయం మర్చిపోయే వాళ్ళే కానీ నిత్యకి అతనూ, అతని మాటలూ కొత్తేం కాదు. కళ్ళని చూసి ఎదుటివాడు జెన్యూన్ గా మాట్లాడుతున్నాడో లేదో చెప్పగల దిట్ట ఆమె.

"శివ్, నేనో నిర్ణయానికొచ్చాను.."

"బిఫోర్ దట్, నాకో ఐడియా వచ్చింది మార్నింగ్. ఇది విను. నెక్స్ట్ వీక్ 'మనుషులు చేసిన దేవుళ్ళు' ప్రోగ్రాంలో మనం శివుడి మీద కాంట్రవర్సీ పాయింట్స్ తో ఇన్నోవేటివ్ గా ఓ ఎపిసోడ్ చేద్దాం, ఈ వీక్ కన్నా డబుల్ వ్యూవర్స్ రావాలి. ఇంకొంతమంది స్వామీజీలనీ, పెద్ద భక్తుల్నీ ప్యానెల్ కింద తెద్దాం.. వాట్ డూ యూ సే?" అన్నాడు ఉత్సాహంగా నిత్య కళ్ళల్లోకి చూస్తూ.

తనకిష్టమైన దేవుడు, రోజూ కొలిచే దేవుడు.. నిత్య మొహంలో రంగులు మారాయి. అసహ్యంగా మొహం పెట్టి "శివ్, మనం లిమిట్స్ క్రాస్ చేస్తున్నట్టున్నాం, మనం ప్రోగ్రాం మొదలుపెట్టిన ఉద్దేశ్యం వేరు, ఇప్పుడు వెళ్తున్న దారి వేరు.. అందుకే నేను తప్పుకోవాలనుకుంటున్నాను.." అంది దృఢంగా.

శివరాం అది విని షాక్ తిని "కమాన్ నిత్యా! ఈ ప్రోగ్రామే తేక పోతే, నీకీరోజు ఈ పాపులారిటీ వచ్చేదే కాదు, డోంట్ ఫర్గెట్" అన్నాడు విసురుగా.

"ఇట్స్ ఓకే. నాకు నచ్చిన పని చేసే రైట్ నాకుంది. నేను వేరే ప్రోగ్రామ్స్, లైవ్ షోస్ తీస్కుంటాను"

"నీ టాలెంట్ ఎక్కడ వాడాలో నాకు బాగా తెలుసు, ఆ ప్రోగ్రామ్స్ కి వేరేవాళ్ళున్నారు, నువ్వు నెక్స్ట్ వీక్ చేస్తున్నావ్, అంతే" అన్నాడు గట్టిగా.

నిత్య మనసంతా కల్లోలంగా మారింది "నో.. చెయ్యలేను.."

"ఏ, నీకు దేవుడంటే నమ్మకం లేనప్పుడు, ప్రాబ్లం ఏంటి?"

"నువ్వే! నువ్వు బాగా మారిపోయావ్. జర్నలిజం పక్కన పెట్టి పక్కా బిజినెస్ లా మారుస్తున్నావ్ మన ప్రొఫెషన్ ని.. నీదే ఇంకో ఛానెల్ లో పొద్దున్నే భక్తి గీతాలూ, ప్రవచనాలూ టెలీకాస్ట్ చేస్తున్నావ్, మన ఛానెల్ లో దేవుడ్ని తిట్టే ప్రోగ్రాంస్ చేస్తున్నావ్.. సిగ్గులేని హిపోక్రసీ"

"హేయ్, నువ్వు మరీ ఎమోషనల్ గా తీస్కుంటున్నావ్, కూల్ డౌన్. మన ఇండస్ట్రీలో ఏ టైంలో, ఏ వయసు వాళ్ళకి, ఎలాంటి కార్యక్రమాలు చెయ్యాలో బాగా క్లారిటీ వచ్చేసింది. పొద్దున భక్తి ప్రోగ్రాం చూసే వాళ్ళు వేరు, రాత్రి పూట 'నేరాలూ ఘోరాలూ' చూసే వాళ్ళు వేరు. ఒకవేళ ఒకళ్ళే చూసినా ఆ టైంలో వాళ్ళకవే కావాలి. వాళ్ళకి ఎంటర్టైన్మెంట్ కావాలి. అంతేగానీ ఇలాంటి అనవసరమైన విషయాలు పట్టించుకోరు జనాలు.." అన్నాడు తేలిగ్గా.

రెండు నిమిషాలు మౌనంగా ఉంది నిత్య. తర్వాత గిరుక్కున వెనక్కి తిరిగి బైటికి వెళ్ళిపోయింది.

"నెక్స్ట్ వీక్ చేస్తున్నావ్ కదా ఐతే.." వెనకనుంచి శివరాం అరుపు.

బైటికైతే వచ్చింది కానీ నిత్యకేం చెయ్యాలో తోచలేదు. తల తిరుగుతోంది. ఉప్పొంగుకొస్తునన్ కన్నీళ్ళకి ఆనకట్ట వేసి స్టూడియో పక్కనే ఉన్న కఫేలోకి నడిచింది. అన్నీ తెలిసి ఈ ఉచ్చులో ఎలా ఇరుక్కుందో అర్థంకాలేదు. తాత్కాలికంగా వస్తున్న లైక్ లకీ, ఫాలోవర్స్ కీ లొంగిపోయి శాశ్వతంగా మనతో వచ్చే విశ్వాసాలనీ, విలువలనీ తాకట్టు పెట్టినట్టనిపిస్తోంది. న్యూస్ ని కూడా ఎంటర్టైన్మెంట్ గా మార్చిన ఛానెల్స్ మీదా, సమర్థిస్తునన్ జనాల మీదా అసహ్యం వేసింది.

అలా ఓ గంటగడిచాక తన కొలీగ్ ఒకామె కఫే లోపలికొస్తూ హఠాత్తుగా తన దగ్గర ఆగి "కంగ్రాట్స్ నిత్యా.." అంది నవ్వుతూ

"ఎందుకు?"

"ట్విట్టర్ చూళ్ళేదా నువ్వు, నువ్వూ నీ ప్రోగ్రాం ట్రెండ్ అవుతున్నాయ్" అంటూ తన ఫోన్ నిత్య మొహం మీద పెట్టింది. శివరాం ట్వీట్ ఉంది అందులో

"హెలో ఫ్యాన్స్, వచ్చేవారం మీ ఫ్యావరెట్ ప్రోగ్రాంలో శివుడి మీద కాంట్రవర్షియల్ సబ్జెక్ట్ తో రాబోతోంది మీ డేరింగ్ అండ్ డైనమిక్ యాంకర్ నిత్య!

స్టే ట్యూన్డ్ ఫర్ మోర్ అప్డేట్స్".

కింద నిత్యని తిడుతూ పెట్టిన వందలమంది రిప్లైలు.

అది చూసి నిత్య మొహం ఎర్రబడింది, శ్వాస వేడిగా మారింది.

పైకి చూస్తూ అంది కొలీగ్ తో

"నేనీ ప్రోగ్రామే చెయ్యట్లేదు!"

## 9

రాత్రి తొమ్మిదైంది. నిత్య ఇంటి దగ్గరలోనే ఉన్న ఇరానీ చాయ్ షాప్ లో టీ తాగుతున్నాడు సూరి. తనూహించినట్టే అన్న నుంచి కాల్. వణుకుతూ తీసాడు.

"అన్నా.."

"ఏందిరా అన్నా, నీ యవ్వ పదిరోజులైంది ఇంతవరకు సరుకు తేలేకపోయావ్"

"లేదే, మాక్సిమమ్ ట్రై చేస్తన్నా, మూడు సార్లు ప్యాకింగ్ చెయ్యబోతే లాస్ట్ మినిట్ లో స్లిప్ అయ్యింది"

"థూ.. వెంటనే పనైపోద్ది అని నిన్ను పంపితే..నాకీ లొల్లేంది రా? నిన్న మొన్నొచ్చిన మెంబర్సే మంచిగ జేస్తున్నారింకా"

చెంప చెళ్ళుమంది సూరికి.

"అనా, ఇంకో మూడ్రోజులు టైమియ్యే, సరుకు నీకాడుంటది"

"ఒక్క రోజు, ఒక్కరోజే నీకు టైం. రేపీపాటికి నాకు డెలివరీ అవ్వాలి. తెల్సుగా ఇది పార్టీ యవ్వారం" అని ఫోన్ కట్ చేసాడు.

సూరి ఓ క్షణం ఫోన్ వంక చూసి అనుకున్నాడు "*రేపు ఖచ్చితంగా టార్గెట్ చెయ్యాలి*"

## 10

పొద్దున ఆరైంది. దేవరాజ్, సీనా కారులో వెయిట్ చేస్తున్నారు. ఇద్దరి చూపులూ నిత్య అపార్ట్‌మెంట్ వైపే ఉన్నాయి. శివరాం పెట్టిన ట్వీట్ తో దేవరాజ్ కున్న సందేహాలన్నీ క్లియరయ్యాయి. *తనెంతకైకా తెగించగలదు. ఓ రెండ్రోజులు తనని క్లోజ్ గా ఫాలో అవ్వాలి, ఏ క్లూ దొరక్కపోతే తనతోనే స్ట్రైట్ గా మాట్లాడాలి.*

"బా ఎప్పుడొస్తుందంటావ్?" సీనా అసహనంగా అడిగాడు.

"నాకు చెప్పలేదురా"

"నీ జాన్‌జిగ్రీ కదా..తెలుసేమోననీ.." అన్నాడు వెటకారంగా.

దేవరాజేం రిప్లై ఇవ్వలేదు. తల్లిదండ్రులు తనని విడిచి పోయినప్పటినుంచీ ఎవరితోనూ క్లోజ్ గా లేడు భయంతో. సీనా తప్పితే మరెవ్వరూ ఫ్రెండ్స్ లేరు. ఇప్పుడిప్పుడే నిత్యని ఇష్టపడుతున్నాడు కానీ ఇంతలోనే...

"బా..తనే కదా?" అంటూ పార్కింగ్ లాట్ వైపు చూపించాడు సీనా. అటు చూసాడు దేవరాజ్. ఎల్లో పంజాబీ డ్రెస్, రెడ్ చున్నీతో కిందకొచ్చింది నిత్య. పార్కింగ్ లో ముఖానికి మాస్క్ పెట్టుకుని స్కూటీ స్టార్ట్ చేసి వేగంగా గేటు బైటికొచ్చింది.

తను కొంతదూరం వెళ్ళాక మెల్లగా కారుని అదే డైరెక్షన్ లో పోనిచ్చాడు దేవరాజ్.

కొంచెం సేపటికి హైవే-65 మీదకి మళ్ళింది నిత్య. అదే సమయంలో తమ మధ్యలోకి ఓ బ్లాక్ బొలేరో సడెన్ గా కట్ కొట్టింది. రెండు నిమిషాలలో దాన్ని దాటి తన కారుని ముందుకు తీసుకెళ్ళాడు దేవరాజ్. వెంటనే మళ్ళీ బొలేరో ఓవర్ టేక్ చెయ్యడంతో, ఒకరిమొహాలొకళ్ళు చూసుకున్నారు దేవరాజ్, సీనాలు. పదినిమిషాల పాటు ఆ బొలేరో మెల్లగా నిత్య వెనకాలే వెళ్తుండటంతో, సీనా "ఏంటిది బావా?" అన్నాడు అనుమానంగా.

"నిత్యని ఇంకెవరో ఫాలో చేస్తున్నారు" అన్నాడు దేవరాజ్ మెల్లగా.

"హైవే మీద ఎంతదూరం వెళ్తుంది బా నిత్య? ఇలాగే విజయవాడ దాకా ఎళ్ళిపోద్దా ఏంటీ?"

"ఎవర్నో కలవడానికెళ్తున్నట్టుంది, లెట్స్ సీ.."

నిత్య బైక్ సడెన్ గా సెర్వీస్ రోడ్ లోకి తిరిగింది. పక్కనున్న బోర్డ్ చదివాడు సీనా "సంఘీ టెంపుల్ రోడ్".. "డౌట్ లేదన్నా, టెంపుల్ దగ్గర్లో ఎవర్నో కలుస్తోంది.. ఈ మహాతల్లి టెంపుల్ లోపలికెళ్ళే రకం కాదు కదా" అని కళ్ళుమూసుకున్నాడు. టంగ్ స్లిప్.

దేవరాజ్ ఓ సీరియస్ లుక్కిచ్చి, కారుని సెర్వీస్ రోడ్డు మీదకి పోనిచ్చాడు. వారి మధ్యలో బొలేరో అలానే ఉంది. గుడి దగ్గరగా వస్తుందనగా, పక్కనున్న నిర్మానుష్యమైన వీధిలోకి తిప్పి, బండి ఆపి దిగింది నిత్య. చుట్టూ చూసి లాక్ చేసి వెనక్కి గుడివైపు నడుస్తోంది.

ఆ విధి ముందే ఆపాడు బొలేరోని సూరి నిత్యకి కనపడకుండా. తలుపు తెరిచే ఉంచాడు. దేవరాజ్ అతనికి కొంచెం వెనకాల కారు ఆపాడు. ఏదో జరగబోతోందన్న అనుమానంతో సీనాని అడిగాడు "మనదగ్గరేమన్నా రాడ్ ఉందా?"

సీనా షాక్ తిని, తడబడుతూ "బా..అదీ.. బ్యాక్ సీట్ లో క్రికెట్ బ్యాట్ ఉండాలి కిట్ బ్యాగ్ లో.." అంటూ వెనక్కి తెరిగి బ్యాట్ అందుకుని దేవరాజ్ కిచ్చాడు.

నిత్య నడుస్తూ సందు తిరగ్గానే, వెనకాల్నించి సూరి పరిగెత్తుకుంటూ వచ్చి నోటికి గుడ్డ అడ్డంపెట్టి అమాంతం ఎత్తుకుని కారులో పడేయబోయాడు. ఏం జరుగుతోందో అర్థంకాని నిత్య అతన్ని బలంగా కాళ్ళతో, చేతుల్తో కొడుతోంది. హఠాత్తుగా జరిగిన ఆ పరిణామానికి ఒక్క క్షణం నివ్వెరపోయి తేరుకుని కారు తీసి పరిగెత్తారు దేవరాజ్, సీనాలు.

"రేయ్..రేయ్..వదలండ్రా.." అని అరిచాడు దేవరాజ్.

అరుచుకుంటూ తమ వైపు వస్తున్న ఇద్దరినీ చూసి ఖంగుతిన్నాడు సూరి. *వీళ్ళెవరు? పోలీసుల్లా లేరు? నిత్య ఫ్రెండ్సా?* డ్రైవర్ వైపు చూసి తలూపాడు. వాడు వాళ్ళకెదురుగా పరిగెత్తాడు. తన బ్యాట్ తో వాడి తలమీద ఒక్క షాట్ ఇచ్చాడు దేవరాజ్. కళ్ళు బైర్లుకమ్మి అక్కడే పడిపోయ్యాడు వాడు. అది చూసి షాకి తిని సూరి నిత్యని వదిలేసి, సైడ్ డోర్లో పడున్న జాకీ రాడ్ తీస్కొని ఎదురెళ్ళాడు. వేగంగా పరిగెత్తుతూ వచ్చిన దేవరాజ్, బ్యాట్ తో గట్టిగా సూరి చేతి మీద కొట్టాడు.

వాడు "అబ్బా.." అంటూ రాడ్ ని వదిలేశాడు.

అదే అదనుగా వాడి భుజం మీద గట్టిగా కొట్టాడు దేవరాజ్. వాడు అరస్తూ కింద పడిపోయాడు.

"సీనా.. నిత్యని పక్కకి తీస్కెళ్ళు" అరిచాడు దేవరాజ్.

సీనా వచ్చి నిత్య నోట్లో కుక్కిన గుడ్డలు తీసి వాళ్ళ కారు దగ్గరికి తీసుకెళ్ళాడు. నిత్యకి తలతిరుగుతోంది. ఎవరు, ఎవర్ని, ఎందుకు కొడుతున్నారో అసలర్థం కావట్లేదు తనకి.

సూరితో "ఏవర్రా మీరూ.., ఎందుకు నిత్యని కిడ్నాప్ చేస్తున్నారు?" అన్నాడు దేవరాజ్.

సూరి లేవబోతూ హఠాత్తుగా పరిగెత్తుకొచ్చి బలంగా తలతో దేవరాజ్ పొట్టలో తన్నాడు. ఆ దెబ్బకి దూరంగా పడిపోయాడు దేవరాజ్. అంతలో బొలేరో డ్రైవర్ కార్ స్టార్ట్ చేసి గట్టిగా అరిచాడు "అన్నా..వచ్చెయ్.. మళ్ళ చూసుకుందాం.."

సూరి ఒక్క నిమిషం తటపటాయించి పరిగెత్తి కారులోకి దూకాడు. దేవరాజ్ లేచి ఆ కారు వెంట వేగంగా పరిగెత్తాడు..కానీ అందుకోలేకపోయాడు.

సూరి విండో లోంచి తలబయట పెట్టి వెనక్కి తిరిగి పెద్దగా అరిచాడు

“అనవసరంగా గెలికార్రా..నా కొడకల్లారా..చస్తారు..!”

“నిత్య జోలికొస్తే మీరే ఛస్తారు...ఒక్కడూ మిగలడు నా చేతుల్లో” అని వేలితో బెదిరిస్తూ తిరిగి అరిచాడు దేవరాజ్.

అతని ఆవేశాన్ని చూసి నోరు తెరిచింది నిత్య.

**"ఎవరు మీరు?"** అడిగింది నిత్య. ముగ్గురూ సంఘీ టెంపుల్ మెట్లమీద కుర్చొని ఉన్నారు. దేవరాజ్ మొహమంతా దుమ్ము, రేగిన జుట్టు. పెనుగులాటలో తగిలిన దెబ్బల నొప్పి ఇప్పుడు తెలుస్తోంది. .

"నన్నెందుకు ఫాలో అవుతున్నారు?" అంది మళ్ళీ.

"ఇది టూ మచ్ నిత్యా, నిన్ను కిడ్నాప్ చేసినోళ్ళనొదిలేసి సేవ్ చేసిన మమ్మల్ని ఇంటరాగేట్ చేస్తున్నావా?" అన్నాడు సీనా చిరాగ్గా.

"సారీ, ఐ మీన్ థాంక్యూ నన్ను కాపాడినందుకు" అంది దేవరాజ్ కళ్ళల్లోకి చూస్తూ. తను అడ్డంగా తలాడించాడు.

"వాట్! ఐ మీన్ ఇట్.. కానీ నేనెలా తెలుసు నీకు?" నసిగింది తను.

ఇవన్నీ పట్టించుకోవట్లేదు తను.

తన మనసంతా తర్వాత పొంచి ఉన్న ప్రమాదం మీదే ఉంది. ఎవడు నిత్యని కిడ్నాప్ చెయ్యాలని చూస్తోంది? తనంత వయొలెంట్ గా ఉన్నాడంటే ఎవరో పెద్దహ్యాండ్ ఉండుంటుందా దీంట్లో? అసలీ అమ్మాయితో పనేంటి? పశ్నల సుడులు తిరుగుతున్నాయి. ఒక్కటి మాత్రం ఖాయం, వెళ్ళినవాడు దెబ్బతిన్న పులి. మళ్ళీ వెంటనే రావచ్చు.

"ఇద్దరూ వినండి, మనం ఇక్కడెక్కువసేపు ఉండటం రిస్కు, వాళ్ళు మళ్ళీ రావచ్చు. లెట్స్ మూవ్ ఫాస్ట్" అన్నాడు.

"బా..ఎదన్నా హోటెల్ ట్రై చేద్దామా? సేఫ్ కదా" అన్నాడు సీనా.

దేవరాజ్ నవ్వి "నా అంచనా కరెక్టైతే, మనం రింగ్ రోడ్ దాటి సిటీ లోపలి క్కూడా వెళ్ళలేం, వాళ్ళ మనుషులు మన కోసం తిరుగుతూ ఉండొచ్చు" అన్నాడు.

"మరెలా ఇప్పుడు, నా ఫ్రెండ్ ఉంటుంది విజయవాడ హైవేదారిలో, అక్కడికెల్దామా" అంది నిత్య ఇద్దరినీ చూస్తూ.

"గుడ్ ఐడియా, కానీ మనం సిటీ వైపు రాకపోతే వాళ్ళు ఫస్ట్ ఎక్స్పెక్ట్ చేసేది విజయవాడ హైవేనే. వాళ్ళు మనల్ని ఈజీగా క్యాచ్ చెయ్యచ్చు రెండు వైపుల నుండీ"

"నీ ప్లానేంటి బా మరి..?"

"సీనా నువ్వో పనిచెయ్యి. నిత్య స్కూటీ తీస్కొని సిటీ వైపు వెళ్ళు. నిన్నంత దగ్గరగా చూడలేదు కాబట్టి వాడు గుర్తు పట్టలేదు. ఎందుకైనా మంచిది కార్లో క్రికెట్ జెర్సీ, క్యాప్ ఉన్నాయి. పెట్టుకోని వెళ్ళు. నువ్వెళ్తే, మాకు సిటీలో ఏం జరుగుతోందో చెప్తూ ఉండచ్చు"

"నిన్నీ పరిస్థితిలో వదిలేసెలా ఎలా ఎళ్ళను బా..?"

దేవరాజ్ నిత్య వైపు చూసాడు. ఆమె ముఖంలో అదే ప్రశ్న కనపడుతోంది.

"మేమిద్దరం శ్రీశైలం వేపు వెళ్తాం.."

నిత్య హఠాత్తుగా పైకి లేచి "నీతో రావల్సినవసరం నాకు లేదు. మా బాస్ కి చాలా ఇన్ఫ్లుయెన్సుంది, నన్నెలాగైనా బైట పడెయ్యగలడు" అని మొబైల్ తీయబోయింది. చూస్తే తన చేతిలో లేదది! అప్పుడు గుర్తొచ్చింది, ఇందాకటి పెనుగులాటలో సూరి కారుసీట్లో పడిపోయిందని. లోపల్లోపలే తిట్టుకుని, మళ్ళీ కూలబడింది మెట్లమీద.

"నిత్యా, ఇందులో ఎవరెవరు ఇన్వాల్ అయ్యిన్నారో తెలీదు. ప్లీజ్ అర్థం చేస్కో. శ్రీశైలానికి ఔటర్ రింగ్ రోడ్ తగలకుండా ఇంకో రూటుంది. అటువైపు వెళ్దాం. ఒక సేఫ్ ప్లేస్ చేరుకున్నాక నెక్స్ట్ స్టెప్స్ ఆలోచించచ్చు" అన్నాడు.

తలూపింది తను. ముగ్గురూ లేవబోతుంటే "అయ్యో! మర్చిపోయ్యాను" అని అరిచింది నిత్య.

ఇద్దరూ అదిరిపడ్డారు.

"గివ్ మీ టూ మినిట్స్" అని తను మెట్లు హడావిడిగా పైకెక్కి గుడిలోకి వెళ్ళి కొంచెం సేపటికి రొప్పుతూ మళ్ళీ వెనక్కొచ్చి "వెళ్దామా' అంది. తన చేతిలో ప్రసాదం, నుదుటిన పెదద్ బొట్టు. దేవరాజ్, సీనాలు ఒకళ్ళమొహాలొకళ్ళు చూసుకున్నారు.

సీనా షర్ట్ మార్చుకొని స్కూటీ మీద బయల్దేరాడు. దేవరాజ్ నిత్యతో కారెక్కి వెనక్కి వెళ్ళబోతూ ఓ క్షణం ఆలోచించి "నీ చున్నీ ఇస్తావా!" అన్నాడు.

నిత్య షాక్ తిని "ఏయ్, ఎందుకు?" అంది.

"అబ్బ ఇలా అన్నిటికీ డౌట్ పడితే కష్టం" అన్నాడు.

తను చున్నీ ఇచ్చింది తటపటాయిస్తూ. దేవరాజ్ దాన్ని కారు ముందు బానెట్ మీద పరిచి మార్కర్ పెన్‌తో ఏదో రాసాడు. తర్వాత మెట్ల పక్కనే ఉన్న పోల్ కి కట్టి వచ్చి కారు యూ టర్న్ తీస్కుని రోడ్డుమీద కొచ్చాడు. నిత్యకేం జరిగిందో అర్థం కాలేదు. రియర్ వ్యూ మిర్రర్ తనవైపు తిప్పుకుని చూసింది.

అందులో వెనక జెండాలా రెపరెపలాడుతున్న తన చున్నీ మీద రాసున్నది చదివి ఆశ్చర్యంతో చూసింది దేవరాజ్ వైపు..

12

టెన్షన్ తో వెనక్కి వెళ్తున్న సీనాకి సిటీ ఎంట్రన్స్ లోనే ఓ జీప్ దగ్గర అందర్నీ గమనిస్తునన్ ఓ గ్యాంగ్ కనపడింది. ఇంకో జీప్ వేగంగా టెంపుల్ రోడ్ వైపు కెళ్తూ కపడింది. ఎవరూ తనని పట్టించుకోక పోవడంతో ఊపిరి పీల్చుకుని వేగంగా వాళ్ళని దాటి, చాలా దూరం వెళ్ళి ఓ సందు తిరిగాక కాల్ చేసాడు.

దేవరాజ్ అప్పటికే శ్రీశైలం రోడ్ వైపు తిప్పాడు కారుని. తన మనసంతా ఆందోళనగా ఉంది. ఆ రోడ్ లో ఎక్కువ సైడ్ రోడ్స్ ఉండవు. ఇరుక్కుపోతే బైటపడే అవకాశం తక్కువ. కానీ ఇవేమీ మొహంలో కనపడనీయట్లేదు తను. సీనా కాల్ తో తన అనుమానం కన్ఫర్మ్ అయ్యింది. ప్రస్తుతానికిదే సేఫ్ రూట్.

కొంచెం దూరం ఇద్దరూ మౌనంగా ఉన్నారు. దేవరాజే కుతూహలంతో అడిగాడు "ఆ కిడ్నాపర్ ఎవరో తెలుసా నీకు?" అని

"వుహూ, నాకేం కిడ్నాపర్ తో పరిచయాల్లేవు!"

"అదికాదు, ఎవరికి సంబంధించిన వాడా అని"

"ఏమో, ఇలా ఎప్పుడూ నా వెంటెవరూ పడలేదు, ఫస్ట్ టైమ్"

"నీకు ముందేమన్నా త్రెట్ కాల్స్ కానీ, మెసేజెస్ కానీ.."

"వావ్, నువ్వు పోలీస్ డిపార్ట్మెంటా?"

"కాదు, ఎందుకా అనుమానం నీకు?"

"మా ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ ల కన్నా షార్ప్ గా ఆలోచిస్తుంటే..

"సర్లే, ముందు సమాధానం చెప్పు, ఎవరైనా బెదిరించారా ఇంతకుముందు"

"యెస్, యూట్యూబ్ వీడియోస్ లో చాలా మంది నన్ను చంపేస్తామనో, చంపెయ్యాలనో కామెంట్స్ పెడుతుంటారు. వాళ్ళకి ఛాన్సిస్తే ఎన్ని మర్డర్లు జరుగుతాయో" అంది నిర్లక్ష్యంగా నవ్వుతూ.

"అవును, మీ పిచ్చి ప్రోగ్రామ్స్ తో మీరే జనాలని శాడిస్టుల్లా మారుస్తున్నారు" అన్నాడు తనూ నవ్వుతూ.

అతని కళ్ళల్లోకి చూసింది నిత్య. ఏదో ఎనిగ్మా. తననెక్కడో చూసినట్టనిపిస్తోంది కానీ గుర్తు రావట్లేదు.

"ఇంతకీ నువ్వెందుకు నన్ను ఫాలో అవుతున్నావో మాత్రం చెప్పలేదు" అంది తను చేతులు కట్టుకుంటూ.

"మేము నిన్ను ఫాలో అవ్వడమేంటి? గుడివైపెళ్తుంటే నీ అరుపులు విని అటు వచ్చాం" అన్నాడు.

"ఛ, సరిగ్గా అదే టైంలో అంత నిర్మానుష్యమైన రోడ్ లోకెలా వచ్చావ్, అదీ కాక వాడితో నా జోలికొస్తే బాగుండదని వార్నింగ్ ఎందుకిచ్చావ్?"

"అదీ.." దేవరాజ్ తడబడ్డాడు, తన కళ్ళల్లోకి చూడలేకపోయాడు.

"అసలెవరు నువ్వు? నన్ను రోజూ ఫాలో చేస్తున్నావా? నేనెక్కడి కెళ్ళినా చాటుగా చూస్తున్నావా?...కొంపదీసి లవ్ చేస్తున్నావా?" అంది.

ఆ మాటతో దేవరాజ్ గుండె వేగం పెరిగిపోయింది. ఒక్కసారిగా సర్రున బ్రేక్ వేసి కారు రోడ్డు పక్కగా ఆపాడు.

కారులోంచి వాటర్ బాటిల్ తీసుకుని ముఖం కడుక్కుని ఓ సిగరెట్ వెలిగించాడు. ఆలోచిస్తూ పది నిమిషాలు బైటే నించొని ఉన్నాడు. నిత్య కారు దిగింది. అతని ముఖం స్పష్టంగా కనపడుతోందిప్పుడు. తనలో ఏదో కలవరం మొదలయ్యింది.

"నువ్వు..నువ్వు..ఓ సారి నీ మొబైల్ ఇవ్వు.."

ఇచ్చాడు తను. తనెప్పుడూ వినే భక్తి కలెక్షన్ ని సెర్చ్ చేసింది. టాప్ రిసల్ట్ లో కనపడిన "దేవరాజ్ హిట్స్" ఐకాన్ మీద నవ్వుతున్న అదే ముఖం తన ఎదురుగా ఉండటంతో అప్రయత్నంగా ఆమె నోటిలోంచి చిన్న అరుపు. తన కళ్ళని నమ్మలేకపోతోంది, మెల్లగా వచ్చి కార్ సీట్ లో కూర్చుంది.

మళ్ళీ స్టార్ట్ అయ్యి కొంతదూరం ముందుకు వెళ్ళాక అంది నితయ్ మెల్లగా "ఐ యామ్ ఎ బిగ్ ఫ్యాన్ ఆఫ్ యూ దేవరాజ్!"

ఇప్పుడు షాక్ తినడం అతనివంతయ్యింది.

## 13

హడావిడిగా రెండు జీపుల్లో మళ్ళీ గుడిదగ్గరికొచ్చిన సూరికి అక్కడెవరూ కనపడక పోవడంతో కోపం నెత్తికెక్కింది. ఇక్కడా లేకుండా, ఊళ్ళోకీ రాకుండా ఎక్కడికెళ్లినట్టు? అప్పుడే అతని కళ్ళు దూరంగా ఎగురుతున్న చున్నీ మీద పడ్డాయి "నీకు దమ్ముంటే, విజయవాడ బెంజ్ సర్కిల్ లో టచ్ చెయ్యరా నన్ను!"

అది చూసి తనకి పిచ్చెక్కింది. పెద్దగా అరిచాడు "వస్తున్నానే, ఈ సారెవడు కాపాడతాడో చూస్తాను" అంటూ విజయవాడ హైవే మీద వేగంగా పోనివ్వడం మొదలెట్టాడు.

జీపులో వెనకున్న ఓ గ్యాంగ్ మెంబర్ పెద్దగా అన్నాడు "సూరన్నా, ఓ సారి బాబ్జీ అన్నకి చెప్పచ్చు కదా, ఇదంతా తెలిస్తే మనల్ని చంపేస్తాడు". సూరి భయం కూడా అదే. ఎలోగొలా తనే సాధించాలి. కానీ చిన్న యవ్వారం అని మెదలెట్టింది గాలివానలా తయారౌతోంది. ఇదంతా అన్నకి తెలిస్తే..

కానీ అప్పటికే ఆ చున్నీ ఫొటో బాబ్జీకి వాట్సాప్ చేసాడో గ్యాంగ్ మెంబర్!

## 14

బాల్రెడ్డి గాజువాక అలియాస్ సోమీ బాబ్జీ. స్వయానా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి నర్సిరెడ్డి బామ్మరిది. అక్కతో పాటు బావ ఇంటికొచ్చి వాళ్ళ దగ్గరే ఉండి పెరిగాడు. ఇంజినీరింగ్ పైన మోజుతో కంప్యూటర్సే చదవాలని పట్టుబట్టి మేనేజ్‌మెంట్ కోటాలో జేరాడు కానీ, ప్రతి ఏడు పెరిగిపోతున్న బ్యాక్ లాగ్ చూసి థర్డ్ ఇయర్ లో మనసు మార్చుకొని ఫ్యామిలీ బిజినెస్ అయిన పాలిటిక్స్ లో జేరాడు. గత పదేళ్ళుగా బావ పక్కనే ఉండి ఎమెల్యే స్థాయి నుండి మంత్రి దాకా తీసుకొచ్చాడు. ముఖ్యంగా గత ఎన్నికల్లో సోషల్ మీడియాని వాడి ప్రత్యర్థుల మీద బురద జల్లడం, బావ చేసిన చిన్న పనులని కూడా వినూత్నంగా ప్రచారం చెయ్యడంతో నర్సిరెడ్డి విజయం ఖాయమైంది. అందుకే తనపేరుకి 'సోమీ' అనే సబ్ టైటిల్ ని కలిపారు పార్టీ కార్యకర్తలు ముద్దుగా.

తనింటి బాల్కనీలో ట్రెడ్ మిల్ మీద రన్నింగ్ చేస్తున్నాడు బాబ్జీ. ఎదురుగా ప్యానెల్ మీద మొబైల్. అప్పుడే వాట్సాప్ లో వచ్చిన ఫొటో మెసేజ్ చూసి హడావిడిగా కిందకి దిగాడు. సూరి గ్యాంగ్ మెంబరే ఆ ఫొటో పంపడంతో క్షణంలో విషయం అర్థమైంది తనకి. చిన్న విషయంలో సూరి ఫెయిల్ అయినందుకు కోపంతో రగిలిపోయాడు. కానీ వెంటనే తన యోగా గురూ చెప్పిన మాటలు గుర్తొచ్చి ఓ పది సార్లు డీప్ బ్రీత్ తీస్కుని నెమ్మదిగా ఓ కాల్ చేసాడు.

"సూరీ, ఎక్కడున్నావ్?"

"అదీ, అన్నా..ఆ యాంకర్ ఆల్మోస్ట్ దొరికేసినట్టే, రేపీపాటికి నీ దగ్గరుంటదన్నా" నెర్వస్ గా అన్నాడు సూరి.

"బుర్రుందా నీకు? అదేదో రాసి పెడితే గుడ్డిగా విజయవాడ వైపెళ్తున్నావా? నీలాంటోడే వాట్సాప్ మెసేజ్ చూసి పుణ్యమొస్తదని పల్టీలు కొట్టుకుంటూ హిమాలయాలకెళ్ళాడంట!"

సూరి ఖంగు తిన్నాడు. తనగ్యాంగ్ లోనే ఎవరో డైరెక్ట్ గా అన్నతో కాంటాక్ట్ లో ఉన్నారని అర్థమైంది. ఇంక బుకాయించడం ఇష్టంలేక "లేదనా, మేము ఆల్రెడీ సిటీ ఎంట్రన్స్ లన్నీ చెక్ చేసాం. వాళ్ళ కారు సిటీలోకి రాలేదు"

"కారేంటి? తనది బైక్ అన్నావు కదా, 'వాళ్ళూ' అంటే తను ఒంటరిగా లేదా?"

సూరి భయపడుతూ జరిగిందంతా చెప్పాడు.

బాబ్జీ కోపంతో "ఇడియట్! ఇంత జరుగుతున్నా నాకు చెప్పకుండా ఏం చేస్తున్నట్టు? నువ్వో పన్చెయ్యి, ఓ జీప్ విజయవాడ వైపు పంపి నువ్వు వెనక్కి తిరుగు, నేను పావుగంటలో మీరెటళ్ళాలో చెప్తాను. ఇంతకీ ఏం కారది? నంబరు చూసావా?" అన్నాడు.

"అదీ..రెడ్ హోండాసిటీ అన్నా..హడావిడిలో నంబరు చూడలేదు.." నసిగాడు సూరి.

"ఛ, నీ తెలివితేటలని నమ్మిన నన్ననాలి. ఇంక నుంచి ఏం జరిగినా వెంటనే నాకు చెప్పు. ముందు యూ టర్న్ తీస్కో"

ఫోన్లోనే తలాడించాడు సూరి.

ఓ రెండు నిమిషాలు ఆలోచిస్తూ కుర్చున్నాడు బాబ్జీ. *బావకి ఎంత హెల్ప్ చేస్తున్నా తనంటే చిన్నచూపు. పార్టీలో యూత్ లీడర్ చేస్తానని తను అడుగుతున్నా వేరవరికో కట్టబెట్టాడు రికమెండ్ చేసి మరీ. రెండు నెలల్లో ఎలెక్షన్స్. మార్చాలి. బలంగా ఏదైనా చెయ్యాలి. 'మీ నిజం' ఛానెల్ వాళ్ళు చేసే ప్రోగ్రాంస్ అన్నీ బావమీద బురద జల్లుతున్నవే. ముఖ్యంగా బాగా పాపులరవుతున్న నిత్య ప్రోగ్రాం. దాని వెనక్కున్నది అపోజిషన్ నేతలని బైటపెట్టి సెంసేషన్ చేసి బావ మెప్పు పొందాలనుకున్నాడు. కానీ నిత్య తప్పించుకుంది. ఎవడు తనకి సహాయం చేస్తోంది?*

ఆలోచనల్లోంచి బైటికొచ్చి ట్రాఫిక్ కంట్రోల్ రూంలో తనకి తెలిసిన టెక్నికల్ మెంబర్ కి కాల్ చేసి జాగ్రత్తగా సిటీ ఎంట్రన్స్ పాయింట్స్ మానిటర్ చెయ్యమని డీటైల్స్ చెప్పాడు. తర్వాత మొబైల్ లో గూగుల్ మ్యాప్స్ తీసి రకరకాల రూట్లు చెక్ చేసాడు. వాళ్ళు ఎటైనా వెళ్ళే అవకాశం ఉంది. విజయవాడ, శ్రీశైలం, మధ్యలో చిన్న చిన్న రూట్లు. వెంటనే ఆ ప్లేసుల్లో తన వాట్సాప్, ఫేస్ బుక్ గ్రూప్ లని యాక్టివేట్ చేసాడు. అందరికీ నిత్య ఫొటో పంపి ఎక్కడ కనపడినా వెంటనే ఫొటో తీసి పంపమన్నాడు. ఇదంతా బైటికి తెలియకూడదని వార్నింగ్ కూడా ఇచ్చాడు.

మెసేజ్ లు అందుకున్న వెంటనే పార్టీ మెంబర్స్ కొందరు హైవేల మీద తిరగడం మొదలుపెట్టారు. కొంతమంది టోల్ బూత్ ల దగ్గర నించొని గమనిస్తున్నారు. శ్రీశైలం కార్యకర్తలు ఇంకొంచెం ముందుకెళ్ళి రోడ్ బ్లాక్ చేసి మరీ కారులో వచ్చే వాళ్ళని చెక్ చేయడం ప్రారంభించారు. *"ఎందుకిదంతా?"* అనడిగే ధైర్యం, అవసరం రెండూ లేవెవెరికీ.

ఇంట్లో అటూ ఇటూ తిరుగుతున్నాడు బాబ్జీ. *బావకి చెప్పాలా వద్దా?* అనే తర్జనభర్జనలో ఉన్నాడు. *ఇంత చిన్న విషయం హ్యాండిల్ చెయ్యలేవా అని తిడతాడు. మొదటికే మోసం వస్తుంది.*

## 15

కారు నడుపుతూ ఆలోచిస్తున్నాడు దేవరాజ్. నిత్య వైఖరి అంతా విచిత్రంగా ఉంది తనకి. పొద్దున దేవుడికి మొక్కుకోవడం, కారులో దేవుడి పాటలు వినడం, అన్నిటికన్నా ముఖ్యంగా తన ఫ్యాన్ నని చెప్పడం. *అసలీ అమ్మాయేనా 'మనుషులు చేసిన దేవుళ్ళు' షో చేస్తోంది? తనని బ్లాక్ మెయిల్ చేస్తోంది?* నమ్మబుద్ధి కావట్లేదు.

"నేనూ నీ షో చూస్తూ ఉంటాను. చాలా బాగా లాజికల్ గా ఉంటాయి నీ ఆర్గ్యుమెంట్స్, ఓ రకంగా నేనే నీ ఫ్యాన్ ని" అన్నాడు ఆమె వైపు పరిశీలనగా చూస్తూ.

నిత్య ఆశ్చర్యంగా చూసింది "నువ్వు నా షో చూస్తావా? అది గాడ్ కి వ్యతిరేకంగా ఉంటుంది కదా? నీ లాంటి భక్తులకి కోపం రావాలే..?"

"అందరూ ఒకేలా ఉండాలని లేదు. అన్నిటినుంచీ మంచిని తీస్కోవాలి, నేర్చుకోవాలనేదే నా సిద్ధాంతం"

"గ్రేట్! నీలా మిగతా వాళ్ళూ ఆలోచిస్తే నాకీ ట్రోల్స్ గొడవ తగ్గుతుంది" అంది నిస్సహాయంగా నవ్వుతూ.

"చాలా మంది తిట్టుకుంటూ ఉంటారు కదా నిన్ను?"

"మామూలుగా కాదు.."

"నాకోటి చెప్పు, నీ ప్రోగ్రాంకి ఎలా ప్రిపేర్ అవుతావ్?"

"సబ్జెక్ట్ మీద రీసెర్చ్ చేస్తాను, నాకు తెలిసిన సోర్సెస్ నుంచి చాలా ఇన్ఫర్మేషన్ కలెక్ట్ చేస్తాను..అవన్నీ సీక్రెట్స్ చెప్పకూడదు" అంది తల వంకరగా ఆడిస్తూ.

"వచ్చే వారం ఎపిసోడ్ టైటిల్ చాలా కాంట్రవర్షియల్ గా ఉంది" అన్నాడు హఠాత్తుగా.

అతను తన ప్రోగ్రాం క్లోజ్ గా ఫాలో అవుతున్నాడని అర్థమైంది నిత్యకి.

"హుమ్.."

"అందుకేనా సీక్రెట్ గా నన్ను ఫాలో చేసి బ్లాక్‌మెయిల్ చేయిస్తున్నావ్?" సూటిగా అడిగాడు.

ఒక్కసారిగా ఉలిక్కిపడుతూ చూసింది తను "వాట్? ఏం మాట్లాడుతున్నావ్?"

"అవును, నా లాంటి భక్తులని ట్రాప్ చేసి ఇలా ఇబ్బంది పెట్టి, అటు డబ్బులూ, ఇటు ప్రోగ్రాం టీఆర్పీలూ పెంచుకుంటున్నారు నీ లాంటి వాళ్ళు" అన్నాడు కర్కశంగా.

ఉక్కిరిబిక్కిరైంది నిత్య అది విని. శరాఘాతంలా తగిలింది అతని మాట. అదీ తనకిష్టమైన వ్యక్తినుండి రావడం మరింత బాధిస్తోంది. ఎంత ఆపుకుందామనుకున్నా తన కన్నీళ్ళు ఆగలేదు. ఏడుస్తూ అంది

"దట్ ఈస్ నాట్ ట్రూ, నేను నిన్ను ట్రాక్ చెయ్యడమేంటి? అబ్సర్డ్"

"ప్లీజ్ నిత్యా, నాకంతా అర్థమౌతోంది"

"నీకసలేం అర్థం కాలేదని నా కర్థమైంది" చెంపలు తుడుచుకుంటూ అంది.

"చూడూ, నాకు మీవాళ్ళెవరో ఫొటోలు పంపించి డబ్బులడుగుతున్నారు, వచ్చే ప్రోగ్రాంకోసం అది కూడా నీ ప్లాన్ లో పార్టే అనుకుంటా" అన్నాడు తను.

"నో! నేనసలా ప్రోగ్రామే చెయ్యట్లేదు. ఛానెల్ కి రిసైన్ చేస్తున్నాను!" అంది ముక్కు ఎగబీలుస్తూ.

"వాట్!" దేవరాజ్ తల తిరిగిపోయింది.

## 16

వాళ్ళ కారు ముందున్న ట్రాఫిక్ వల్ల ఆటోమ్యాటిక్ గా స్లో అయ్యింది. గూగుల్ మ్యాప్స్ చెక్ చేసాడు దేవరాజ్. ఓ పావుకిలోమీటర్ వరకూ రోడ్డంతా బ్లాక్ అయ్యి ఉంది కానీ తర్వాత అంతా క్లియర్ గానే ఉంది. అక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్

గానీ, టోల్ బూత్ కానీ ఉన్నట్టు గుర్తు లేదు తనకి. కారు దిగి కొంత దూరం నడిచి చూసాడు. దూరంగా కొంతమంది వ్యక్తులు బైట నుంచొని మొబైల్ లో చూసి కార్లనీ, బైక్ లనీ ముందుకి పంపిస్తున్నారు. *ఇది మామూలు చెక్‌పోస్ట్ కాదు.* వాళ్ళని వెతకడానికే జరుగుతున్నట్టు అనమానమొచ్చిందతనికి. ఒక్కక్షణంలో వెనక్కి పరిగెత్తి కారు వెనక్కి తిప్పాడు. తన అంచనా కరెక్టైతే వెనక నుంచి కూడా ఎవరో వస్తూ ఉండి ఉండచ్చు. ఎక్కువదూరం వెనక్కీ వెళ్ళలేదు. ఎక్కువ ఆలోచించకుండా కొంతదూరం వెనక్కి వెళ్ళి ఓ చిన్న గల్లీలోకి తిప్పాడు. అతన్ని చూసి నిత్యకి కంగారు పెరిగిపోతోంది.

"ఏమైంది? ఎటెళ్తున్నాం?"

"మన గురించి అక్కడ ట్రాఫిక్ ఆపేసి మరీ వెతుకుతున్నారు. అందుకే.."

"మనగురించే అనెలా చెప్తున్నావ్?"

"ఖచ్చితంగా తెలీదు..ఎందుకో దీని వెనక పెద్ద హస్తం ఉన్నట్టుంది, లేకపోతే ఇంత తొందరగా అంతమందినెలా తేగలరు?"

"హుమ్..."

"ఇంకోసారి ఆలోచించు నీకు ఎవరిమీదన్నా అనుమానం ఉందేమో"

నిత్య గత సంవత్సరంలో ఎంతో మంది ఛోటా, బడా రాజకీయ నాయకులనీ, స్వాములనీ ఇంటర్వ్యూ చేసింది. వాళ్ళల్లో చాలామందిని ఇబ్బంది పెట్టింది తన సూటి ప్రశ్నలతో. వాళ్ళల్లో ఎవరని చెప్పగలదు? ఇలాంటిదేదో రిస్కు ఊహించింది కానీ ఇంత స్పీడుగా జరుగుతుందని అనుకోలేదు తను.

"ఎవరో ఒకరు అని స్పష్టంగా చెప్పలేను. బహుశా ఎవరో రాజకీయ నాయకుడే అయ్యిండాలి. లేకపోతే ఇంతమందిని ఎలా పంపగలడు?"

దాదాపు అరగంట లోపలికెళ్ళాక వాళ్ళ కారు స్లో డౌన్ అయ్యింది.

"ఓ నో!, పెట్రోల్ అయిపోతున్నట్టుంది" అన్నాడు బాధగా.

అటువైపు ఎక్కువ వెహికిల్స్ కూడా వస్తున్నట్టు కనపడలేదు ఇద్దరికీ. కారు రోడ్డు మధ్యలో ఆగిపోకుండా తనే పక్కనున్న చెట్ల మధ్యకి పోనిచ్చి కనపడకుండా కవర్ చేసాడు. ఇద్దరూ దిగి మళ్ళీ రోడ్డుమీదకొచ్చి నడవటం మొదలుపెట్టారు. కొంతసేపటికి దూరంగా ఓ బిల్డింగ్ కనపడటంతో ఆశతో అటువైపు కదిలారు.

అదృష్టవశాత్తూ అదొక జంగిల్ కాటేజ్. నల్లమల అడవులని ఆనుకుని అక్కడ అందాలని చూడాలనొచ్చే పర్యాటకుల కోసం కట్టినట్టుంది.

లోపల కౌంటర్ దగ్గరే నిలబడి ఉన్నాడొకతను. వీళ్ళని పట్టించుకోకుండా టిక్ టాక్ వీడియోలు చూసి తెగనవ్వుకుంటున్నాడు. దేవరాజ్ డెస్క్ మీద కొట్టి "హెలో" అన్నాడు.

అతను ఉలిక్కిపడి ఫోన్ దాదాపు పడేసుకుంటూ "హెలో..హెలో..వెల్ కం" అన్నాడు. బట్ట తల, వేళ్ళంతా ఉంగరాలతో ఓ నలభైఏళ్ళ వ్యక్తిలా కనపడ్డాడతను దేవరాజ్ కి.

"రూమ్స్ ఎమన్నా దొరుకుతాయేమోననీ.." నసిగాడు దేవరాజ్.

అతను వాళ్ళిద్దరినీ అనుమానంగా చూస్తూ "రూమ్సేవీ ఖాళీ లేవు.." అన్నాడు.

దేవరాజ్ ఓ సారి అతని వెనకవైపు చూసాడు. అతను సెలబ్రిటీలతో దిగిన ఫొటోలతో గోడంతా పరిచేసి ఉంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ తో తీస్కున్న ఫొటోలూ, సెల్ఫీలూ..అతనే హోటల్ ఓనర్ అని గుర్తించాడు దేవరాజ్. డెస్క్ మీదున్న అతని నేమ్ బోర్డ్ చూసాడు – 'జల్సా జానీ'

"పవర్ స్టార్ ఫ్యానా అన్నా నువ్వు, నీ పేరు కూడా పెర్ఫెక్ట్ గా సరిపోయింది. మర్చిపొయ్యా, మొన్నే ఓ ఫంక్షన్ లో కలిసా పవనన్నని. గడ్డం అదీ తీసేసి ఫ్రెష్ గా ఉన్నాడు" అన్నాడు మాటలు కలుపుతూ.

జానీ కళ్ళు పెద్దవి చేస్తూ

"ఎప్పుడు బాసూ? ఎక్కడ కలిసావ్? ప్లీజ్, ఒక్కసారి దగ్గరగా కలిసి మాట్లాడాలనుంది జీవితంలో.." అన్నాడు.

"ఓ ఆడియో ఫంక్షన్ లో.. అదేంటి నువ్వు కలవలేదా..మరి అన్నతో దిగిన ఈ ఫొటోలన్నీ.." అనుమానంగా అడిగాడు దేవరాజ్ గోడవైపు చూస్తూ.

"గ్రాఫిక్స్ బాసూ" అన్నాడు దగ్గరగా వంగుతూ.

ఇద్దరూ నవ్వారు.

"మళ్ళీ ఛాన్సొస్తే చెప్తాగానీ...ఓ టూ డేస్ కి రూమ్స్ దొరికితే కొంచెం అడ్జస్ట్ చెయ్యి బాసూ" అన్నాడు దేవరాజ్ రిక్వెస్టింగ్ గా.

జానీ అతని వైపూ, నిత్య వైపూ మార్చి మార్చి చూసాడు. దేవరాజ్ ఒళ్ళంతా దుమ్ము, నిత్య నుదుటిమీద పెద్ద బొట్టు. పదే పదే భయంతో బైటికి చూస్తునన్ తన కళ్ళు. తనో అభిప్రాయానికొచ్చాడు.

"ఇది ఫ్యామిలీ కాటేజెస్ బాసూ..మీరు.."

"వైఫ్ అండ్ హస్బెండ్" అంది నిత్య ముందుకు దూసుకొచ్చి.

అతనామె మెడవైపు చూసాడు. బోసిగా ఉంది.

"ఎక్కడినుంచి వస్తున్నారు?" అన్నాడు.

"హైదరాబాద్.." "విజయవాడ.." ఇద్దరూ ఒకేసారి సమాధాన మిచ్చారు. జానీ రిజిస్టర్ లో రాస్కోబోతూ తలెత్తి చూసాడు ఇద్దరివైపు.

"పేర్లు?"

"నా పేరు వినీత తను వరదరాజ్"

"ఏ వెహికిల్ లో వచ్చారు?"

"లేదు.."

"ఏంటీ?"

"వెహికిలేమీ లేదండీ మాకు" నొక్కిచెప్పింది నిత్య.

దేవరాజ్ కిదంతా వర్కౌట్ అవుతుందని అనిపించట్లేదు.

జానీ రాయడం ఆపేసి రిజిస్టర్ మూసేశాడు విసురుగా.

"ఇందాకణ్ణించి చూస్తన్నా, మీకు నేనో పిచ్చోడిలా కనిపిస్తన్నానా? ఉన్నదున్నట్టు చెప్పచ్చుకదా? ఎందుకన్ని అబద్ధాలు?"

ఇద్దరూ ఒకళ్ళమొఖాలొకళ్ళు చూసుకున్నారు. టెన్షన్ పెరిగిపోతోంది. దేవారాజే అనబోయాడు "బాసూ..అదీ..ఈ అమ్మాయి.."

"నీ లవర్!..ఇద్దరూ పెళ్ళి చేసుకోబోయారు..నువ్వు గుడిలో తనకి బొట్టు పెడుతున్న టైంలో సరిగ్గా అమ్మాయి తరఫు రౌడీలొచ్చి నిన్ను చితకబాదారు..అక్కడినుంచి పారిపోయి ఇలా నా షెల్టర్ లోకొచ్చారు" కేసు సాల్వ్ చేసాక పోలీసులు చెప్పినట్టు గుక్కతిప్పకుండా చెప్పాడు.

"బాసూ..బాసూ..జస్ట్ ఇద్దరి మొహాలు చూసి క్షణంలో వాళ్ళ హిస్టరీ చెప్పావంటే నువ్వు మామూలోడివి కాదు" అన్నాడు దేవరాజ్.

"అన్నయ్యా నువ్వే కాపాడాలి మమ్మల్ని, మా వాళ్ళు చూస్తే నరికేస్తారు.." అంది నిత్య కళ్ళల్లో భయం నింపుకుంటూ.

"ఛ, ఈ పరువు హత్యలు చెయ్యటం ప్రతోడికీ పెద్ద ఫ్యాషనైపోయింది. నువ్వేం భయపడకమ్మా, మీ పెళ్ళి నేను జరిపిస్తా..కావాలంటే ఓసారి అటుచూడండి" అంటూ వాళ్ళ వెనక గోడవైపు చూపించాడు. ఓ పది ఫ్రేములలో దండలు మార్చుకుంటున్న రకరకాల జంటల ఫోటోలు.

**"పెళ్ళా?!"** అంది నిత్య నోరు తెరుస్తూ.

"బాసూ..అవన్నీ తర్వాత మాట్లాడచ్చు..ముందు రెండు రూమ్స్ ఉంటే చూడవా మాకు" అన్నాడు దేవరాజ్ హడావిడిగా.

"ఛ..మీరు విడిగా ఉండకూడదు బాసూ..మీ లాంటోళ్ళకి నా దగ్గరో స్పెషల్ రూం ఉంది" అన్నాడు కన్నుకొడుతూ జానీ.

చేసేదేమీ లేక కీస్ తీస్కొని లోపలికి కదిలారిద్దరూ.

## 17

రాత్రి పదకొండు దాటుతున్నా ఏమీ ఇన్ఫర్మేషన్ రాకపోవడంతో బాబ్జీకి చిరాకు పెరిగిపోతోంది. సూరికి కాల్‌చేసి అర్జెంట్ గా నిత్య ఇంటి కెళ్ళమన్నాడు. తను మళ్ళీ వచ్చినట్టు కనపడినా, ఎవరైనా అనుమానాస్పదంగా అక్కడ తిరుగుతున్నా వెంటనే ఫోన్ చెయ్యమన్నాడు. అలానే తను పంపిన చెకింగ్ స్క్వాడ్ లన్నీ ఫెయిల్ అవ్వడంతో తనే రంగంలోకి దిగాలని నిశ్చయించుకున్నాడు.

ముందు ట్రాఫిక్ కంట్రోల్ రూంకెళ్ళి వాళ్ళెల్లే అవకాశం ఉన్న రూట్లల్లో సీసీ కెమెరా ఫుటేజ్ చెక్ చేయడం మొదలుపెట్టాడు. సూరి గుడిదగ్గరికెళ్ళిన టైముని బట్టీ చుట్టుపక్కలున్న ట్రాఫిక్ సిగ్నల్సన్నీ ఓపిగ్గా చూసాడు. అలా చాలా సేపు చెక్ చేసాక, ఔటర్ రింగ్ రోడ్డునుండి సెర్వీస్ రోడ్డులోకి వెళ్తున్న ఒక రెడ్ హోండాసిటీ కనపడింది. గూగుల్ మ్యాప్స్ చెక్ చేస్తే సరాసరి శ్రీశైలం వెళ్ళే దారని అర్థమైంది. కానీ తర్వాత సిగ్నల్స్ దగ్గర మళ్ళీ ఆ కారు కనపడలేదు. అక్కడ పార్టీ మెంబర్స్ కూడా ఆ కారు తమ చెకింగ్ లో రాలేదని చెప్పారు. *అంటే వేరే రూట్ తీస్కున్నారా? మధ్యలో ఎక్కడైనా ఆగారా?* హోటెల్స్‌మైనా ఉన్నాయేమోనని సెర్చ్ చేసాడు. నాలుగు చిన్న హోటెల్స్, ఓ కాటేజ్ కనపడ్డాయి.

వెంటనే ఆ చుట్టుపక్కల ఉన్న తన గ్యాంగ్ మెంబర్స్ కి ఇంఫార్మ్ చెయ్యబోయి ఓ క్షణం ఆగి హడావిడిగా కింద పార్కింగ్ లాట్ వైపు కదిలాడు. స్టీరింగ్ సీట్లో నిద్రపోతున్న డ్రైవర్ భుజం తట్టి లేపాడు

"శ్రీశైలం రోడ్డు వైపు కొట్టాలి.."

వాడి నిద్రంతా దిగిపోయింది. వాచ్ వైపు చూసాడు. అర్ధరాత్రి రెండవుతోంది.

## 18

రూంలోకెళ్ళాక "ఏదో ఈ టింగరోడి పిచ్చితో రూం సంపాదించాం గానీ ఇక్కడెక్కువ సేపు ఉండలేం" అన్నాడు దేవరాజ్ ఫోన్ చూస్తూ .

నిత్యకేం తోచట్లేదు. పొద్దున బానే ఉన్న తన ప్రపంచం సాయంత్రానికి తలకిందులైనట్టుంది. ఫోన్ కూడా పోవడంతో ఎవరినీ కాంటాక్ట్ చేయలేకపోతోంది.

"ఏమన్నా గుర్తొచ్చిందా ఎవరు నిన్ను టార్గెట్ చేస్తున్నారో?" అడిగాడు మళ్ళీ

తల అడ్డంగా ఊపింది కానీ ఇంతలో ఏదో గుర్తొచ్చింది.

"దేవరాజ్..!"

"ప్లీజ్, కాల్ మీ రాజ్.."

"నాకోటి గుర్తొస్తోంది. నిన్న జాగింగ్ చేస్తున్నప్పుడు మా కాలనీ ఛైర్మన్ నా వెనకాలెవరో ఫాలో చేస్తున్నారని చెప్పారు.అంటే.."

"అంటే నీ గురించి వీళ్ళు కొన్ని రోజులుగా వెతుకుతున్నారన్న మాట. నీ రీసెంట్ షోలల్లో పార్టిసిపేట్ చేసిన వాళ్ళెవరన్నా అయ్యిండచ్చు. నువ్వో పనిచెయ్యవా? నీ షోలకి యూట్యూబ్ లో, ఫేస్ బుక్ లో వచ్చిన నెగటివ్ కామెంట్స్ ఓ సారి చెక్ చేసి, వాళ్ళల్లో ఎవరైనా అనుమానంగా అనిపిస్తే చెప్తావా?" అన్నాడు ఫోన్ ఇవ్వబోతూ.

కానీ మధ్యలో ఓ క్షణం ఆగి సీనాకి కాల్ చేసి హడావిడిగా ఓ పని చెప్పాడు.

తర్వాత నిత్య ఫోన్‌లో వెతకటం మొదలెట్టింది. అలా ఓ గంట వెతికాక అలిసిపోయి వెనక్కి వాలిపోయింది బెడ్ మీద.

"రాజ్, నాకోసం ఓ పాట పాడవా?" రిక్వెస్టింగ్ గా అంది.

"ఇప్పుడా..ఇంత టెన్షన్ లోనా" అన్నాడు ఆశ్చర్యంగా.

"ప్లీజ్, నీ ఏ పాటైనా సరే? నాకన్నీ ఇష్టమే" అంది. తన బుగ్గలు ఎర్రగా మారాయి.

"పాడతాను కానీ నాకో డౌట్ పొద్దుటినుంచీ తొలిచేస్తోంది, అడగనా?"

కళ్ళార్పింది తను.

"నువ్వు జనాల్ని మోసం చేస్తున్నావా? నిన్ను నువ్వు మోసం చేస్కుంటున్నావా?" అన్నాడు ఆమె పక్కన నిల్చొని. చటుక్కున లేచికూర్చుంది తను. రెండు నిమిషాలు మౌనం తర్వాత "నీ దగ్గరేం దాచలేదు రాజ్ నేను. నాకెందుకో నాలా ఉండాలనిపించింది" అంది అతని చేతులని తన చేతుల్లోకి తీసుకుంటూ.

ఆమె కళ్ళల్లోకి చూసాడు తను. ఇంక పొడిగించలేకపోయాడా సంభాషణ. తన ప్రశ్న తననే వెక్కిరుస్తున్నట్టుంది.

మెల్లగా ఎదుటి సోఫాలో సెటిలయ్యి తనే నిత్య కామెంట్స్ వెతకడం మొదలెట్టాడు. సరిగ్గా ఎవరన్నది తెలియలేదు కానీ 'మీ నిజం' ఛానెల్ రూలింగ్ పార్టీకి అగైనెస్ట్ గా న్యూస్ స్ప్రెడ్ చేస్తోందనీ, అందులో నిత్య ప్రోగ్రాం చాలా కీలకమనీ అర్ధమైంది. *ఇంకొన్ని నెలల్లో ఎలెక్షన్స్ కాబట్టి అధికారపార్టీ వాళ్ళే నిత్యని తప్పించాలని చూస్తున్నారా? అన్న ఆలోచనతో* ఒక్కసారిగా వాళ్ళిద్దరూ ఎంత ప్రమాదంలో ఇరుక్కున్నారో అర్ధమయ్యి చెమటలు పట్టాయి తనకి. *బహుశా సీనా ఏదన్నా క్లూ సంపాదిస్తాడేమో.*

## 19

తర్వాతి పొద్దున ఆరైంది. భయంభయంగా నిత్య ఇంటి చివర ఉన్న సందునుండి తొంగి చూస్తున్నాడు సీనా. ఆమె అపార్ట్మెంట్స్ ముందో జీపు ఆగి ఉంది. అందులో ఉన్న జనాలు అటూ ఇటూ రోడ్డుమీద తిరుగుతున్నారు. ఏమన్నా క్లూ సంపాదించాలంటే వాళ్ళకి దగ్గరగా వెళ్ళాలి, వాళ్ళ మాటలు వినాలి. *"బా అన్నీ ఇలాంటి పనులే చెప్తాడు నాకు. వీళ్ళ చేతికి దొరికితే నా పని అయిపోయినట్లే"* అనుకున్నాడు. వెనక్కి తిరిగి వేరే సందులో నుండి అపార్ట్మెంట్ కి దగ్గరగా ఉన్న ఓ షాప్ వెనక్కి వచ్చాడు. ఇరవై అడుగుల దూరంలో కనిపిస్తోందా జీపు ఇప్పుడు. ఆ బ్యాచ్ లో ఇద్దరు షాప్ దగ్గర నించొని సిగరెట్ కాలుస్తున్నారు. అందులో ఒకడు,

"పొద్దుటినుంచి తిరుగుతున్నాం బయ్యా, ఈ నిత్య యాడికెళ్ళిందో గానీ మన చావుకొచ్చింది" అన్నాడు.

"ష్, మెల్లగా రా బాబూ" అన్నాడు ఇంకొకతను.

"అవును బయ్యా, మన సూరన్నని ఆడెవడో చితక్కొడాడంటగా? డ్రైవర్ మనోడేలే..ఆడే జెప్పాడు" అన్నాడు మళ్ళీ.

"అందుకే సూరన్నకి సోమీ బాబ్జన్న ఫుల్లు క్లాస్ పీకాడు. నేనా బండిలోనే ఉండా" అన్నాడు. వాళ్ళల్లో ఎవరికెక్కువ రహస్యాలు తెలిస్తే వాడే గొప్ప.

సీనా జాగర్తగా వింటున్నాడు. మెల్లగా అర్థమౌతోంది అంతా. అలానే కొంచెం వెనక్కి జరిగి, దేవరాజ్ కి కాల్ చేయబోయాడు. అంతలోనే తన భుజంమీద ఎవరిదో చెయ్యి పడితే వెనక్కి తిరిగాడు. సూరి! రాత్రంతా నిద్రలేక అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి.. సీనా గుండె జారిపోయింది. అటూ ఇటూ చూస్తూ తడబడుతూ అన్నాడు "అన్నా, అదీ.." మాట పెగలట్లేదు. హఠాత్తుగా చెంపదెబ్బ! కళ్ళు బైర్లు కమ్మాయి. ఫోన్ ఎగిరి దూరంగా పడింది.

"నా కొడకా..నాటకాలాడుతున్నార్రా మీరు? మమ్మల్ని ఊరంతా కుక్కల్ని తిప్పినట్టు తిప్పారు కదరా?" అన్నాడు ఇంకో దెబ్బేస్తూ. సీనా షాక్ నించి తేరుకునే లోపే సూరి తనని హడావిడిగా జీపులోకి నెట్టి సర్రున ఆ సందులోంచి బైటకొచ్చాడు. ఇంకో గ్యాంగ్ మెంబర్ సీనా నోట్లో గుడ్డలు కుక్కి చేతులూ, కాళ్ళూ కట్టేసాడు. హఠాత్తుగా జరిగిన ఆ

పరిణామానికి సూరి కళ్ళల్లో నీళ్ళ సుడులు తిరుగుతున్నాయి. బాబ్జీకి కాల్ చేసాడు సూరి "అన్నా..వాడి ఫ్రెండ్ దొరికాడు. నీదగ్గరికే తెస్తన్నా" అన్నాడు ఆనందంగా.

"ఇన్నాల్టికి ఒక్క పనికొచ్చే పన్చేసావు సూరీ.." అన్నాడు తాపీగా సోమీ బాబ్జీ.

"వీణ్ణి తంతే అంతా తెలుస్తుందన్నా..అరగంటలో వచ్చేస్తాం" అన్నాడు నీరసంగా.

"అరగంట కాదు.మూడు గంటలు పట్టుద్ది నీకు రావాలంటే"

"అదేంటన్నా..ట్రాఫిక్ జాముందా మధ్యలో.."

"లేదు..నేనే ఊళ్ళో లేను, శ్రీశైలం వెళ్తున్నా..

"!?"

"నువ్వో పన్చెయ్, ఆడ్ని ఇక్కడికి తీస్కురా..కొండ కింద మన గెస్ట్ హౌస్ ఉంది కదా, అక్కడుంచు. తర్వాతొచ్చి వాడి సంగతి చూస్తా" అన్నాడు.

## 20

పొద్దున్నే ఏవరో పూజ చేస్తున్నట్టనిపిస్తే విసుగ్గా సోఫా మీంచి కళ్ళు తెరిచి చూసాడు దేవరాజ్. నిత్య దూరంగా టేబుల్ మీద దేవుడి పటం ముందు నిలబడి పెద్దగా స్తోత్రాలు చదువుతోంది. అతను లేవడం చూసి "నువ్వూ దణ్ణం పెట్టుకో, ఇవాళైనా ఈ ఆపదనుండి గట్టెక్కుతామేమో" అంది నవ్వుతూ.

"ఏంటి నిత్యా పొద్దున్నే ఇదంతా, నాకసలు నచ్చవు" అన్నాడు. తను ఖంగు తింది.

"నిన్నటినుండీ చూస్తున్నా నువ్వు గుడి దగ్గరా దర్శనానికి రాలేదు, ప్రసాదం ఇచ్చినా తీస్కో లేదు. అదీ కాక నా ప్రోగ్రాం కి ఫ్యాన్ అంటున్నావు.. నాకర్థంకావట్లేదు" అంది.

"అవును, ఆ ప్రోగ్రాంలో చూసిన నిత్యకే ఫ్యాన్ ని"

"ఏంటీ? మళ్ళీ చెప్పు?" మొహం అంతా కన్ఫ్యూజన్ తో కూడిన సిగ్గుతో నిండిపోయింది.

అనవసరంగా స్లిప్ అయ్యానేమోనని సైలెంట్ అయ్యాడు దేవరాజ్.

"ఇంతకీ నీకు నా ప్రోగ్రాం ఇష్టమా? నేనా?" అంది చిలిపిగా.

"అది చేసే నువ్వు"

"అది చెయ్యని నేను మరి?"

"నిత్యా!"

"సరే నువ్వు లాస్ట్ టైమ్ ఎవరి బలవంతం లేకుండా దేవుడిని ఎప్పుడు తలచుకున్నావ్?"

"పదిహేనేళ్ళ కిందట!"

"వాట్! మరి ఆ తర్వాత"

"తెలివొచ్చింది"

"నువ్వింత బాగా భక్తి పాటలు పాడుతున్నావంటే చిన్నప్పటి నుండే నీకు సంగీతం బాగా తెలిసుండాలి, దైవభక్తి కూడా ఉండుండాలి, కానీ మధ్యలో ఏదో అయ్యింది..అవునా.."

"నీ జర్నలిస్ట్ బుర్రంతా నామీద కాకుండా నిన్ను కిడ్నాప్ చేసిన వాళ్ళమీద పెడితే బెటర్ నువ్వు" అన్నాడు చిరాగ్గా.

"రాజ్! ప్లీజ్, నాకోటి చెప్పు. ఓ పెద్ద ఆడిటోరియం లో పెర్ఫార్మ్ చేసేముందు నీకు నెర్వస్ గా ఉండదా?"

"ఎందుకుండదు? స్టేజ్ మీదకెళ్ళే ముందు తప్పకుండా మా అమ్మని తలుచుకుంటాను"

అతని తల్లి కేదో విషాదం జరిగిందని తెలుస్తోంది నిత్యకి.

"ఇంకా ధైర్యం చాలకపోతే?"

"నా అంతరాత్మకి నేనే గట్టిగా చెప్పుకుంటాను అంతా బాగా జరగాలని..అంతే కానీ నీలా దేవుడ్ని వేడుకోను దీనంగా"

"కానీ నువ్వు దేవుడ్ని తలుచుకుంటున్నావ్ కదా?"

"ఏంటీ?"

"ఎస్, నీకు నువ్వే చెప్పుకుంటానన్నావు, అంటే నీలో ఉన్న దేవుడికి నువ్వే చెప్పుకుంటున్నట్టు"

"హా, దిస్ ఈస్ క్రేజీ"

"లేదు! నీ మనసులో అనిశ్చితిగా ఉన్న భాగం, నీలోనే స్థిరంగా ఉన్న భాగంతో మొరపెట్టుకుంటోంది..దాన్నే నేను భగవంతుడంటాను"

అతనేదో అర్థంకానట్టు చూసాడు.

"చాలా మంది దేవుణ్ణి గుళ్ళల్లోనూ, విగ్రహాల్లోనూ చూస్తారు. అఫ్ కోర్స్ నేనూ అంతే అనుకో. కానీ రూపంలేని అంతరాత్మని స్పష్టంగా చూడాలని మనం సృష్టించుకున్న రూపాలే అవి అని తెలుసుకోలేకపోతున్నాం"

దేవరాజ్ నేలవైపు చూస్తూ వింటున్నాడు. తననుకున్నంత అమాయకురాలు కాదు నిత్య.

"ఈ కాన్సెప్ట్ చెప్పి మనుషులు తమని తాము బలంగా నమ్మేలా చేద్దామనే 'మనుషులు చేసిన దేవుళ్ళు ' మొదలు పెట్టాం. కానీ కొన్ని ఒత్తిళ్ళకి లొంగి ఈ మధ్య అది పక్కదారి పట్టింది. కేవలం దేవుడి పేరుమీద తిట్టుకునే ఎంటర్టైన్మెంట్ ప్రోగ్రాంలా మారింది" అంది నిట్టూరుస్తూ.

దేవరాజ్ దీర్ఘంగా ఊపిరి తీసుకుంటూ గది బైటికి నడిచాడు. తన నమ్మకాలే తనల్ని వెక్కిరిస్తున్నట్టనిపించాయి.

## 21

తననుకున్న హోటల్సన్నీ గాలించినా వాళ్ళిద్దరూ దొరక్క పోవడంతో చాలా అసహనంగా ఉన్నాడు సోమీ. *ఇంకొక్క కాటేజ్, లాస్ట్ ఛాన్స్.* గూగుల్ మ్యాప్స్ చూపించిన చిన్న రోడ్డులో కొంత దూరంరాగానే లీలగా చెట్లల్లో ఏదో కనపడితే, అనుమానంతో లోపలికి వెళ్ళి చూసాడు. అనుకున్నట్లే ఎర్ర హోండాసిటీ! మరోక్షణం ఆలస్యం చెయ్యకుండా వేగంగా ఆ కాటేజ్ కి వచ్చి రివ్వున పరిగెత్తుకెళ్ళి ఫ్రంట్ డెస్క్ ముందు ఆగాడు. అతని హడావిడి చూసి డ్రైవర్ కూడా తనతో పాటే పరిగెత్తాడు లోపలికి.

తన ఫోన్ లో ఉన్న నిత్య ఫొటో చూపిస్తూ "ఈ అమ్మాయి ఇక్కడికొచ్చిందా?" అన్నాడు సోమీ సీరియస్ గా.

"ఎవరీ అమ్మాయి? ఏం చేసింది?" నిర్లక్ష్యంగా అడిగాడు జానీ.

"అది నీకనవసరం, ఎవరైనా అబ్బాయితో వచ్చిందా అని?"

"పేరేంటి?"

"నిత్య"

"లేదు. అలాంటి ఊరూ, పేరూ ఉన్నమ్మాయెవరూ లేరిక్కడ"

ఫాట్! చెంప ఛెళ్ళుమంది. జానీ తల తిరిగిపోయింది. *వీళ్ళు పెద్ద రౌడీల్లా ఉన్నారు. ఈ అబ్బాయిలందరూ పోయి పోయి ఇలాంటి బ్యాగ్రౌండ్ ఉన్న అమ్మాయిల్నే లవ్ చేసి ఛస్తారెందుకో?* అనుకుంటూ చెంపమీద చెయ్యి పెట్టుకుని "సార్, మీరూ మా బాస్ లాగా పవర్ ఫుల్ అని తెలుస్తోంది. ఈ అమ్మాయి ఎవరితోనైనా.."

"పారిపోయింది..అవును" అన్నాడు సోమీ.

దూరంగా పేపర్ చదువుతున్న దేవరాజ్ ఇదంతా చూస్తూ వాళ్ళు గమనించకుండా లోపలికెళ్ళబోయాడు.

"అయినా ఒక వేళ వాడు ఈ అమ్మాయిని లేపుకు పోవాలనుకుంటే ఇలాంటి హోటళ్ళలో కూర్చుని తీరిగ్గా పేపరు చదువుకోడు కద సార్, ఎప్పుడో స్టేట్ దాటేసుంటాడు, నువ్వేమంటావ్ బాబూ?" అంటూ లోపలికెళ్తున్న దేవరాజ్ ని చూస్తూ అడిగాడు.

దేవరాజ్ కి ఒళ్ళుమండింది. జానీ పీకపిసకాలన్నంత కోపమొచ్చింది.

నెర్వస్ గా సోమీ వైపుచూసి వడివడిగా ముందుకు వెళ్ళిపోయాడు.

సోమీకిదంతా నమ్మబుద్ధి కాలేదు. *దారిలో వాళ్ళ కారు స్పష్టంగా కనపడింది. ఇక్కడే ఎక్కడో ఉండాలి.* చటుక్కున ఓ ఐడియా వచ్చి "నిన్న ఈ కాటేజ్ లో రూంతీస్కున్న వాళ్ళ పేర్లు తియ్..తొందరగా.." అన్నాడు జానీని గదమాయిస్తూ. "మాకూ కొన్ని రూల్సుంటాయి సార్.." అంటున్నలోపే పక్కనున్న కారు డ్రైవర్ మెల్లగా కత్తి తీసాడు. మెరుస్తోందది. ఇంక చేసేదేమీలేక బుకింగ్ రిజిస్టర్ వాళ్ళ ముందు పెట్టాడు. *నలుగురు దిగారు నిన్న. ఇద్దరు ఫ్యామిలీస్, ఒకడు సింగిల్. ఒకేఒక్క జంట! దొరికారు* అనుకుంటూ, "వీళ్ళ రూ ఎటు?" అని ఉరిమాడు స్వామిని.

నెర్వస్ గా చేత్తో దారి చూపించాడు తను.

రూంకి హడావిడిగా వెళ్ళిన దేవరాజ్ ఒక్కక్షణం ఆలస్యం చేయకుండా నిత్యని లాక్కొని బైటికొచ్చాడు. నిత్యకి అర్థమయ్యి మారు మాట్లాడకుండా తనతో బయల్దేరింది. ఫ్రంట్ డెస్క్ వైపుకాకుండా, వెనక్కి తిరిగి పరుగెత్తి ఓ ఎక్సిట్ డోర్ దగ్గరికొచ్చారు. దాన్ని తీసే ప్రయత్నంలో ఉండగానే, వెనకే ఆ కారిడార్ లో ఎవరో హడావిడిగా రావడం వినబడుతోంది. ఇద్దరి ముఖాల్లో రంగులు మారుతున్నాయి. తలుపు గట్టిగా కాలుతో తోసాడు దేవరాజ్. అది కదల్లేదు. భుజంతో నెట్టాడు. వెనక శబ్దాలు దగ్గరికొస్తున్నాయి "అన్నా రూంలో లేరంటే పారిపోయింటారా?" అందో గొంతు. దేవరాజ్ కి చెమటలు పట్టాయి. తన బలమంతా ఉపయోగించి తలుపుని బలంగా తన్నాడు. భళ్ళున తెరుచుకుందది. నిత్యని గట్టిగా చేత్తో పట్టుకుని పార్కింగ్ లాట్ లో కొస్తున్నప్పుడు వినపడింది వెనకనుంచి అరుపు "రేయ్, ఆళ్ళు ఎస్కేప్ అవుతున్నారు పట్టుకో, పరుగెత్తు!"

దేవరాజ్ వెనక్కి తిరిగి చూసాడు, ఇరవై మీటర్ల దూరంలో డ్రైవర్ తరుముకుంటూ వస్తున్నాడు. నిత్య గొంతు తడారిపోయింది. కాటేజ్ ముందునన్ రోడ్డు మీదకి రాగానే హఠాత్తుగా వాళ్ళిద్దరికీ ఓ కారు కనపడింది. ఇంకా రన్నింగ్ లోనే ఉందది, ఇందాక హడావిడిలో సోమీ డ్రైవర్ చేసిన తప్పు. ఇంకేమీ ఆలోచించకుండా కారులోకి దూకారు దేవరాజ్, నిత్యలు. వెనకాల వస్తున్న అరుపులు పట్టించుకోకుండా గేరు మార్చి కారుని మెయిన్ రోడ్డుమీదకి యాక్సిలరేట్ చేసాడు దేవరాజ్.

సోమీ, అతని డ్రైవరూ కారు వెనక కొంతదూరం పరిగెత్తి, రొప్పుతూ నిశ్చేష్టులై నిలబడిపోయారు.

**వెంటనే సూరికి కాల్** చేద్దామని ట్రై చేసాడు సోమీ. అక్కడ మొబైల్ సిగ్నల్స్ లేవు. పరిగెత్తుకుంటూ మళ్ళీ లోపలికెళ్ళి స్వామి దగ్గరున ల్యాండ్ ఫోన్ లో కాల్ చేసాడు.

"సూరీ, ఎక్కడున్నావ్?"

"అన్నా, అరగంటలో గెస్ట్ హౌస్ దగ్గరుంటాం"

*లాభం లేదు. అప్పటికి చాలా దూరం వెళ్ళిపోతారు.*

"వాళ్ళు నా కారులో తప్పించుకున్నారు"

"ఆ..!" సూరి నోరు తెరిచాడు.

"తర్వాత చెప్తానవన్నీ, చెక్ పోస్ట్ దగ్గర మన కుర్రాళ్ళున్నారు కదా ఇంకా?"

"సరిగ్గా తెలీదన్నా..ఉండచ్చు" అనుమానంగా అన్నాడు.

సోమీకి తిక్కరేగింది.

"ఎవ్వడూ, చెప్పిన పన్చెయ్యడు కానీ రోజూ బిర్యానీలూ, బాటిల్సూ..థూ.."

సూరీ మొహం మాడిపోయింది. "అన్నా, ఇప్పుడేంచేద్దాం?"

"కనీసం లోకల్ గ్రూప్ లో వాట్సాప్ చేసి ఎవడినన్నా అక్కడి కెళ్ళమను, నా కారు కనపడితే ఆపమని చెప్పు"

మెయిన్ రోడ్డు ఉన్న టెంపరరీ చెక్ పోస్ట్ గేటు మూసే ఉంది. పక్కనే ఇద్దరు సోమీ గ్యాంగ్ మెంబర్స్ కూర్చుని ఉన్నారు. అందులో ఒకడు

"ఏరా, ఎప్పుడూ వాట్సాప్ లేకపోతే టిక్ టాక్..వేరే పనేలేదా? సోమీ అన్న కూడా వస్తన్నాడంట ఇదే రూట్ లో, ఇట్టా చేస్తన్నామని అన్న చూస్తే చంపుతాడు.. కాసేపు మొబైల్ పక్కనపెట్టు" అన్నాడు బెదిరిస్తూ.

ఎదుటివాడు అంతా కోల్పోయినట్టు మొహం పెట్టి, బాధగా జేబులోకి తోసాడు మొబైల్ ని.

అంతలో ఎదురుగా లైట్ బ్లింక్ చేస్తూ వస్తున్న తెల్ల ఆడీ కారు కనపడింది వాళ్ళిద్దరికీ. చివర "SB 9999" కనపడటంతో ఆశ్చర్యంతో ఒకళ్ళమొహాలొకళ్ళు చూసుకుని అప్రయత్నంగా గేటెత్తేసారు. కారు దూసుకుని అవతలికెళ్ళి పోయింది. "ఒక్క క్షణం లేట్ అయ్యింటే చచ్చే వాళ్ళంకదరా సోమీ అన్న చేతులో, అందుకే ఆ చెత్త మొబైల్ చూడకురా అన్నా" అన్నాడు ఊపిరి పీల్చుకుంటూ.

అవతలివాడు "చిల్ అన్నా, ఇప్పుడేంది అన్న ఎళ్ళిపొయ్యాడుగా" అంటూ మళ్ళీ వాట్సాప్ చూస్తూ ఓ వెర్రికేక పెట్టాడు తల పట్టుకుంటూ.

"ఏమైందిరా!"

"అయ్యో ఇప్పుడెళ్ళింది సోమీ అన్న కాదంట...సూరన్నకి చెప్పాల అర్జెంట్ గా" అంటూ కాల్ చేసి జరిగిందంతా చెప్పాడు. సూరి నోట్లో తడారిపోయింది. సోమీకెలా *చెప్పాలిప్పుడు? తప్పదు.* ధైర్యం కూడగట్టుకుని ఇందాకటి ల్యాండ్ లైన్ కే మళ్ళీ చేసాడు. చేతులు వణుకుతున్నాయి.

అంతా విని, ఓ క్షణం ఆలోచించి మెల్లగా అన్నాడు సోమీ

"వదిలెయ్, మనం ఇంక వాళ్ళని వెతకట్లేదు"

"అన్నా! మరి.." సోమీ ఎప్పుడెలా రియాక్ట్ అవుతాడో ఐదేళ్ళ నుండీ పనిచేస్తున్నా అర్థంకాలేదు సూరికి.

"వాళ్ళే మన దగ్గరికొస్తారు. నువ్వు రా, మిగతాది చెప్తాను"

22

ఎప్పుడూ ఇన్స్టాగ్రాం, ట్విట్టర్ లలో యాక్టివ్ గా ఉంటూ తమకి సమాధానాలిస్తూ ఉండే నిత్య రెండ్రోజుల నుండీ కొత్త పోస్టులు కాదు కదా, వేటికీ రెస్పాన్స్ లు కూడా పెట్టక పోవడంతో అసహనంతో ఉన్న ఫ్యాన్స్ #నిత్యఎక్కడ? అనే ట్రెండ్ స్టార్ట్ చేసారు. అది గంటగంటకీ అంచెలంచలుగా పెరిగి వైరల్ గా మారిపోయింది. దానికి ట్యాగ్ అయ్యి ఉన్న ట్వీట్లు, కామెంట్లు లక్షల సంఖ్యకి చేరుకున్నాయి. ఒకడు మొత్తానికి నిత్య పీడ విరగడైందంటే, ఇంకోడు ఓ ఆనెస్ట్ యాంకర్ కోల్పోయామంటాడు. ఓ భక్తురాలు, నిత్య పశ్చాత్తాపంతో కుమిలిపోయి పారిపోయిందంటే, ఇంకో ఆశావాది, తన్ను రెట్టింపువేగంతో తిరిగొస్తుందంటాడు. ఇలా జనాలు, బలవంతంగా తమ నమ్మకాలను నిజాలుగా పక్కనోళ్ళమీద రుద్దటానికి ప్రయత్నిస్తుంటే, ఓ పొలిటికల్ అనలిస్ట్ మాత్రం డీటైల్డ్ గా దీంట్లో అధికార, ప్రతిపక్షాల కుట్ర ఎంతుందో, ఇలాంటి సంఘటనలు ఎలెక్షన్స్ ముందు ఎంత ప్రభావకరమో సాక్ష్యాలు చూపిస్తూ పెద్ద వ్యాసమే రాసాడు. అందులో అధికార పార్టీతో రాసుకుపూసుకు తిరిగ్గే పూర్ణానంద స్వామికి కూడా లింకుండచ్చన్న కొత్త వివాదానికి తెరతీసాడు. దాని తర్వాత నెట్ లో గొర్రెలమంద దాన్ని ఫాలో అవ్వడం మొదలు పెట్టింది.

'మీ నిజం' ఆఫీస్ లో నిత్య గురించే ఆలోచిస్తున్న శివరాంకి కాల్ రావడంతో ఉలిక్కిపడి తన మొబైల్ వైపు చూసాడు. సైలెంట్ గా ఉందది. ల్యాండ్ లైన్ వైపు చూసాడు, దాని శబ్దం కూడా కాదది. తన డెస్క్ డ్రాయర్ ఓపెన్ చేసాడు. లోపలున్న సీక్రెట్ ఫోన్ లోంచి వస్తోందది. ఆ నంబరు మరో ముగ్గురి దగ్గరే ఉంది. *అంటే..* అనుకుంటూ భయంభయంగా కాల్ ఎత్తాడు.

“శివరాం! మనం అనుకున్నదేంటి? జరుగుతోందేంటి? వాట్ ఈస్ హ్యాపెనింగ్?”

దామోదర్ నాయుడు! ప్రతిపక్ష నాయకుడు, ఎక్స్ సీ.ఎం. వెల్ ఎడ్యుకేటెడ్ కానీ తనుచేసే దొంగ బిజినెస్ లూ, అడ్డొచ్చినవాళ్ళని తప్పించే పద్ధతులూ అంతా సోఫిస్టికేటెడ్ గా ఉంటాయి. శివరాం మాట్లాడటానికి భయపడే అతికొద్దిమందిలో అతనొకడు.

"సర్, అదీ నేను కూడా ఊహించలేదు, షీ ఈస్ వెరీ స్ట్రాంగ్..కానీ ఇలా పారిపోతుందని.."

"పారిపోయిందా..కిడ్నాప్ అయ్యిందా?"

షాక్ తిన్నాడు శివరాం. ఈ కోణంలో ఆలోచించలేదతను. *ఎవరు చేస్తారు?*

"ఛ..తనకి శత్రువులెవరూ లేరు. కంటిన్యూస్ గా కాల్ చేస్తున్నాను. మెసేజెస్ కూడా పెట్టాను.. కానీ రిప్లై రావట్లేదు. వాళ్ళ ఊరెళ్ళిందేమో కనుక్కుంటాను వెంటనే.." అన్నాడో ప్రయత్నంగా.

"ఇది ఖచ్చితంగా కిడ్నాపే, తనకి శత్రువులు ముందు ఉండక్ఖర్లేదు, కొత్తగా పుట్టుకు రావచ్చు. ట్విట్టర్ లో జరుగుతున్న రచ్చ చూడలేదా?"

"ఏమైంది.." అంటూ తన మొబైల్ లో యాప్ ఓపెన్ చేసి స్కాన్ చేసాడు కళ్ళతో. స్పష్టంగా ఛానెల్ కీ ప్రతిపక్షానికీ లింక్ పెట్టి తనని దుమ్మెత్తిపోస్తున్నారు. *కొన్ని గంటల్లో ఇంత దుమారమా?!*

"వెల్ చూసావుగా? గో టేక్ కాంక్రీట్ యాక్షన్, మా పేరు కానీ మనుషులు కానీ ఇందులో ఇన్వాల్వ్ అవ్వం, మనగురించి ఎక్కడా బైట లీక్ అవ్వకూడదు, తెలుసుగా..?"

కాల్ డెడ్ అయిన శబ్దం.

శివరాంకి గుండెపోటు వచ్చేలా ఉంది. ఎంత కంట్రోల్ చేస్కుందామన్నా టెన్షన్ తగ్గట్లేదు. ఛానెల్ నడవట్లేదని బినామీ రూపంలో దామోదర్ నాయుడు దగ్గరినుంచి డబ్బు సహాయం పొందినప్పటినుండి తనొక కీలుబొమ్మలా మారాడు. తన ఎథిక్స్ అన్నీ పక్కన పెట్టి రూలింగ్ గవర్న్ మెంట్ మీద ఆరోపణల్ని చేసి సిస్టెమ్యాటిక్ గా ప్రజల్ని దారి మళ్ళించాలి. ముఖ్యంగా మతం రంగులో మతపెద్దలూ, స్వాములతో కుమ్మక్కయ్యి ప్రభుత్వం ఎలా దోచుకుంటున్నారో ఎక్స్ పోస్ చెయ్యాలి. అఫ్ కోర్స్ తనకివన్నీ నచ్చవు కానీ తన ఇష్టాఇష్టాలతో ప్రస్తుతం ఎవరికీ పని లేదు. తను చెయ్యకపోతే వేరే ఛానెల్ వాళ్ళని కొని చేయిస్తారు కాబట్టి జనాలకి జరిగే బ్రైన్ వాషింగ్ ఎలాగూ జరుగుతుంది.

*అసలు నిత్యెక్కడుంది?*

అదే ప్రశ్న అక్కడికి దూరంగా ఓ ఆశ్రమంలో ఉన్న పూర్ణానంద స్వామీజీనీ వెంటాడుతోంది!

టోల్ గేట్ దాటాక వేగంగా కారుని వేగంగా పోనిస్తున్నాడు దేవరాజ్. అతని కళ్ళల్లోని తీక్ష్ణతని చూస్తోంది నిత్య.

"రాజ్, ఎందుకు మీ ప్రాణాలని పణంగా పెట్టి నన్ను కాపాడాటం? నన్ను వదిలేసి వెళ్ళిపోయుండచ్చు కదా" అంది పరీక్షిస్తున్నట్టు ముఖం పెట్టి.

"ఇంతదూరం తీసుకొచ్చింది వదిలేయటానికి కాదు నిత్యా"

"మరి? ఏం చేద్దామని.."

"ప్రస్తుతానికి నిన్నేదైనా సేఫ్ ప్లేస్ లో దాచాలి. తర్వాత ఆలోచించాలి ఏం చెయ్యాలో"

"ఇప్పుడు సరే, ఇలాంటి కష్టాలు జీవితాంతం వస్తాయి. అప్పుడేలా సేవ్ చేస్తావ్?" అంది కొంటెగా.

"జీవితాంతం సేవ్ చేస్తునే ఉంటాను. నీకు తోడుగా ఉంటూ" అని నాలుక్కరుచుకుని కళ్ళు తిప్పుకున్నాడు.

నిత్య నవ్వుతూ కిటికీ లోంచి బైటికి చూస్తోంది. రోడ్డుకి రెండువైపులా దట్టమైన అడవి తోడుగా వస్తోంది వాళ్ళతో. కాసేపు సైడ్ మిర్రర్ లో వెనక్కి చూసిన తర్వాత అంది "గమనించావా, మనల్నెవ్వరూ ఫాలో అవ్వట్లేదని!"

"అదే చూస్తున్నా, కళ్ళ ముందునుండి బండి తెచ్చినా, గేట్ దగ్గర స్పష్టంగా వాళ్ళని బురిడీ కొట్టించినా ఇంకా ఎవరూ రావట్లేదేంటా అని! బహుశా వాళళ్ దగ్గర కారు లేదేమో"

"కాదు, వాళ్ళ దగ్గర విలువైనదింకేదో ఉంది!"

"అంటే..?"

"నా పేరెంట్స్! వాళ్ళకి నా పేరెంట్స్ గురించి తెలిసుంటుంది, నీ ఫోనివ్వు " అంటూ తన చేతులోంచి లాక్కుని వాళ్ళ నాన్నకి చేసింది. ఓ రెండు నిమిషాలు మాట్లాడి పెట్టేసి "ఆల్ గుడ్ దేర్. మరి..నీ వాళ్ళెవరైనా"

"నాకా..నాకెవ్వరూ లేరు..ఐనా నా గురించి వాళ్ళకేం తెలీదుగా?"

"నీ ఫ్రెండ్..మరి?"

"ఎవడు సీనానా? వాడికేం కాదు, పెద్ద కంతిరీ..నిన్న రాత్రి మాట్లాడాలే"

"ఎందుకైనా మంచిది కాల్ చేద్దాం" అంటూ తనే చేసింది. "ప్చ్, స్విచ్చాఫ్ వస్తోంది..నాకేదో డౌట్ గా ఉంది" అంది.

"డోంట్ వర్రీ, ఛార్జ్ అయిపోయిందేమో, వాడికేం కాదులే" అన్నాడు నిత్య మొహంలో టెన్షన్ చూస్తూ.

## 24

గెస్ట్ హౌస్ లో ఓ మూలగా ఉనన్ పెద్ద హాల్లో కుర్చీలో కట్టేసి ఉన్నాడు సీనా. నోటిమీద ప్లాస్టర్, చేతులు రెండూ విరిచి వెనక్కి కట్టేసున్నాయి. తలంతా మైకంగా ఉంది. మెల్లగా కళ్ళు తెరిచి చుట్టూ చూసాడు. అంతా ఖాళీగా ఉంది ఆ

గదిలో, దూరంగా తలుపు దగ్గర మాట్లాడుకుంటున్నారు ఇద్దరు. తనకేమీ అర్థం కావట్లేదు. కొంతసేపు కట్లు విప్పుకోవడానికి పెనుగులాడాడు కానీ లాభం లేదు.

అప్పుడే సోమీ వేరే కారులో గెస్ట్ హౌస్ చేరుకున్నాడు. మెయిన్ రోడ్ నుండి రెండు కిలోమీటర్ల లోపలికి ఉండి చుట్టూ దట్టమైన అడివి ఉండటంతో ఆ ఏరియా మీటింగ్ లన్నీ అక్కడే చేస్తుంటారు తనూ, నర్సిరెడ్డి. లోపలికొస్తూనే సీనా నోటిమీది ప్లాస్టర్ గట్టిగా లాగేసాడు సోమీ. నొప్పి భరించలేక గట్టిగా మూలిగాడు సీనా. కోపంతో నిద్రలేకుండా తిరుగుతున్న సోమీ ఎర్రటి కళ్ళల్లోకి చూసి హడలిపోయి తల వాల్చేసాడు సీనా.

"రేయ్, ఎవర్రా మీరు?" అన్నాడు కోపంగా సోమీ.

ఆశ్చర్యపోయాడు సీనా. తనడగాల్సిన ప్రశ్న అది. సీనా నోరు తెరిచి ఏదో అనేంత లోపలే గుండె మీద గట్టిగా తగిలింది సోమీ ఇచ్చిన కిక్. కుర్చీతో సహా ఎగిరి వెనక్కి పడ్డాడు సీనా. ఆ తాకిడికి ఒళ్ళంతా షేక్ అవుతోంది, కన్నీళ్ళు ఆగట్లేదు. ఎవడో వచ్చి మళ్ళీ మామూలుగా కుర్చోబెట్టాడు.

"ఎవడ్రా నీతో పాటున్న దోస్తు?" అన్నాడు రెట్టిస్తూ సోమీ.

ఇంక ఆలశ్యం చెయ్యకూడదని "అన్నా, అన్నా, చెప్పేస్తాను" అన్నాడు తడబడుతూ సీనా. సోమీ మళ్ళీ కొట్టబోయి ఆగుతూ చెప్పమన్నట్టు సైగ చేసాడు. "అన్నా, తను నా ఫ్రెండ్ దేవరాజ్. నిత్యని ప్రేమించాడు" అని ఆగాడు. సోమీ వెనక్కితిరిగి సూరి వైపు చూసాడు ప్రశ్నార్థకంగా.

సూరీ కంగారుపడుతూ అన్నాడు "లేదన్నా, వీడబద్ధం చెప్తున్నాడు. నెల రోజులుగా నిత్య చుట్టూ రెక్కీ చేస్తున్నాం. వాడెప్పుడూ తనని కలవలేదు" అన్నాడు. సీనా అందుకుంటూ "అవును, నిన్నటికిముందు నిత్యని తనెప్పుడూ కలవలేదు..వన్ సైడ్ లవ్ తనది" అన్నాడు.

సోమీ, సూరి మొహాలు చూసుకున్నారు.

"వీడితో వేస్ట్ గానీ వాడికి కాల్ చేద్దామన్నా" అన్నాడు సూరి.

అరేంజ్ చెయ్యమన్నట్టు తలూపాడు సోమీ.

## 25

"దట్స్ ఇట్, ఐ యామ్ కాలింగ్ శివరాం" అంది నిత్య డెస్పరేట్ గా.

"నిన్న నైట్ చేద్దామంటే ఇందులో ఎవరు ఇన్వాల్వ్ అయ్యారో తెలుసుకుంటాడు సీనా అన్నావ్, ఇప్పుడతనే మిస్సింగ్, వుయ్ నీడ్ సమ్ హెల్ప్" అంది.

సరేనన్నట్టు తలూపాడు దేవరాజ్.

నిత్య శివరాం నంబరు సెర్చ్ చేస్తున్నప్పుడొచ్చిందొక వీడియో కాల్ ఆ మొబైల్ కి. అనుమాన పడుతూ ఎత్తింది నిత్య.

ఇద్దరు ముసుగులో ఉన్న వ్యక్తులున్నారా వీడియోలో. దేవరాజ్ కి చూపించింది భయపడుతూ. తన కారునొక పక్కగా ఆపి, హడావిడిగా మొబైల్ తీస్కొని చూస్తున్నాడు.

"హెలో దేవరాజ్, హడావిడిగా ఎక్కడికో వెళ్తున్నట్టున్నావ్? వెల్, కొంచెం బ్రేక్ తీస్కో" అంది అవతలి గొంతు. వెనకనుంచి "రేయ్, చచ్చార్రా మీరు. నేను ముందే వార్నింగిచ్చా. ఇనలేదన్నా!" అంది వెనక గొంతు.

"ఎవరు..ఎవరు మీరు?" అన్నాడు దేవరాజ్.

"చెప్తా, ఇద్దరం కలిసి కూర్చుని మాట్లాడుకుంటే అన్ని విషయాలూ చెప్తా. అరే! మర్చిపోయా, మీ ఫ్రెండ్ మీకోసం వెతుకుతుంటే నేనే హెల్ప్ చేద్దామని ఇక్కడికి తెచ్చా" అంటూ మొబైల్ ని వెనక్కి తిప్పాడా వ్యక్తి.

ఎదురుగా కుర్చీలో సీనా! ముక్కు కింద రక్తంతో, మొహం అంతా కందిపోయి అస్తవ్యస్తంగా ఉంది తన పరిస్థితి.

"బావా..!" అరిచాడు దేవరాజ్.

"బా.." అని మూలిగాడు సీనా. "సేవ్ మీ బా.."

హఠాత్తుగా ఒక ముసుగు వ్యక్తి వచ్చి స్టిక్ తో గట్టిగా కొట్టాడు కాళ్ళమీద. "బ్బా..." బాధతో విలవిలలాడాడు.

"రేయ్, సీనానొదిలేయండి. వాడు అమాయకుడు. నాకు దొరికారా మీ అందర్నీ నరికేస్తా" అన్నాడు ఆవేశంగా దేవరాజ్. తనకున్నది సీనా ఒక్కడే.

"ఛ, అందుకే కాచుకోని కూర్చున్నాం మరి! చూడూ, యువర్ గేమ్ ఈస్ ఓవర్, ఇమీడియెట్ గా నిత్యని అప్పగించి వీణ్ణి తీస్కెళ్ళు" అన్నాడు మొదటి వ్యక్తి.

"ఎక్కడికి రావాలి?"

"మీ ఇద్దరూ మల్లాపూర్ జంక్షన్ దాటాక టీ షాప్ దగ్గర కారాపి కిందకి దిగండి. అక్కడినుండి మావాళ్ళే తెస్తారు"

దేవరాజ్ మౌనంగా ఆలోచిస్తున్నాడు.

"ఇంకో విషయం, అక్కడికి పది నిమిషాల్లో రావాలి, నీ మొబైల్ లో ఎవరికన్నా ఫోన్లూ, మెసేజ్ లూ పెడితే ఎవ్వరూ ప్రాణాలతో మిగలరు" అని కాల్ ఎండ్ చేసాడు.

దేవరాజ్ అక్కడే కారులో కూలబడ్డాడు. *తన వల్ల సీనా ఇరుక్కున్నాడు.* నిత్య వైపు చూసాడు బాధగా "నువ్వు నాతో రావక్కర్లేదు నిత్యా, నిన్ను వేరే బస్సెక్కించి నేను సీనా కోసం వెళ్తాను" అన్నాడు.

"నేను వెళ్ళిపోతే, వాడు నిన్నూ సీనానీ బతకనివ్వడని తెలిసికూడా..ఎలా వెళతాననుకున్నావ్ రాజ్? ఏం చేసినా నేనూ నీతోనే" అంది బలంగా అతని

భుజం మీద చెయ్యి వేస్తూ.

నిత్యని ఆరాధనగా చూసి కారెక్కి వేగంగా ఆ జంక్షన్ వైపు వెనక్కి పోనివ్వసాగాడు దేవరాజ్.

ఏ మెసేజ్ పెట్టకూడదన్న కారణంతో నిత్య కాళ్ళు కట్టేసినట్టయ్యింది. సింహం బోనులోకి వెళ్తూ ఏ రక్షణా తీసుకోలేని పరిస్థితి. వాళ్ళు ఐదు నిమిషాల్లో రీచ్ అవుతున్నారనగా ఇంకో కాల్ వచ్చింది, స్పీకర్ ఆన్ చేసింది నిత్య. "హెలో బాసూ, నీకిచ్చిన త్రీ డేస్ టైం ఐపోయింది..ఆ ఐదూ ఇచ్చేస్తే..." బ్లాక్ మెయిలర్.

దేవరాజ్ కి చిర్రెత్తుకొచ్చింది. *ఓ పక్క ప్రాణాలు పోతుంటే వీడొకడు.* చటుక్కున ఓ ఐడియా వచ్చి "నేను మా ఫ్రెండ్ దగ్గరి కొచ్చా ఆ ఐదు సర్దటానికే..ప్రస్తుతానికి మూడు సర్దగలను, తర్వాత మిగతావి ఇస్తా" అన్నాడు.

"ఈ బేరాలేంట్రా బాబూ, సర్లే, ఐదూ వచ్చాకే నీ వీడియో నీకిస్తా. చెప్పు, ఎక్కడి కొచ్చి ఇస్తావ్ మూడూ?"

"నేనుకాదు, నువ్వే రావాలి. శ్రీశైలంలో ఉన్నాను, ఇట్నుంచి విజయవాడ వెళ్ళాలి. నువ్వో మూడు గంటల్లో మల్లవరం జంక్షన్ కి రాగలిగితే అక్కడే ఉన్న టీ షాప్ లో నా మనిషి ఉంటాడు. వాడికి బ్యాగ్ ఇచ్చి వెళ్తాను" అన్నాడు నిత్య వైపుచూస్తూ. తను ఆశ్చర్యంగా వింటోంది.

"ఇక్కడేవడెవడ్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడో అర్థం కావట్లేదు. సర్లే వస్తాను, నా జాగర్తలో నేనుంటాను" అన్నాడు నిట్టూరుస్తూ.

**హైదరాబాద్ క్రైం** బ్రాంచ్ హెడ్ వీరేందర్ వచ్చి ఇంటరాగేషన్ చేసి వెళ్ళాక మరింత దిగజారింది శివరాం పరిస్థితి.

నిత్య కనపడట్లేదని వస్తున్న వార్తలూ, రాజకీయ వత్తిళ్ళని సుమోటోగా తీసుకుని పర్సనల్ గా కేస్ టేకప్ చేసాడు వీరేందర్. శివరాంని కలిసే ముందు, అతని క్యాబిన్ బైట ఉండే ఇద్దరు ముగ్గుర్ని వ్యక్తిగతంగా ఆరా తీసి, నిత్యకి శివరాంకీ గొడవ జరిగిన తర్వాతే తను కనపడట్లేదనీ తెలుసుకున్నాడు. ఎందుకో తన సమాధానాలతో వీరేందర్ కన్విన్స్ అవ్వలేదనిపిస్తోంది శివరాంకి.

ఇంక ఆలోచించి ఉపయోగం లేదనుకొని వెంటనే పోలీస్ కంట్రోల్ రూంకి వెళ్ళాడు. అక్కడి టెక్నికల్ డిపార్ట్‌మెంట్ లో పని చేస్తున్న తనఫ్రెండ్ ని కలిసి ఎలాగైనా నిత్య మొబైల్ ద్వారా తన లొకేషన్ ని ట్రేస్ చెయ్యాలని అడిగాడు. కొంతసేపు ప్రయత్నించి జీపీయెస్ సిగ్నల్ తో సరిగ్గా ట్రేస్ అవ్వట్లేదనీ, డైరెక్ట్ కాల్ రిసీవ్ చేస్కుంటే ఈజీగా ట్రేస్ చెయ్యచ్చని చెప్పాడతను.

అదే పనిగా రింగ్ ఇవ్వడం మొదలుపెట్టాడు శివరా నిత్య ఫోన్ కి. కారులో నిత్య ఫోను తీస్కున్నప్పటినుండీ వస్తున్న కాల్స్ తో చిరాగ్గా ఉన్నాడు సూరి. చాలా సార్లు దాన్ని పారేద్దామనుకున్నాడు కానీ, అంత కాస్ట్లీ ఫోన్ ని వదలబుద్ధి కాలేదు. మళ్ళీ రింగ్స్ వస్తుండటంతో, చిరాగ్గా ఫోనెత్తి "ఎవుడ్రా నువ్వు? రాంగ్ నంబర్, మళ్ళీ చెయ్యబాకు" అని అరిచి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసాడు. ఊపిరి బిగపట్టి చూస్తున్నాడు శివరాం. లొకేషన్ ట్రేస్ చేసి, ఓ పేపర్ లో ప్రింట్ తీసాడా టెక్నీషియన్. దాన్ని శివరాంకి ఇవ్వబోతుండగా హఠాత్తుగా లాక్కుంటూ "థాంక్స్" చెప్పిందో గొంతు వెనకనుంచి.

విస్తుపోతూ వెనక్కి చూసాడు శివరాం, *వీరేందర్!*

ఇద్దరి వైపూ తీక్షణంగా చూసి ఫోన్ లో ఏవో ఆర్డర్స్ పాస్ చేస్తూ బైటికెళ్ళిపోయాడు వీరేందర్.

## 27

మల్లవరం జంక్షన్ దగ్గర కారు దిగి మెల్లగా టీ షాప్ వైపు నడుస్తున్నారు నిత్య, దేవరాజ్ లు. దాని బైట ఉన్న వాళ్ళల్లో ఒకడు వీళ్ళ వైపు వచ్చి "షాప్ దాటి ముందున్న బొలేరోలో కుర్చోండి ఇద్దరూ" అని చిన్నగా చెప్పి ముందుకి వెళ్ళిపోయాడు. దేవరాజ్ చేతిని గట్టిగా పట్టుకుంది నిత్య. తను ఆమె వైపు చూసాడు *రావద్దు* అన్నట్టుగా. నిత్య ఏమీ అనలేదు. ఇద్దరూ వెళ్ళి బొలేరోలో కుర్చోగానే, ఒకడొచ్చి మొబైల్ లాగేస్కోని స్విచ్చాఫ్ చేసాడు. తర్వాత ఇద్దరి కళ్ళకీ గంతలు కట్టి జెట్ స్పీడ్ లో గెస్ట్ హౌస్ వైపు పోనిచ్చాడు.

గెస్ట్ హౌస్ లో వాళ్ళిద్దరినీ ఆ పెద్ద హాలుకి తీసుకెళ్ళి కుర్చీల్లో కట్టేసాక విప్పారు కళ్ళకి కట్టిన గంతల్ని.

వాళ్ళని చూస్తూ పీలగా అరిచాడు సీనా "బా.."

దేవరాజ్ తలాడించాడు ధైర్యంగా ఉండమని.

సోమీ హాల్లోకి ఎంటరయ్యి "వెల్ కం, మై ఫ్యావరెట్ లవ్ బర్డ్స్!" అన్నాడు నవ్వుతూ. ముసుగు తీసేసాడిప్పుడు.

నిత్య అతడ్ని చూసి వెంటనే గుర్తుపట్టింది. దేవరాజ్ కే ఎవరో తెలియలేదు.

"బాబ్జీ, ఓ జర్నలిస్ట్ ని కిడ్నాప్ చేస్తే కాన్సీక్వెన్సెస్ దారుణంగా ఉంటాయని తెలుసుగా" అంది.

"ప్లీజ్ నిత్యా! ఇది కిడ్నాప్ కాదు. జస్ట్ మీటింగ్.. ఏరా ఇది కిడ్నాపా?" అన్నాడు సూరితో. తలూపాడు వాడు వెకిలిగా నవ్వుతూ.

"సీనా నెందుకు కొడుతున్నావ్? ఏం కావాలి నీకు?" అన్నాడు దేవరాజ్ ఆవేశంగా.

"అన్నా! వీడే అన్నా..నన్ను.." అంటూ ఆగిపోయాడు సూరి.

"చితక్కొట్టాడు..సార్ హీరో మరి. ఆ మాత్రం చెయ్యడా? చుప్" అన్నాడు చెయ్యి చూపిస్తూ.

"నిత్య కావాలి హీరో మాకు, మధ్యలో నువ్వొచ్చి నన్ను విలన్ని చేసావ్ అనవసరంగా" అన్నాడు సోమీ.

"నిత్యా, ఎవడు వీడు?" అన్నాడు దేవరాజ్.

"సోమీ బాబ్జీ, మంత్రి నర్సిరెడ్డి బామ్మరిది, రైట్ హ్యాండ్"

"రైట్, లెఫ్ట్ అన్ని హ్యాండ్సూ నేనే మా బావకి. అందుకే దేవాదాయ శాఖని మళ్ళీ బావకే వచ్చేట్టు ట్రై చెస్తున్నా. కానీ నువ్వే ఆ దారికి అడ్డొస్తున్నావ్" అన్నాడు వంకరగా మొహంపెట్టి.

"నేనా..!" అంది నిత్య అర్ధంకానట్టు.

"నువ్వు మొదలుపెట్టి నడిపిస్తున్న 'మనుషులు చేసిన దేవుళ్ళు ' ప్రోగ్రాం ఎంత రచ్చ చేస్తోందో తెలుసా? జనాలూ, కొంతమంది మా కార్యకర్తలే మమ్మల్ని ఎదిరించే స్థాయికొచ్చారు. ఎన్నాళ్ళో దేవుడు, మతం పేర్లతో పార్టీ నడిపిస్తున్న మాకు ఇది షాకింగ్ ట్రెండ్!"

"తను చేసే ఓ చిన్న ప్రోగ్రాంతో మీ పార్టీకే నష్టమా! బుర్రుండే మాట్లాడుతున్నావా?" అరిచాడు దేవరాజ్.

"రేయ్, వీడెక్కడున్నాడో తెలీక తెగ అరుస్తున్నాడు, అవునింతకీ ఎవరూ ఈ సార్?" అన్నాడు వెటకారంగా నిత్యతో.

"దేవరాజ్, ఫేమస్ డివోషనల్ సింగర్" అంది గర్వంగా తను.

వెనకాలే ఉన్న గ్యాంగ్ మెంబర్ బాల్రాజు అప్పుడే ఏదో బల్బ్ వెలిగినట్టు "ఔ అన్నా, యాదికొస్తోంది. మస్తు పాడతాడీ అన్న. సుపారీ పన్లు జేసినాక అన్న పాటలింటా, ఫుల్లు రిలాక్సింగ్ ఉంటది" అన్నాడు ఎక్సైటెడ్ గా.

సూరి వాడికి నోటిమీద వేలితో సైగ చేసాడు.

"వాహ్! నీకు మా గ్యాంగ్ లో కూడా మస్తు ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది బాస్" అన్నాడు సోమీ.

"నువ్వు పోయేలోపల మంచి పాట పాడించుకుంటా గానీ, ఇందాకేదో అన్నావ్ – 'చిన్న ప్రోగ్రామే కదా' అని? బాంబ్ కూడా చిన్నదే కానీ పేలితే..వేల మంది పోవచ్చు. అలానే, నిత్య ప్రోగ్రాం టీఆర్పీ రేటింగ్ 19 ఉంది. అంటే ఏడుపుగొట్టు సీరియల్స్ కన్నా చాలా మంచి ర్యాంకింగ్. స్టేట్ లో కొన్ని కోట్ల మంది చూస్తున్నారన్నమాట. అదీ కాక దాని మీద సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలూ, మీమ్స్, కాంట్రవర్సీ ఆర్టికిల్స్, ట్వీట్స్ అన్నీ కలిపితే ఆ చిన్న ప్రోగ్రాం ఎంతమందిని ఎఫెక్ట్ చేస్తోందో అర్ధమౌతుంది" అన్నాడు ఊపిరితీస్కోకుండా.

"ఇదంతా నేనొక్కతినే చెయ్యగలననుకున్నావా? నేను జస్ట్ యాంకర్ ని. చాలా మంది ఇన్వాల్వ్ ఐతేనే అవుతుంది" అంది నిత్య.

"ఆ..అదే..ఎవరెవరు ఇన్వాల్వ్ అయ్యారు? ప్రతిపక్షంలోంచి ఎవరిందంతా నడిపిస్తున్నారు? వాళ్ళతో కుమ్మక్కయ్యి నువ్వూ, నీ బాసు శివరాం ఎంత తిన్నారు? దీనికోసమే ఈ కిడ్నాప్..ఛ మీటింగ్" అన్నాడు తలమీద కొట్టుకుంటూ.

శివరాం పేరు వినగానే సూరి వెన్నులో వణుకు మొదలైంది. తనకు పదే పదే వచ్చిన కాల్స్ నిత్య బాస్ నుండే అని అర్థమయ్యి నీళ్ళు నమిలాడు. అదంతా సీక్రెట్ గా ఉంచకపోతే అన్న ఖచ్చితంగా చంపేస్తాడని అనిపించి నోరు తెరవలేదు.

నిత్య, దేవరాజ్ ఇద్దరూ మాట్లాడలేదు.

సోమీ ఒక్క ఉదుటున వచ్చి దేవరాజ్ చెంపపై బలంగా చరిచాడు. "రాజ్.." నిత్య అరుపు. ఇంకో వైపు కొట్టాడు. "ప్లీజ్..కొట్టకు" అంది తను.

"అరెరే చూసావా ఎఫెక్ట్, రెండ్రోజుల్లో మన వన్ సైడ్ లవ్ హీరో ఎలా పడేశాడో మేడమ్ ని" అన్నాడు సూరివైపు చూస్తూ.

ఇంతలో సోమీకో కాల్. ఫోన్ వైపు చూస్తూ సీరియస్ గా గెస్ట్ హౌస్ బైటికి నడిచాడు.

## 28

"ఏం బాబ్జీ, ఎట్టా ఉండా?" అన్నాడు నర్సిరెడ్డి.

"బావున్నా బావా, ఎక్కడున్నారు?"

"ఆ సీఎం కొత్త పితలాటకమేదో పెట్తాండాడ్లే, ఓ మీటింగ్ ల మీద మీటింగ్ లు. అవునూ, నువ్వేడుండా?"

చాలా చిక్కు ప్రశన్ అది. చిన్న క్లూ దొరికినా బావతో చాలా డేంజర్.

"మీడియాలో అదేదో ఛానెల్ పిల్ల మిస్సింగ్ కేస్ మీద మన ప్రభుత్వం మీద బురదపూసే ప్రయత్నం జరుగుతుండాది. నీకు మీడియాతో టచింగ్ మెక్కు గదా..నీకు తెలిసుండాదేమో అనీ.." అన్నాడు పాయింట్ కొస్తూ.

"బావా..ఆ పిల్ల మనకి చాలా డేంజర్ గా తయారౌతోందని..."

"అందుకని, ఆ యమ్మిని కిడ్నాప్ జేసినావా.." అని గద్దించాడు నర్సిరెడ్డి.

అదిరిపడ్డాడు సోమీ. ఎదురుగా ఏదో దైయాన్ని చూసినంత భయం తన కళ్ళల్లో. గొంతు తడారిపోయింది.

*ఎవడో బావకి పాస్ చేస్తున్నాడు ఇక్కడి విషయాలన్నీ.*

"ఏంది, పిచ్చిగానీ పట్టుండాదా నీకు? రెండు నెలల్లో ఎలక్షన్స్ పెట్టుకోని..ఇయన్నీ సీఎం దాకా పోతే నా పరువేంగానూ?"

"బావా...పార్టీ కోసమే ఇదంతా..."

"ఇంకెక్కువ మాట్లాడే పన్లే, ఆ పిల్లని యాడ్నించి తెచ్చారో ఆడ్నే వదిలేయండి, ఏడా ఈ విషయం జెప్పొద్దని గట్టి వార్నింగిస్తే జాలు..పెడతండా ఫోను" అని కాల్ కట్ చేసాడు.

సోమీకి తల తిరిగిపోయింది. పార్టీకోసమే, బావ కోసమే తనిదంతా చేస్తున్నా... ఈ తిట్లని సహించలేక పోయాడు. దీనంతటికీ కారణం నిత్య, దాన్ని కాపాడ్డానికొచ్చిన ఆ సింగర్ గాడు. వాళ్ళని బావ చెప్పినట్టు ఇంటికి కాదు, పైకి పంపించాలి. పళ్ళు కొరుకుతూ, తన రివాల్వర్ తీస్కోని లోపలికి వెళ్ళబోతుంటే హఠాత్తుగా ఓ కాషాయం ఫ్లాగ్ రెపరెపలాడుతున్న ఆడికారొకటొచ్చి తనముందు ఆగింది. క్షణంలో అర్థమైంది వచ్చింది ఎవరో. చటుక్కున గన్ వెనక దోపుకొని వెళ్ళి హడావిడిగా డోర్ తీసాడు.

పూర్ణానంద స్వామి. ఇద్దరూ ఒకళ్ళనొకళ్ళు చూసి ఓ క్షణం ఆగిపోయారు. స్వామీజీ కంగారుగా "బాబ్జీ! ఏంటీ గందరగోళమంతా? నర్శిరెడ్డి ఉన్నాడా లోపల? ఆ అమ్మాయెవరో కిడ్నాపుకీ నాకూ లింక్ పెడుతున్నారు? నా ఆశ్రమం మీదనుంచే మీ కార్లు తెగ తిరుగుతుంటే నర్సిరెడ్డి వచ్చాడనుకున్నాను గెస్ట్ హౌస్ కి" అన్నారు .

సోమీకేం అనాలో పాలుపోలేదు. నర్సిరెడ్డికీ, వాళ్ళ ఫ్యామిలీ అంతటికీ స్వామీజీ ఎంత చెప్తే అంత. వాళ్ళపాలిట దేవుడాయన. వంగి ఆయన కాళ్ళకి దణ్ణం పెట్టాడు ముందు.

స్వామీజీ ఇవేమీ పట్టించుకోకుండా లోపలికి నడిచారు. సోమీ తలపట్టుకొని వెనకాలే పరిగెత్తాడు. హాల్లో కట్టేసున్న వాళ్ళ ముగ్గుర్నీ చూసి షాకి తిని "ఎవరు నాన్నా వీళ్ళంతా, ఏం చేస్తున్నావ్?" అన్నారు స్వామి.

"స్వామీ, వీళ్ళు..మన పార్టీకి అగైనెస్ట్ గా పనిచేస్తున్నారని.." నసిగాడు.

వాళ్ళకి కొంచెం దగ్గరగా వెళుతూ పెద్దగా "హర హరా!" అన్నారు స్వామీజీ వెనక్కి తిరుగుతూ.

"ఇతనెవరనుక్కున్నావురా? ఆ పరమ శివుడు కంఠంలో విషం దాచుకుంటే ఇతగాడు తన ఒళ్ళంతా ఆ శివుడ్నే నింపుకున్నాడు. అద్భుతమైన గాయకుడు, అంతకు మించి శివ భక్తుడు. ఇలాంటి వాడినా నువ్వు తీసుకొచ్చింది" అన్నారు కోపంగా. అంతకుముందు కొన్ని కార్యక్రమాల్లో కలిసారాయన దేవరాజ్ ని.

"కట్లు విప్పండి ముందు వీళ్ళందరికీ, ఆ అమ్మాయేం చేసింది మిమ్మల్ని..?" చుట్టూ ఉన్న గ్యాంగ్ మెంబర్స్ సోమీ వైపు చూసారు.

*"నిత్యవి మాత్రమే"* అన్నట్లు సైగ చేసాడు సోమీ. కట్లు విప్పుతున్నప్పుడన్నారు మళ్ళీ స్వామి "ఈ అమ్మాయి మొన్న ఛానెల్ లో...యాంకర్‌వి కదమ్మా?" అనడిగారు.

అవునన్నట్టు తలూపింది తను.

"మా బాబ్జీ చెప్పినట్టు, నర్సిరెడ్డి లాంటి దైవ భక్తులకీ, మా లాంటి దైవదూతలకీ మాత్రం నువ్వు చేస్తున్న ప్రోగ్రాములు గొప్ప చేటు. ఎందుకమ్మా దేవుడన్నా మేమన్నా అంత ద్వేషం నీకు? పైగా నేనేదో నిన్ను చేస్తున్నానని వెధవ అనుమానాలందరికీ!"

స్వామీజీ నిత్య విషయంలో నైనా తనతో ఏకీభవించినందుకు లోపల్లోపలే సంతోషించాడు సోమీ.

నిత్య ఏదో చెప్పబోతుండగానే దేవరాజ్ అందుకొని "క్షమించాలి స్వామీ, మీరనుకున్నట్టు నిత్య నాస్తికురాలు కాదు పరమ భక్తురాలు" అన్నాడు

"ఏంటీ..!" నివ్వెరపోయారు స్వామీజీ.

"వాట్?!" నోరు తెరిచాడు సోమీ.

సూరి హడావిడిగా "వీడ్ని అస్సలు నమ్మొద్దన్నా, పెద్ద జాదూ గాడీడు. తప్పించుకోవడానికి ఏదో ప్లానేస్తున్నాడు"

"ఇక్కడ పెద్ద ప్లానేసి తప్పించుకునేంత సీన్ లేదు గానీ, నిత్య నిన్న పొద్దున బయల్దేరింది గుళ్ళో దర్శనానికే. నువ్వే కదా ఫాలో చేసి గుడిముందు కిడ్నాప్ అటెంప్ట్ చేసింది?"

సోమీ కేమీ అర్ధం కాలేదు. సూరి పరిస్థితి సరేసరి. స్వామీజీ నిత్య వైపే చూస్తున్నారు అనుమానంగా.

"రాజ్ కి దేవుడంటే గొప్ప ఇష్టం వల్ల అందరిలోనూ అతనికి భక్తులే కనపడతారు. కానీ నేను ముమ్మాటికీ నాస్తికురాలినే" అంది నిత్య తన సీక్రెట్ బైటపెట్టటం ఇష్టంలేక.

షాక్ తిన్నారు రాజ్, సీనాలు.

"ఇది కరెక్ట్! దేవరాజ్, ఇలాంటి వాళ్ళనా నువ్వు కాపాడాలని చూస్తోంది. నువ్వు ఎంత గొప్ప భక్తుడివైనా ఇది నీకు తగదు" అన్నారు స్వామీజీ అనునయంగా.

"స్వామీ, మీరు నన్నూ క్షమించాలి. నాకు దేవుడంటే అస్సలు పడదు" అన్నాడు దేవరాజ్

## 29

కంట్రోల్ రూం బైటికొచ్చిన వీరేందర్ సరాసరి టెక్నీషియన్ ఇచ్చిన ప్రింటవుట్ లో ఉన్న ప్రాంతానికి బయల్దేరాడు. కార్లోనే శ్రీశైలం కొండకింది పోలీస్ స్టేషన్ ఎస్సైతో మాట్లాడి అనుమానాస్పదంగా కనిపించే వాహనాలనీ, మనుషులనీ అదుపులోకి తీస్కోమన్నాడు. ఆ ప్రాంతంలోని అన్ని హోటళ్ళనీ, మారుమూల ఇళ్ళనీ కూంబింగ్ చెయ్యమన్నాడు.

దేవరాజ్ మాటలతో ఆ హాలంతా నిశ్శబ్దంగా మారింది. సోమీకి తిక్కతిక్కగా ఉంది.

"అసలిక్కడేం జరుగుతోంది రా, గేమ్స్ ఆడుతున్నారా ఇద్దరూ మాతో" అరిచాడు ఆవేశంగా.

ఇంతలో వాళ్ళ గ్యాంగ్ లో ఉన్న దేవరాజ్ ఫ్యాన్ ముందుకొచ్చాడు. ఏదో కనిపెట్టిన ఐన్ స్టీన్ లా మెరిసిపోతున్నాయి వాడి కళ్ళు.

"అన్నా, నాకు ఫుల్లు క్లారిటీ వచ్చిందే ఈళ్ళ గురించి, జెప్పనా?" అన్నాడు.

చెప్పమన్నట్టు సైగ చేసాడు సోమీ. వాడి గురించి తెలిసిన సూరి తలపట్టుకున్నాడు.

"ఏం లేదన్నా, క్లియరుంది. ఈమె పూర్వజన్మలో ఓ రాకుమారి. మస్తు దైవభక్తురాలన్నమాట. పూట పూటా పూజలూ, ప్రసాదాలూ..గదే పనన్నట్టు. కానీ ఈ పోరడు ఆ రాజ్యానికి పెద్ద సేనాధిపతి. చిన్నప్పటి నుండి దేవుడూ గీవుడూ జాన్తానై అనే తిరిగెటోడు. ట్విస్ట్ ఏందంటే గాళ్ళిద్దరూ ప్రేమలో పడ్డారు.. ప్రేమ గుడ్డిదన్నా నిజెంగా!

"రేయ్.." అరిచాడు సూరి. పట్టిచ్చుకునే స్థితిలో లేరెవ్వరూ.

వాడు కంటిన్యూ చేసాడు "గానీ ఆళ్ళ మ్యారేజ్ కి ఆ దేశపు రాజు 'నో' జెప్పిండు. బలవంతంగా ఇంకో రాకుమారుడికిచ్చి లగ్గం జెయ్యబోయాడు. ఆ పెళ్ళికెళ్ళే రాస్తలోనే రాకుమారి నిత్య కిందకి లోయలోకి దూకి పాపం పైకిబోయింది. సేనాధిపతి గమ్మునుంటడా? వాడు గూడ ఆమెతో పాటె లోయలోకి దూకాడు. ఇన్నేళ్ళ తర్వాత వాళ్ళిద్దరూ మళ్ళీ పుట్టారు. రాకుమారి నిత్య మీద ప్రేమతో పెదద్ భక్తుడిగా పుట్టాడు దేవరాజ్. సేనాధిపతి దేవరాజ్ తో కలిసి బతకడానికి దేవుడ్నే వదిలేసి నాస్తికురాలిగా పుట్టిందీ నిత్య. కానీ మళ్ళ గదే తిరకాసు రావడంతో ఆత్మలు రెండూ బాడీ ఎక్స్ఛేంజ్ అవ్వాలని చూస్తన్నయ్.. గదీ కత. అమ్మ తోడు, గిస్మంటి కష్టం పగోనిక్కూడ రావద్దె" అన్నాడు వాళ్ళిద్దరి వైపూ జాలిగా చూస్తూ.

చాలా మంది గ్యాంగ్ మెంబర్స్ మెస్మరైజ్ అయ్యి చూస్తున్నారు అతని వైపు.

"రేయ్, నోర్ముయ్యరా! నీ యబ్బ ఎవడి ఇష్టమొచ్చినట్టు వాడు వాగుతున్నాడు" అరిచాడు సోమీ.

స్వామీజీ చేత్తో గడ్డం పీక్కుంటూ "మీ వాళ్ళకి సినిమాల పిచ్చి ఎక్కువే, తగ్గించుకుంటే మంచిది" అన్నారు అసహనంగా సోమీ వైపు చూస్తూ.

"నిత్యా! నువ్వు మామూలుగా బతమాలితే చెప్పే రకం కాదు, నిన్ను కాదు నిజం చెప్పక పోతే వీడ్ని ఏసేస్తాను" అన్నాడు సోమీ దేవరాజ్ వైపు గన్ చూపిస్తూ.

"వద్దు..ప్లీజ్.." అరిచింది లోపలికి అప్పుడే వస్తున్న ఓ మగ గొంతు .

నిత్య అరుస్తుందనుకుంటే వీడెవడని అందరూ ఎంట్రన్స్ వైపు చూసారు.

దేవరాజ్, నిత్యలు ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నారు.

"ఎవరు?" కళ్ళతోనే అడిగింది తను.

కన్ను కొట్టాడు తను.

మళ్ళీ ఆ వ్యక్తే "అన్నా, ప్లీజ్ దేవరాజ్ ని చంపి నా కడుపు కొట్టద్దన్నా" అన్నాడు బతిమాలుతూ.

సోమీ అయోమయంగా "ఎవడ్రా వీడు? ఇక్కడికెందుకు తెచ్చారు?" అన్నాడు పక్కనున్న ఇద్దరు గ్యాంగ్ మెంబర్స్ ని చూస్తూ.

"అన్నా.. వీడు, ఆ టీ షాప్ కాడికొచ్చి 'దేవరాజ్ కావాలి, బ్యాగ్ కావాలి' అని లొల్లిపెడ్తుంటే దొటొచ్చి తోలకొచ్చాం" అన్నాడు.

సీనా ఆ బ్లాక్ మెయిలర్ వైపు కోపంతో చూసాడు. వాడివేమీ పట్టించుకోకుండా "దేవరాజ్! నా డబ్బిస్తే నేనెళ్ళిపోతా, మీరేదో మీటింగ్ లో ఉన్నట్టున్నారుగా" అన్నాడు.

"రేయ్, నువ్వు తెలిసి మాట్లాడుతున్నావా? తెలివిగా మాట్లాడుతున్నావా? ఇది మీటింగ్ లా కనపడుతోందా నీకూ...నీ..." అన్నాడు సూరి ముందుకొస్తూ.

ఓ గ్యాంగ్ మెంబర్ అ బ్లాక్ మెయిలర్ ని ఈడ్చుకెళ్ళి కుర్చీలో పడేసి చేతులు కట్టేసాడు.

"దేవరాజ్ నీకేమన్నా అప్పున్నాడా?" అంది నిత్య.

"సార్, ఫేమస్ బ్లాక్ మెయిలిస్ట్. డబ్బులు కావాలని సతాయిస్తుంటే, ఇక్కడే ఇస్తా రమ్మన్నాను" అన్నాడు దేవరాజ్.

"ఏం చేసాడని బ్లాక్ మెయిల్ చేస్తున్నావు బాబు" అన్నారు స్వామీ ఇంకా గడ్డాన్ని సవరిస్తూ.

వాడు సీనా వంక దొంగచూపులు చూస్తూ మౌనంగా ఉన్నాడు.

"అడుగుతున్నారుగా, చెప్పు. ఛస్తావ్" ఉరిమాడు సోమీ.

"నాదేం తప్పు లేదన్నా, ఈ దేవరాజ్ నిజ స్వరూపం బయటపెట్టాలని.." వణికిపోతూ నసిగాడు.

"ఆ.."

" 'మీ నిజం' ఎండీనే వీడియోలు తీయమన్నాడన్నా..."

నిత్య దేవరాజ్ వైపు చూసింది *"అర్థమైందా"* అన్నట్టు. అంతలో దొటొచ్చి "మరి వీడియోలు పట్టుకొని శివరాం దగ్గరికెళ్ళకుండా ఈ సొంత పెత్తనాలేంటి? మర్యాదగా చెప్పు, ఎవరు చేయిస్తున్నారిదంతా? అసలు నీకు దేవరాజ్ వెళ్తున్న ప్లేస్ లు ఎలా తెలుస్తున్నాయ్" అంది గట్టిగా.

సీనా అందుకొని "వాడేదో పిచ్చి వాగుడు వాగుతుంటే, ఇంకా ఈ ప్రశ్నలేంటి. తన్ని తరిమెయ్యక" అన్నాడు కరుగ్గా.

వాడు ఏడుపు మొహం పెట్టి “అన్నా! ఇది అన్యాయం, నువ్వే డబ్బులు నొక్కేద్దామని ప్లాన్ చేసి, నన్ను డైవర్ట్ చేసి, ఇప్పుడిలా ఇరికిస్తున్నావా?” అన్నాడు సీనాతో.

దేవరాజ్ నమ్మలేనట్టుగా చూసాడు సీనా వైపు.

“ఈ జహంగీర్ గాడు చెప్పేవన్నీ అబద్ధాలు బా..చూసావుగా ఇందాకట్నించీ తిక్కతిక్కగా మాట్లాడుతున్నాడు”

“వాడిపేరు నీకెలా తెలుసు?” అన్నాడు దేవరాజ్ అంతా అర్థమైనట్టు ముఖం పెట్టి.

సీనా తలదించుకున్నాడు.

“బావా! మూడేళ్ళనుండీ కలిసుండి ఇదేనా నన్ను అర్థం చేసుకుంది? నా కొస్తున్న దాంట్లో నీకు షేర్ ఇస్తున్నా కదా, అయినా నువ్విలా...” తల విదిలించాడు బాధగా.

గ్యాంగ్ మెంబర్స్ లో ఇదంతా చూసి బాగా ఎమోషనల్ అయ్యారు కొందరు.

“దిస్ ఈస్ టూ మచ్” అరిచాడు ఒకడు. “ద్రోహి!” బుస కొట్టాడు ఇంకొకడు సీనా వైపు కత్తి చూపిస్తూ.

## 30

రకరకాల చోట్ల ఎంక్వైరీ చేసిన శ్రీశైలం ఎస్సైకి చివరికి కాటేజ్ దగ్గర జరిగిందంతా చెప్పాడు జల్సా జానీ. అతన్ని తీసుకొని ఆ హైవే మీదున్న షాపుల మీదా, బళ్ళమీదా నిఘా పెట్టారు పోలీసులు. మల్లవరం జంక్షన్ దగ్గరునన్ టీ షాప్ దగ్గర అనుమానంగా తిరుగుతున్న రెండు కార్లని ఫాలో చెయ్యడం మెదలుపెట్టారు. అదే సమయానికి వీరేందర్ కూడా అక్కడికి చేరుకున్నాడు.

ఉన్నట్టుండి ఇద్దరు గ్యాంగ్ మెంబర్స్ "అన్నా, పోలీసులు! పోలీసులు!" అని అరుచుకుంటూ సోమీ వాళ్ళున్న హాల్లోకొచ్చారు. ఉన్నట్టుండి అక్కడంతా గందరగోళంగా మారింది. పారిపోయిన వాళ్ళు పారిపోయారు. సోమీ లాయలిస్టులు ఓ పదిమంది మాత్రం అతని చూట్టూ ఉన్నారు. తృటిలో స్వామీజీని వెనక డోర్ నుంచి తప్పించారు ఆయన ఇద్దరు శిష్యులు.

సోమీకొక్క క్షణం ఏం చెయ్యాలో అర్థంకాలేదు. దేవరాజ్ కట్లని విడిపించుకోవడానికి మళ్ళీ పెనుగులాడాడు. సీనా ద్రోహంతో దేవరాజ్ మీద సానుభూతి పెరిగిన ఓ గ్యాంగ్ మెంబరొచ్చి సోమీ అరుస్తున్నా పట్టించుకోకుండా వచ్చి కట్లు విప్పాడు.

ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా దేవరాజ్ సీనా కట్లు విప్పేసాడు. సూరి ఉద్రేకంతో కత్తితీసుకొని దేవరాజ్ వైపు పరిగెత్తుకుంటూ వచ్చాడు. పక్కనున్న కుర్చీని ఎత్తి సూరి తలమీద కొట్టాడు దేవరాజ్. మూలుగుతూ కింద పడ్డాడు తను.

దేవరాజ్ ఎలాగైనా తప్పించుకోవాలని నిత్య చేతిని పట్టుకొని బైటికి పరిగెత్తబోయాడు.

"వాళ్ళ ముగ్గుర్నీ నరికెయ్యండ్రా!" అరిచాడు సోమీ. అక్కడ మిగిలిన పదిమందీ వాళ్ళని చుట్టుముట్టారు. ఒకడ్ని ఒడిసి పట్టుకొని సీనా వాడి కత్తిని దేవరాజ్ వైపు విసిరాడు. దాన్ని అందుకొని అందర్నీ బెదిరిస్తూ దగ్గరికొచ్చిన వాళ్ళని కాళ్ళతో తంతున్నాడు దేవరాజ్. సోమీ ఒక్క ఉదుటున వాళ్ళ దగ్గరికొచ్చి ఓ వైపు నిత్య భుజం పట్టుకుని వెనక్కి లాగుతున్నాడు.

దేవరాజ్ వాళ్ళని బలంగా తోసుకుంటూ వెనక డోర్ దగ్గరకొచ్చేటప్పటికి చెవులు చిల్లులు పడేలా గన్ షాట్స్ వినపడ్డాయి.

అందరూ భయపడి నిల్చుండిపోయారు. నిత్య చెవులు మూసుకుంది గట్టిగా. వీరేందర్ ఇంకో నలుగురు పోలీసులతో లోపలికొచ్చాడు. పక్కనే జల్సా జానీ కూడా ఎంటరయ్యాడు.

ఇదే ఛాన్స్ అనుకొని సోమీ నిత్యని హఠాత్తుగా తన ముందుకు లాగాడు. ఓ మోచేత్తో ఆమె గొంతుని బిగించి, ఇంకో చేత్తో ఆమె తలపై గన్ పెట్టాడు.

"ఒక్క అడుగు ముందుకేస్తే నిత్య తల పేలిపోతుంది" అరిచాడు అటూ ఇటూ చూస్తూ.

అంతా నిశ్శబ్దం.

వీరేందర్ మెల్లగా అన్నాడు "తనని చంపి నువ్వు తప్పించుకోలేవ్, మీరందరూ ఇక్కడే ఎన్ కౌంటరైపోతారు" అన్నాడు.

"దీన్ని చంపుతుంటే నువ్వు చూస్తూ ఉండగలవా అయితే, నోరు మూసుకుని మీ గన్స్ అన్నీ ఇటు కింద పడెయ్యండి" అన్నాడు.

పక్కనుంచి జానీ బాధగా "సొంత మేనకోడల్ని చంపడానికి నీకు చెయ్యెలా వచ్చిందిరా?" అన్నాడు.

"మేనకోడలా!" అయోమయంగా చూసాడు సోమీ.

"మేనకోడలా!" సేమ్ కన్ఫ్యూజన్ వీరేందర్ మొహంలో.

"అవును సార్! వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు. పెద్దలకి నచ్చక ఇద్దర్నీ రెండ్రోజుల్నించి ఛేస్ చేసి మరీ చంపాలని చూస్తున్నారు. నువ్వేం బాధపడకు చెల్లెమ్మా! ఈ అన్నయ్య ప్రామిస్ చేసినట్టు మీకు పెళ్ళి చేసి తీరతాడు" అని హామీ ఇచ్చాడు నిత్యవైపు చూస్తూ.

ఈ కొత్త యాంగిల్ అర్ధం కాక తికమక పడుతూ గన్ను తోనే బుర్ర గోక్కుంటున్నాడు సోమీ.

అదే ఛాన్స్ అనుకొని అతడ్ని గట్టిగా తోసి నిత్యని తన వెనక దాచాడు దేవరాజ్.

సోమీ కోపంగా అరుస్తూ అతని వైపు గన్ పాయింట్ చేసి కాల్చబోయేంతలో వీరేందర్ కాల్చిన బుల్లెట్ తగిలి చేతిలోని గన్ ఎగిరిపడింది. దేవరాజ్ ఎగిరి గుండెల్లో కొడితే సరిగ్గా పోలీసుల దగ్గరెళ్ళి పడ్డాడు సోమీ. తనతో సహా మిగిలిన గ్యాంగ్ మెంబర్స్ అందరినీ అదుపులోకి తీసుకున్నారు పోలీసులు.

## 31

పోలీసులతో వెళ్తున్న సూరి చేతిలోంచి తన మొబైల్ లాక్కుంది నిత్య.

"చాలా మిస్సైనట్టున్నావ్?" అన్నాడు దేవరాజ్ నవ్వుతూ.

తను బిజీగా ఏదో టైప్ చేస్తోంది దాంట్లో.

"సరే గానీ ఇందాక మీరు చెప్పింది ముక్క అర్ధంకాలా.."అన్నాడు సీనా జానీతో.

జానీ అతడ్ని కిందనుంచి పైదాకా చూస్తూ "ఎవరితను? ఆ రౌడీల తాలూకా అనుకున్నా" అన్నాడు.

"సార్, నేను దేవరాజ్ ఫ్రెండ్ ని...వాళ్ళు చితక్కొట్టారు...కనపడట్లేదా" అన్నాడు సీనా ఏడుపు మొహం పెడుతూ.

నవ్వారు దేవరాజ్, నిత్యలు.

"నీకు కావాల్లే" అంది నిత్య సీనా వైపు వేలు ఆడిస్తూ.

"జన్మలో చెయ్యను తల్లీ మళ్ళీ.." అన్నాడు సీనా వంగి ఇద్దరికీ దణ్ణం పెడుతూ.

"ఇంక నీకా ఛాన్సివ్వను బా..." అన్నాడు దేవరాజ్ నిత్య ని చూస్తూ "నాకు నచ్చిందే.."

"..చేస్తాను" కంప్లీట్ చేసింది నిత్య వాళ్ళకి తన మొబైల్ చూపిస్తూ. అందరూ తొంగి చూసారు.

"*నన్ను సపోర్ట్ చేసిన ఫ్యాన్స్ అందరికీ చాలా థాంక్స్, నేను 'మీ నిజం' ఛానెల్ నుండి రిజైన్ చేస్తున్నాను. #బిలీవ్ ఇన్ యూ #నిత్యసేఫ్*" అని పోస్ట్ చేసి ఉంది తన ట్విట్టర్ అకౌంట్ లో.

దేవరాజ్ ఆమె చేతిని పట్టుకుని బైటికి నడవబోయాడు.

"ఆ, ఆ, అప్పుడే పాణి గ్రహణం చెయ్యకూడదు బాసూ. ముందు దండలు మార్చే ప్రోగ్రాం ఉంది. పదండి కొండమీదకి" హడావిడిపెట్టాడు జానీ.